ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 15.03.2025 | సంపుటి : 11 సంచిక : 243 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## పోలీసుల కస్టడీలో నిందితుడి మృతి

**నిజామాబాద్,మార్చి14(జనంసాక్షి)** నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్న ఓ నిందితుడు మంణించడం కలకలం సృష్టించింది. విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్న నిందితుడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లుగా పోలీసులు వర్గాలు తెలిపాయి. అయితే పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే మరణించాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మిగతా 2లో..



## త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

**విమానంలో చెలరేగిన మంటలు..**


**రెక్కపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు**

**అమెరికాలోని డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఘటన**

**డెన్వర్(జనంసాక్షి):** అమెరికాలోని డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విమానాశ్రయం గేటు వద్ద దిగిన విమానంలో

మిగతా 2లో..





# మార్చిలోనే మండుతోంది..

- దంచికొడుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఉదయం నుంచే భానుడి ప్రతాపం

తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్‌లో గురువారం అత్యధికంగా 40.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో రాగల మూడురోజుల్లో మూడురోజుల్లో ఉదయం పొగమంచే ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ 39 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశం ఉందని పేర్కొంది. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో పలుచోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాల సీజన్ ముగియడంతో.. జనవరి చివరి వారం నుంచే ఎండలు భారీగా పెరిగాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఎండాకాలం ఇంకా ప్రారంభం కాక ముందే ఉష్ణోగ్ర తలు భారీగా పెరుగుతుండడంతో తెలంగాణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే..

## బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదం

**అసెంబ్లీ స్పీకర్‌ను అవమానపరిచి ఆందోళన చేస్తారా..!**

**ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముమ్మాటికి శిక్షార్హుడే..**

**చట్టసభలంటే విలువ లేదా? • మండిపడ్డ మంత్రి పొన్నం**

**హైదరాబాద్(జనంసాక్షి):** చట్టసభల్లో ప్రజాస్వామ్యానికి సభకు నాయకుడు ముఖ్యమంత్రి అయితే, సభ మొత్తానికి అధిపతి స్పీకర్ అని, అటువంటి స్పీకర్‌ని పట్టుకొని సభ మీ ఒక్కడిది కాదు అని మాట్లాడడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమే గాకుండా మొత్తం సభనే అవమానించడం అని మంత్రి అన్నారు. స్పీకర్ మళ్ళీ అవకాశం ఇచ్చి పొరపాటు అంటుంటే కూడా సరిదిద్దుకోకుండా ఇష్టారీతిన మాట్లాడిన జగదీశ్ రెడ్డి ముమ్మాటికి శిక్షార్హుడని అన్నారు. ఇంతచేసి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు అని మండిపడ్డారు. ఇవన్నీ గమనిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వం కూడా జగదీశ్వర్ రెడ్డి చేసింది తప్పు.. స్పీకర్ ని సభలో ఇలా మాట్లాడడం మంచిది కాదని చెప్పడం లేదంటే వారికి సభ పట్ల ఎంత గౌరవం ఉందో తెలుస్తుందని అన్నారు. అడ్డంగా సభావేదికగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, ధర్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్ళే ఈరోజు నిరసనలు

మిగతా 2లో..



*సభావేదికగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, తిరిగి వాళ్లే రాష్ట్రంలో నిరసనలకు పిలుపునివ్వం హాస్యాస్పదం. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం అయినా బీఆర్ఎస్ పార్టీకి రావాలి. ఇదే బీఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించి బర్తరఫ్ చేశారు.. ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా?.. - మంత్రి పొన్నం*

## బీఆర్ఎస్ దళితులను అవమానిస్తోంది

**మొదటి నుంచీ ఆ పార్టీ తీరు ఇంతే..**

**ఎంపీ చామల కిరణ్ కుమార్**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి దళితులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అది అందరికి తెలుసునని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ స్పందించారు. గతంలో బీఆర్ఎస్, కెసిఆర్

మిగతా 2లో..



## గ్రూప్-3 ఫలితాలు విడుదల

**పరీక్ష రాసిన అభ్యర్థుల మార్కులతో పాటు జనరల్ ర్యాంకుల జాబితాను ప్రకటించిన టీజీపీఎస్సీ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో గ్రూప్ -3 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. గతేడాది నవంబర్‌లో జరిగిన ఈ పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కులతో పాటు జనరల్ ర్యాంకుల జాబితాను టీజీపీఎస్సీ శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించింది. అలాగే, గ్రూప్-3 పరీక్ష తుది కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో 1,365 గ్రూప్-3 ఉద్యోగాలకు 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా, గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో మూడు పేపర్లుగా జరిగిన ఈ పరీక్షలకు కేవలం 50.24 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్- 1, గ్రూప్ -2 ఫలితాలను టీజీపీఎస్సీ తాజాగా గ్రూప్-3 ఫలితాలను విడుదల చేసింది. అలాగే, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను మార్చి 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను మార్చి 19న ప్రకటించనున్నారు. 2022 డిసెంబర్ లో మొత్తం 1388 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా 5 లక్షల 36వేల 400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది నవంబర్ 17,18 తేదీల్లో నిర్వహించిన పరీక్షకు 50.24 శాతం అంటే 2లక్షల 67వేల 921 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో 18వేల 364మంది

మిగతా 2లో..



## పదేపదే ఢిల్లీ వెళ్లినా ఫలితం సున్నా..

**రాష్ట్రానికి రూపాయి తేలేదు**

**రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే ఢిల్లీ పర్యటనలు చేసినా రాష్ట్రానికి ఎటువంటి నిధులు తీసుకురాలేకపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం పదవి చేపట్టినప్పటి నుంచి రేవంత్ రెడ్డి మొత్తం 39 సార్లు ఢిల్లీకి వెళ్లినప్పటికీ, రాష్ట్రాభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోయారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ తీరు 'గల్లీలో హోదా మరిచి తిట్లు, ఢిల్లీలో చిట్‌చాట్లు' అన్నట్లు ఉందని, తన కార్యాలయం దాటి బయటకి రావడానికైనా తడబడే రేవంత్ ఢిల్లీలో మాత్రం మాటలతో కోటలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని సెటైర్ వేశారు. ఈ మేరకు ఇవాళ కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో పలు ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో సాగునీటి సమస్య తారాస్థాయికి

మిగతా 2లో..

## ఉగ్రవాదుల కిడ్నాప్ వెనుక భారత్ హస్తం ఉందేమో?

### పాక్ అనుమానం.. తిప్పికొట్టిన భారత్

**ఉగ్రవాదమే ఆ దేశమే మూలమని వెల్లడి**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బలోచిస్థాన్ రైలు హైజాకింగ్‌లో భారత్ పాత్ర ఉండొచ్చంటూ పాక్ విదేశాంగ శాఖ చేసిన ఆరోపణలపై భారత్ ఘాటుగా స్పందించింది. తన సమస్యలకు పొరుగువారిని బాధ్యుల్ని చేసే ప్రయత్నం మానుకోవాలని మండిపడింది. 'పాక్ చేసిన నిరాధార ఆరోపణలను మేము తిరస్కరిస్తున్నాము. ప్రపంచంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మూలం ఎక్కడుందో ప్రపంచానికి అంతటికీ తెలుసని హెచ్చరించింది. ఎదుటి వారిపై నెపం నెట్టి బాధ్యుల్ని చేసే బదులు పాక్ ఆత్మపరిశీలన చేసుకోవాలని భారత్ ఘాటుగానే స్పందించింది. తన అంతర్గత సమస్యలకు, వైఫల్యాలకు ఇతరులు కారణమని అనడం

మిగతా 2లో..

### పిల్లలపై కూడా కనికరం చూపలేదు

**27 గంటలపాటు మోకాళ్లపైనే కూర్చోబెట్టారు**

**తమ కష్టాలను గుర్తుచేసుకున్న మిలిటెంట్ల చెర నుంచి బయటపడ్డ బందీలు**

**బలోచిస్తాన్(జనంసాక్షి):** పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటనలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ అదుపులో ఉన్న పలువురిని సైనిక బలగాలు సురక్షితంగా విడిపించాయి. మిలిటెంట్ల చెరలో తాము అనుభవించిన కష్టాలను వారు

మిగతా 2లో..

## మా బంగారం తుప్పు పడుతోంది



- మా నగలు మాకిచ్చేయండి
- తెలంగాణ హైకోర్టులో గాలి పిటిషన్
- తిరస్కరించిన ధర్మాసనం

**హైదరాబాద్(జనంసాక్షి):** ఓఎంసీ కేసులో భాగంగా తమ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న 53 కిలోల బంగారు నగలు తుప్పుపట్టిపోతాయంటూ గనుల వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నగలతో పాటు తమ వద్ద సీజ్ చేసిన నగదు, రూ.5 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమార్తె జి.బ్రాహ్మణి,

మిగతా 2లో..

## కమల దళపతిపై వీడని ప్రతిష్టంభన

**తెలంగాణ రాష్ట్ర బీజెపి అధ్యక్షుడి ఎంపిక మరింత ఆలస్యం?**

**ఎవరికి అప్పగించాలనే అంశంపై జాతీయ నాయకత్వం తర్జనభర్జన**

**బీసీ నేతల్లో ఒకరిని ఎంపిక చేసేందుకు కసరత్తు**

**జాబితాలో అందరికంటే ముందు వరుసలో ధర్మపురి అర్వింద్ ?**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో కమల దళపతి ఎంపిక మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర పగ్గాలు ఎవరికి అప్పగించాలనే అంశంపై జాతీయ నాయకత్వం తర్జనభర్జన పడుతోంది. తెలంగాణలో బీసీ వాదం బలంగా వినిపిస్తోన్న నేపథ్యంలో అధ్యక్షుడి ఎంపిక సవాల్‌గా మారింది. అయితే బిసినే చేస్తారన్న వాదనా ఉంది. లేకుంటే ఎస్సీని కుర్చీలో కూర్చోబెడతారన్న వాదనా ఉంది. ఈ క్రమంలో ధర్మపురి అర్వింద్ పేరు తాజాగా చర్చల్లో ముందుకు వచ్చినట్లు సమా చారం. ఆయన అయితే బండి

మిగతా 2లో..


## క్యాసినో, కోడిపందేల వ్యవహారం.. భారాస ఎమ్మెల్సీపై ప్రశ్నల వర్షం

**పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నాలుగున్నర గంటలపాటు విచారించిన పోలీసులు**



**హైదరాబాద్(జనంసాక్షి):** కోడి పందేలు, క్యాసినో నిర్వహించిన వ్యవహారంలో భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు విచారించారు. సుమారు నాలుగున్నర గంటల పాటు ఆయన్ను ప్రశ్నించారు. ఆయనతో పాటు న్యాయవాది, ఫామ్‌హౌస్ లీజుకు తీసు కున్న వ్యక్తి వచ్చినా పోలీసులు లోపలికి అనుమతిం చలేదు. మొయినాబాద్ పోలీసులు నోటీసు ఇవ్వడంతో విచారణకు హాజరైనట్టు తెలిపిన పోచంపల్లి.. అధికా రులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చినట్టు వివరించారు. ఇది రాజకీయ ప్రేరేపితమైన కేసు అని, ఫామ్‌హౌస్ లీజు వివరాలు అడిగితే చెప్పానని తెలిపారు.గత నెల 11న మొయినాబాద్ తొల్కట్ట గ్రామంలోని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో క్యాసినో, కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు సోదాలు చేశారు. 61 మందిపై కేసు నమోదు చేశారు. ఫామ్‌హౌస్ యజమాని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విచారణకు హాజరు కావాలని ఫిబ్రవరి 13న నోటీసులు ఇచ్చారు. న్యాయవాదిని పంపి సమాధానం ఇచ్చిన

మిగతా 2లో..



## అమెరికాలో జన్మతఃపౌరసత్వం రద్దుపై పట్టు వీడని ట్రంప్

**ఫెడరల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకు అమెరికా అధ్యక్షుడు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** జన్మతః పౌరసత్వం రద్దుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. తాజాగా తన ఆదేశాలను ఫెడరల్ కోర్టులు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యాక్టింగ్ సొలిసిటర్ జనరల్ సారా హారిస్ ఈ పిటిషన్ సాధారణమైనదని అభివర్ణించారు. మూడు దిగువ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను వ్యక్తిగత స్థాయికే పరిమితం చేయాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. అంతేగాక, ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగబద్ధమా.. ?కాదా..? అన్న విషయంపై అభిప్రాయాన్ని మాత్రం కోరలేదు. ట్రంప్ జారీ చేసిన ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నాయి. మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో పిటిషన్లు దాఖలు కావడంతో కోర్టులు ఇంజెక్షన్ ఆర్డర్లు జారీ చేశాయి. ఈ ఆదేశాలు దేశ ఎగ్జిక్యూటివ్ విభాగాన్ని రాజ్యాంగపరమైన విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇటీవల ట్రంప్ సర్కారు తొలగించిన పలువురు ప్రొబేషనరీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆరు ఏజెన్సీలకు కాలిఫోర్నియాలో న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టినవారికి మాత్రమే కాకుండా..

మిగతా 2లో..

### గ్రీన్‌కార్డ్ వచ్చినా అమెరికాలో శాశ్వత నివాసం లభించదు


**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**

9లో

### కిమ్‌తో ఇప్పటికీ మంచి సంబంధాలు

**అతడో న్యూక్లియర్ పవర్: ట్రంప్**

2లో



## బ్యాంకు ఉద్యోగుల సమ్మె సైరన్

**24,25 తేదీల్లో యథావిధిగా స్ట్రైక్ జరుగుతుందని వెల్లడి**

వార్త 9లో

**వలపు వల..**

## పాక్‌కు మిలిటరీ రహస్యాలు లీక్

**ఉత్తరప్రదేశ్‌లో వ్యక్తి అరెస్టు**



## రష్యా, చైనా.. దూరం.. దూరం..

### రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసిన డ్రాగన్



**బీజింగ్(జనంసాక్షి):** తన మిత్రదేశం రష్యా చమురుకు చైనా దూరం జరుగుతోంది ఈ నెలలో రెండు సంస్థలు పూర్తిగా ఆయిల్ కొనుగోలు నిలిపివేయగా, మరో రెండు సంస్థలు ఆ పరిమాణాన్ని తగ్గించుకున్నాయి. ఈ ఏడాది జనవరిలో రష్యా చమురు ఉత్పత్తిదార్లు, ట్యాంకర్లపై అమెరికా కఠిన ఆంక్షలు విధించిన నేపథ్యంలో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలయ్యాక, పుతిన్ ప్రభుత్వానికి చైనా, భారత్ అతిపెద్ద చమురు కొనుగోలుదా రులుగా మారిన సంగతి తెలిసిందే.అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చమురు సరఫరా తగ్గుతుందన్న ఆందోళనల మధ్య భారత్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. దీంతో గత నెలలో లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి భారత్‌కు ముడిచమురు దిగుమతులు పెరిగాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. రష్యా నుంచి మన చమురు కొనుగోళ్లు జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో 3% తగ్గి రోజుకు 1.54 మిలియన్ బ్యారెళ్ల (బీపీడీ)కు పరిమితమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. మన మొత్తం చమురు దిగుమతుల్లో లాటిన్ అమెరికా వాటా 9 శాతానికి చేరింది. 2021 డిసెంబరు తర్వాత ఇదే అత్యధికం. రష్యా వాటా కాస్త తగ్గి 30.5 శాతాని కి చేరింది.ప్రస్తుతం ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం శాంతి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాల్పుల విరమణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ చర్చల ఫలితంగా ఆంక్షలు సడలించడం, తొలగించడం కానీ జరిగితే మళ్లీ కొనుగోళ్లు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. టెహ్రాన్ (ఇరాన్ రాజధాని) న్యూక్లియర్ కార్యక్రమంపై చర్చలు తిరిగి ప్రారంభం కావాలని చైనా ఆకాంక్షిస్తోంది. ఈక్రమంలో చర్చల నిమిత్తం రష్యా, ఇరాన్ దౌత్యవేత్తలకు చైనా ఆతిథ్యం ఇచ్చింది. అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల అమెరికా

మిగతా 2లో..




## గ్రూప్ - 3 ఫలితాలు విడుదల

ఓఎంఆర్ ఇన్ వ్యాలీడ్ కాగా 2 లక్షల 49వేల 557 మంది జనరల్ ర్యాంకులను టీజీపీఎస్సీ ప్రకటించింది. జనవరి 8వ తేదీన గ్రూప్ 3 ప్రాథమిక కీ విడుదల చేసిన కమిషన్ 8 నుంచి 12వ తేదీ వరకు కీపై అభ్యంతరాలను స్వీకరించింది. అయా అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం తుది కీ, జనరల్ ర్యాంకులు విడుదల చేసినట్టు కమిషన్ పేర్కొంది.అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్ సైట్‌లో లాగిన్ ఐడీ ద్వారా ఫలితాలు చూసుకోవచ్చని తెలిపింది. జనరల్ ర్యాంకుల ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్?కి ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వటంతోపాటు వెబ్ సైట్ లోనూ వివరాలు పొందుపరుస్తామని స్పష్టం చేసింది. గ్రూప్ 3 ఫలితాల విడుదల సందర్భంగా టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే ఎలాంటి తప్పులు లేకుండా గ్రూప్స్ ఫలితాలు విడుదల చేశామన్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని కమిషన్ ఇచ్చిన అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 19న ప్రకటించనున్నారు.

## కుంచనపల్లి జాతీయరహదారిపై ప్రమాదం

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

**భీమవరం(జనంసాక్షి):** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రకవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కుంచనపల్లి వద్ద జాతీయ రహదారి పనులు చేస్తున్న వాహనాన్ని ఏలూరు వైపు నుంచి తణుకు వైపు వెళుతున్న శాంట్రో కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతి చెందిన వారు భోగెళ్ళ వెంకట సత్య సురేన్, భార్య నవ్య అక్కడికక్కడే మృతి చెందగా, వారి కుమారై నాలుగేళ్ళ చిన్నారి వాసవి కృష్ణ తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఉప్పులూరి శ్రీరమ్య పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుండి మండపేటలోని ఏడిదకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని.. దర్యాప్తు ప్రారంభించారు.

## కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ ప్రమాణం

ఓట్టావా(జనంసాక్షి):కెనడా నూతన ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ (59) ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం, ట్రంప్ నుంచి విలీన ముప్పు, ఫెడరల్ ఎన్నికలు వంటి సవాళ్ల నేపథ్యంలో 24వ ప్రధానిగా కార్నీ బాధ్యతలు స్వీకరించారు.కెనడా గవర్నర్ జనరల్ మేరీ సైమన్ సమక్షంలో కార్నీ నూతన ప్రధానిగా ప్రమాణం చేశారు. పీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్లు జస్టిన్ ట్రూడో (ఏబీబబితిని ఎతీబీటవజీబీ) ఈ జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో అధికార లిబరల్ పార్టీకి కొత్త సారథి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో పార్టీలో జరిగిన ఎన్నికల్లో బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లకు గతంలో గవర్నర్‌గా పనిచేసిన కార్నీ ఘన విజయం సాధించారు. అమెరికా-కెనడా సంబంధాలు దెబ్బతింటున్న సమయంలో కార్నీ బాధ్యతలు స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఫోర్ట్ స్మిత్‌లో 1965లో జన్మించిన మార్క్ కార్నీ హార్వర్డ్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. గోల్డ్‌మన్ శాక్స్‌తో ప్రయాణం ప్రారంభించి.. బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లకు గవర్నర్‌గా పనిచేశారు. 2008-09 ఆర్థిక సంక్షోభం వేళ పరిష్కార మార్గాల్లో కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి అవసరమైన చర్యలను సమన్వయపరచడంలో కీలకంగా వ్యవహరించి అందరి ప్రశంసలు అందుకున్నారు.2020లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను వీడిన అనంతరం ఐరాస ఆర్థిక, వాతావరణ మార్పుల విభాగం రాయబారిగా సేవలందించారు. ట్రూడో రాజీనామా ప్రకటన అనంతరం లిబరల్స్ పార్టీ సారథి రేసులో నిలిచి.. ఘన విజయం సాధించారు. గతంలో ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయని, కేబినెట్‌లో పనిచేసిన అనుభవం లేని కార్నీ.. కెనడా నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

## స్వర్ణ దేవాలయం వద్ద ఇనుప రాడ్డుతో దుండగుడి హల్‌చల్

### ఐదుగురికి గాయాలు

**అమృత్‌సర్(జనంసాక్షి):**పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ప్రసిద్ధ స్వర్ణ దేవాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ సృష్టించారు. ఆలయ కాంప్లెక్స్‌లో ఓ వ్యక్తి ఇనుపరాడ్డుతో చేసిన దాడిలో ఐదుగురు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు.దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు.. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. భక్తులు, స్థానికులు ఉన్న కమ్యూనిటీ కిచెన్ లేదా గురురామ్‌దాస్ లంగర్ వద్ద దుండగుడు ఇనుపరాడ్డుతో దాడి చేయగానే అక్కడ తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి.గాయపడిన వారిలో శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి చెందిన ఇద్దరు వాలంటీర్లు ఉన్నారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. నలుగురి పరిస్థితి నిలకడగా ఉండగా.. ఒకరి ఆరోగ్య పరిస్థితి మాత్రం సీరియస్‌గా ఉన్నట్లు ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ జస్మీత్ సింగ్ తెలిపా రు. దాడికి పాల్పడిన వ్యక్తితో పాటు అతడి సహచరుడిని స్థానికులు అదుపు చేయగా.. ఆ తర్వాత పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. దాడికి ముందు నిందితులు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే..



తెలుపుతున్నారు అంటూ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రాష్ట్రంలో నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వం హాస్యాస్పదం అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం అయినా బీఆర్ఎస్ పార్టీకి రావాలి అని పేర్కొన్నారు. సభలో ఏ విధంగా ఉండాలి సభ వేదికపై ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా ఇలా చేస్తున్నారంటే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నారని అనేది అర్థం అవు తుందన్నారు. ఇది ప్రజలు గమనించాలి.. సభకు కొన్ని సంప్రదాయాలు పద్ధతులు ఉంటాయన్నారు. దళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారని మాట్లాడుతున్నారు.. ఇదే బీఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించి బర్తరఫ్ చేశారు.. ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా?.. ఇటువంటి మాటలు, నిరసనలు వద్దు ఎందుకంటే ఇది బీఆర్ఎస్ కి మంచిది కాదని పొన్నం సూచించారు.

### బీఆర్ఎస్ దళితులను అవమానిస్తోంది

ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇప్పుడు తమ స్పీకర్‌ను బీఆర్ఎస్ అవమానించిందని మండిపడ్డారు. కెటిఆర్‌కు దళితులపై ఉన్న ప్రేమేంటో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించి, అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తాననడం సిగ్గు చేటని అన్నారు. కెటిఆర్‌కు దళితులపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని.. రెచ్చగొట్టేలా మాట్లాడి అసెంబ్లీని స్తంభింప చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉగ్రవాదుల కిడ్నాప్ వెనుక భారత్ హస్తం ఉందేమో?



మానుకోవాలని విదేశాంగ శాఖ రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. హైజాకింగ్ ఘటనపై పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పందించారు. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాదులు ఆఫ్ఘనిస్థాన్‌లోని తమ లీడర్లతో టచ్‌లో ఉన్నారని అన్నారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలను ఆఫ్ఘాన్ భూభాగంలో అనుమతించరాదని అక్కడి వారికి తాము గతంలో అనేకసార్లు స్పష్టం చేసినట్టు కూడా పేర్కొన్నారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న పాత్రధారులు సూత్ర దారులు అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా తమకు సహకరించాలని ఆఫ్ఘాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విలేకరులు భారత్ ప్రస్తావన తెచ్చారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలకు గతంలో భారత్‌ను నిందించే పాక్ విధానంలో ఏమైనా మార్పు వచ్చిందా అని అన్నారు. దీనిపై పాక్ ప్రతినిధి స్పందిస్తూ తమ విధానంలో మార్పు ఏమీ లేదని అన్నారు. 'వాస్తవాల్లో మార్పు ఏమీ లేదు. పాక్‌పై ఉగ్రవాదం ఎగదోయడం వెనక భారత్ ఉంది. ఈ ఘటనలో మాత్రం కాల్ డాటా ఆఫ్ఘనిస్థాన్ పాత్ర సూచిస్తోంది. మేము అది మాత్రమే అన్నాము' అని అన్నారు. పొరుగు దేశాలను అస్థిర పరిచి ప్రపంచవ్యాప్తంగా హత్యలను భారత్ ప్రేరేపించే ప్రయత్నం చేస్తోందని కూడా అన్నారు. భారత మీడియా కూడా బలోచ్ చర్యలను పొగుడుతూ కథనాలు ప్రచురిస్తోందని, ఇది భారత విధానాలకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. దీంతో, భారత్ పాక్ తీరును ఎండగడుతూ గట్టి రిప్లై ఇచ్చింది. అయితే, రైలును తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఇటీవల పాక్ ఆర్మీ పేర్కొంది. ఆపరేషన్ ముగిసినట్టు వెల్లడించింది. అయితే, బలోచ్ ఆర్మీ మాత్రం ఈ ప్రకటనను తోసి పుచ్చింది. బలోచిస్థాన్‌లో జరిగిన రైలు హైజాక్ ఘటనపై పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి షఫ్‌ఖత్ అలీఖాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. పొరుగుదేశాల్లో అస్థిరత నెలకొల్పేందుకు ప్రయత్నిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా హత్యాకాండకు పాల్పడుతోందని అన్నారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందినీ హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. రైలు హైజాక్ వెనక ఆఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. పాక్ చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. పాక్ బాధ్యతారహిత వ్యాఖ్యలు వారి దిగజారుడు విధానాలకు నిదర్శనమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోలేని పాక్ ఇతర దేశాలపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికింది.

### పిల్లలపై కూడా కనికరం చూపలేదు

గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాదులు రైలు ఇంజిన్ కింద పేలుడు పదార్థాలు అమర్చి పేల్చడం వల్ల బోగీలు పట్టాలు తప్పాయని రైలు డ్రైవర్ అమ్జాద్ పేర్కొన్నాడు. రైలు ఆగిన వెంటనే ఉగ్రవాదులు కిటికీలను పగలగొట్టి ఆయుధాలతో బోగీలలోకి చొరబడ్డారని తెలిపాడు. అసలు ఏం జరుగుతుందో అర్థం కాలేదని అన్నాడు.తమను కాపాడడానికి ప్రయత్నించిన సైనికులను దారుణంగా హత్య చేశారని.. పారిపోవడానికి ప్రయత్నించినవారిని కాల్చి చంపడంతో భయంతో తాము అక్కడే ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. మహిళలు, చిన్న పిల్లలపై కూడా మిలిటెంట్లు దాడి చేశారన్నారు. మహబూబ్ అహ్మద్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. వేర్పాటువాదులు తమను బందీలుగా చేసుకున్నారని తెలియడంతో ఇక తాము జీవితంపై ఆశలు వదులుకున్నామన్నాడు. రైలులో మృతదేహాలను చూసి భయంతో వణికిపోయినట్లు తెలిపాడు.బందీలుగా చేసుకున్న తమను మారుమూల పర్వత ప్రాంతాలలో గంటల తరబడి నడిపించుకుంటూ తీసుకువెళ్లి.. వివిధ ప్రదేశాలలో బంధించారని తెలిపాడు. 27 గంటల పాటు తమను మోకాళ్లపైనే కదలకుండా కూర్చోబెట్టారని గుర్తు చేసుకున్నాడు.

### క్యాసినో, కోడిపందేల వ్యవహారం..
## భారాస ఎమ్మెల్సీపై ప్రశ్నల వర్షం

శ్రీనివాస్‌రెడ్డి.. ఫామ్‌హౌస్ లీజుకు ఇచ్చానని తెలిపారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని పోలీసులు.. వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసులు ఇవ్వగా.. ఇవాళ విచారణకు హాజరయ్యారు.

## మా బంగారం తుప్ప పడుతోంది

కుమారుడు జి.కిరీటిరెడ్డి పిటిషన్లు దాఖలు చేయగా, తెలంగాణ హైకోర్టు వాటిని కొట్టేసింది. బంగారు నగలు తుప్పుపట్టిపోతాయని, విలువ తగ్గుతుందన్న గాలి అభ్యర్థనను తిరస్కరించింది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే వాటిపై హక్కులు తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా రూ.884.13 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదుచేసి, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఈడీ కూడా హక్కులు కోరుతోందని, అందువల్ల ఈ దశలో సీజ్ చేసిన వాటిని అప్పగించాలని ఉత్తర్వులు ఇవ్వలేమంది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే నగలను, సొమ్మును తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చంది.

## తృటిలో తప్పిన పెనుప్రమాదం

### విమానంలో చెలరేగిన మంటలు..
### రెక్కపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు
### అమెరికాలోని డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఘటన

ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా ప్రయాణికులను బయటకు పంపించారు. విమానం రెక్కపై నిలబడిన ప్రయాణికులను సిబ్బంది కిందకు దింపుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో బయటకు వచ్చాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.అమెరికా (జూం) కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 5.15 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొలరాడో స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్ట్ నుంచి డాలస్ ఫోర్ట్ వర్త్‌కు బయల్దేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఇంజిన్‌లో వైబ్రేషన్స్ రావడంతో వెంటనే విమానాన్ని డెన్వర్ కు మళ్లించి అత్యవసరంగా దించేశారు. ఎయిర్‌పోర్టులోని టాక్సీయింగ్ ప్రదేశంలో విమానం దిగిన వెంటనే ఇంజిన్‌లో మంటలు తలెత్తాయి.చూస్తుండగానే విమానమంతా దగ్ధమైంది. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల నుంచి బయటకు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఘటన సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

### రష్యా,చైనా.. దూరం దూరం

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే, తాము అగ్రరాజ్యంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. "అమెరికా ఆదేశా లు ఇవ్వడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. ట్రంప్‌తో చర్చలు చేపట్టే ఉద్దేశం నాకు లేదు. ఆయనకు ఇష్టమొచ్చింది చేసుకోవచ్చు" అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఇరాన్ అత్యంత శుద్ధి చేసిన యురేనియం నిల్వల్ని పెంచుకుంటోందని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ వెల్లడించింది. 90శాతానికి పైగా శుద్ధి చేసిన యురేనియాన్ని మాత్రమే అణు బాంబుల తయారీలో వాడతారు. ఈ పరిణామాలతో ఒప్పందం కుదరాల్సిన అత్యావశ్యక పరిస్థితి నెలకొంది.

### పదేపదే ఢిల్లీ వెళ్లినా ఫలితం సున్నా..

చేరుకున్నా, పంటలు ఎండిపోతున్నా, రైతులు బిక్కుబిక్కుమంటూ విలవిలలాడుతున్నా సీఎం కనీసం సమీక్ష సమావేశం కూడా నిర్వహించకుండా ఢిల్లీకి వరుసగా పర్యటనలు నిర్వహించడం సరికాదని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత సంబంధాల గురించి తెలంగాణ ప్రజలకు ఎలాంటి అవసరం లేదని, మీ సంబంధం మీకే, దాని వల్ల తెలంగాణ ప్రజలకు ఏ మేలు జరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో మీ పార్టీకి ఓటు వేసి మోసపోయామని ఇప్పుడు గ్రామా గ్రామాన, గల్లీ గల్లీల్లో తీవ్ర అసంతృప్తితో బయటపడుతున్నారు. అయితే, ప్రజల వాస్తవ సమస్యలపై స్పందించాల్సిన సీఎం మాత్రం తమ బాధలను పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతూ రాజకీయ లబ్దిపొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'ముఖం బాగోలేక అద్దం పగలగొట్టినట్లు, పాలన చేయలేక పాతగజ్జెలు మోగించినట్లు హామీలు అమలు చేయక, గాలిమాటలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు,' అంటూ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. చివరగా, 'జాగో తెలంగాణ జాగో' అంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని తన ట్వీట్‌లో పిలుపునిచ్చారు.

# కమల దళపతిపై వీడని ప్రతిష్టంభన

సంజయ్ లాగా దూకుడుగా వ్యవహరిస్తారని అంటు న్నారు. ఏప్రిల్ లో జాతీయ అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని భావి స్తున్నారు. అప్పటిలోగా దేశంలోని సగానికిపైగా రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ అధ్యక్షుడి ఎన్నిక మార్చి నెలాఖరులోపు ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కేంద్రంలో కీలకమైన బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను మరొకరికి అప్పగించాలని భాజపా నాయకత్వం గతంలోనే నిర్ణయించింది. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావులతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు సైతం వినిపిస్తున్నాయి. మురళీధర్‌రావు పేరు కూడా తెరపైకి రావచ్చని కొందరు నేతలు చెబుతున్నారు.భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను పార్టీ జాతీయ నాయకత్వం ఇప్పటికే నియమించింది. తెలంగాణ భాజపా పగ్గాలను పార్టీలో ముందు నుంచి ఉన్నవారికే ఇస్తారా? ఇతర పార్టీల నుంచి వచ్చి ముఖ్యనేతలుగా ఉన్న వారికి అవకాశం ఉంటుందా? అన్నది తేలాల్సి ఉంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను భాజపా కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

### అమెరికాలో జన్మతఃపౌరసత్వం రద్దుపై
# పట్టు వీడని ట్రంప్

అమెరికాలో జన్మించిన ప్రతిఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరి కా గడ్డపై పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పట వరకు ఈ పక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది. 2024 చివరినాటికి 5.4 మిలియన్ల మంది ప్రవాస భారతీయులు అక్కడ నివసిస్తున్నారు. అమెరికా మొత్తం జనాభాలో సుమారు 1.47 శాతం భారతీయులే. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టినవారు. ట్రంప్ ఆర్డర్ రాజ్యాంగ పరిధిలోకి వస్తుందా రాదా అన్నది చర్చ చేస్తున్నారు.

### కిమ్‌తో ఇప్పటికీ మంచి సంబంధాలు

#### అతడో న్యూక్లియర్ పవర్: ట్రంప్



న్యూయార్క్(జనంసాక్షి):ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చారు.కిమ్‌తో సంబంధాలను పునరుద్ధరించే ఆలోచన ఉందా? అని విలేకరి ప్రశ్నించగా.. 'కిమ్ జోంగ్ ఉన్‌తో నాకు మంచి సంబంధం ఉంది. ఏం జరుగుతుందో చూద్దాం. కానీ, కిమ్ కచ్చితంగా ఒక న్యూక్లియర్ పవర్' అని ట్రంప్ బదులిచ్చారు. ఈసందర్భంగా రష్యా, చైనా వద్ద ఉన్న అణ్వాయుధాల గురించి ఆయన ప్రస్తావించారు. అణ్వాయుధాల సంఖ్యను తగ్గించగలిగితే అది గొప్ప విజయమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి అనే దానికంటే.. అవి ఇతరుల వద్ద కూడా ఉండటం అవసరమని ట్రంప్ తెలిపారు. కిమ్ వద్ద అణ్వాయుధాలు చాలా ఉన్నాయన్నారు. భారత్, పాకిస్థాన్ వంటి ఇతర దేశాల వద్ద కూడా ఉన్నాయని, వాటిని ఇతరులకు సైతం ఇవ్వాలని ట్రంప్ పేర్కొన్నారు. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్ విషయంలో పట్టువిడుపులతో వ్యవహరించారు. 2019లో వియత్నాంలో వీరిద్దరూ భేటీ అయ్యారు. అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉ.కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలం అయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరుదేశాల మధ్య దూరం పెరిగింది. తాజాగా అగ్రరాజ్యం విషయంలో కిమ్ వైఖరి మరింత కఠినంగా మారింది. ట్రంప్‌తో ఎటువంటి వ్యక్తిగత దౌత్యాలు నడపకూడదని ఆయన నిర్ణయించారు.మరోవైపు.. దక్షిణ కొరియా-అమెరికా సైనిక విన్యాసాలు, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలతో కొరియా ద్వీపకల్పంలో నిత్యం ఉద్రిక్త వాతావరణమే ఉంటుంది. ద.కొరియా-యూఎస్ సైనిక విన్యాసాలను తమపై దాడికి సన్నాహంగా కిమ్ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ద.కొరియాలోని బుసాన్ పోర్ట్‌లో అమెరికాకు చెందిన విమాన వాహక నౌకను మోహరించారు. ఇది కిమ్ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది.

## క్రెమ్లిన్ సమీపంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి

**మాస్కో(జనంసాక్షి):**

ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుంటే.. వారం వ్యవధిలో రష్యాపై ఉక్రెయిన్ రెండోసారి డ్రోన్లతో దాడికి పాల్పడింది. అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ సమీపంలో ఉన్న భవనాన్ని ఒక డ్రోన్ ఢీకొట్టింది.రష్యా అధికారులతో చర్చల కోసం అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్.. మాస్కోకు రహస్యంగా వెళ్లినట్లు వార్తలు వచ్చిన తరుణంలో ఈ దాడి చోటుచేసుకుంది. కాగా, ఆ డ్రోన్లను తమ వైమానిక దళం అడ్డుకుందని మాస్కో మేయర్ వెల్లడించారు.మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో ఇటీవల రష్యాపై ఉక్రెయిన్.. అతి పెద్ద దాడి చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సోమవారం రాత్రి వందల డ్రోన్లతో విరుచుకుపడింది. 10 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ చేసిన ఈ దాడులను రష్యా విజయవంతంగా అడ్డుకుంది. క్షిపణి రక్షణ వ్యవస్థలతో 337 డ్రోన్లను కూల్చేసింది. ఈ దాడుల కారణంగా ఒకరు మృతి చెందగా 9 మంది గాయపడ్డారు. పలు భవనాలు, కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజధాని మాస్కో లక్ష్యంగానే 70 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడులు చేసిందని, వాటిని కూల్చేశామని మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో విమానాశ్రయాల్లో కొద్ది సేపు విమానాలను నియంత్రించాల్సి వచ్చింది. మాస్కో రీజియన్‌లోని డొమోడెడోవో రైల్వే స్టేషన్‌లో రైళ్లను కొద్దిసేపు నిలిపేశారు.



# పోలీసుల కస్టడీలో నిందితుడి మృతి

**- చిత్రహింసలతోనే చనిపోయాడని బాధితుల ఆరోపణ**

హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన సంపత్ అనే యువకుడు శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతని ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోయిన ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంపత్‌తోపాటు మరో ఏజెంట్‌పై పది రోజుల క్రితం కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అయితే బాధితుల డబ్బులు రికవరీ కోసం సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ నిమిత్తం రెండు రోజుల క్రితం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్నారు. విచారణలో భాగంగా గురువారం మధ్యాహ్నం సంపత్‌ను తన స్వస్థలమైన జగిత్యాలకు తీసుకువెళ్లారు. గురువారం రాత్రి 9.45 నిమిషాలకు తిరిగి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కొద్ది సేపటికే తన చెయ్యి నొప్పిగా ఉందని నిందితుడు చెప్పడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడికి వెళ్లిన కొద్ది సమయానికి సంపత్ మరణించాడు. దీంతో పోలీసులు విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. పోలీసుల టార్చర్ వల్లే సంపత్ చనిపోయాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సంపత్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో హాస్పిటల్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఈ ఘటనపై విచారణ నిర్వహించేందుకు మేజిస్ట్రేట్ నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి రానున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** రిమాండ్ ఖైదీ మృతి చెందిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన సంపత్ అనే వ్యక్తి పోలీసు రిమాండ్‌లో మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశాడనే అభియోగంతో సంపత్ అనే వ్యక్తిని నిజామాబాద్ సైబర్ క్రైం పోలీసు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారని, విచారణ ప్రక్రియలో ఉన్నప్పుడే అకస్మాత్తుగా మరణించాడని, పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టడంతో అతను చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని, అతనిని చూడటానికి కూడా అనుమతించలేదని కుటుంబసభ్యులు ఆరోపించారని తెలిపారు. విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం, దానికి సహకరించే పద్ధతుల్లో ప్రభుత్వం వ్యవహరిస్తే ఇది సమాజంలో ఒక తప్పుడు సంకేతాన్ని ఇస్తుందని, ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, పోలీసులే దీనికి కారణమని తేలితే సంబంధిత అధికారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రేవంత్ రెడ్డిది దుష్టపాలన

- ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?
- సబితా ఇంద్రారెడ్డి విమర్శలు



**రంగారెడ్డి, మార్చి 14 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్టపాలన కొనసాగిస్తున్నారని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించకుండా చేయడానికి జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ చేయడం దారుణమని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడ్జెట్ సెషన్ పూర్తయ్యేదాకా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎక్కడ తప్పు మాట్లాడారో చెప్పకుండా జగదీశ్ రెడ్డిని ఎలా సస్పెండ్ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎక్కడ కూడా స్పీకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె మండిపడ్డారు. సరైన సమయంలో సరైన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఇచ్చినా హామీలను నెరవేర్చమంటే సస్పెండ్ చేసుడేందని ఆమె అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే సస్పెండ్ చేసిందన్నారు. సభను సజావుగా నడపలేక సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సాంప్రదాయాలకు తెరలేపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆమె అన్నారు. కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. తప్పుడు నిర్ణయాలతో ప్రజల చులకన అవుతున్నారన్న సంగతి మర్చిపోతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది అన్నారు. రైతుల సమస్యలను సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు ఉన్నాయని ప్రస్తావిస్తే ఏకపక్షంగా సస్పెండ్ చేయడం ఏమిటని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# దళిత స్పీకర్‌ను అవమానించడం సబబేనా?

- జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి, మార్చి14 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ అల్లరి చేయడం ద్వారా సమస్యలను డైవర్ట్ చేయాలని చూస్తోందని, తమ తప్పుల కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తోందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. అసెంబ్లీలో స్పీకర్‌ను అవమానించిన జగదీశ్ రెడ్డి నీతి వాక్యాలు పలుకుతున్నారని మండిపడ్డారు. చేసిన తప్పులను ఒప్పుకోకుండా బిఆర్ఎస్ కూడి సిగ్గు లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేయడం సరైనదేనని అన్నారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ.. బిఆర్ఎస్ నేతలు నిరసనలు చేయడం మరింత దుర్మార్గమని అన్నారు. గతంలో బిఆర్ఎస్, కెసిఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇప్పుడు తమ స్పీకర్‌ను బిఆర్ఎస్ అవమానించిందని మండిపడ్డారు. కెటిఆర్‌కు దళితులపై ఉన్న ప్రేమేంటో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించి, అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తాననడం సిగ్గు చేటని అన్నారు. కెటిఆర్‌కు దళితులపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని.. రెచ్చగొట్టేలా మాట్లాడి అసెంబ్లీని స్తంభింప చేస్తున్నారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి యాగీని ప్రజలు చూస్తున్నారని, వీరికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని షబ్బీర్ అన్నారు.

# 400 ఎకరాల భూమిని వేలంపాట వేస్తే ఖబడ్దార్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** గచ్చిబౌలిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఉన్న 400 ఎకరాల భూమిని వేలంపాట వేస్తే ఖబడ్దార్ అని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థుల సంఘాలతో శుక్రవారం కాచిగూడలోని అభినందన హోటల్లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని, వేలంపాటలో పాల్గొని భూములు కొనుగోలు చేయరాదని, కొన్నవారు తిరిగి వారి దగ్గర నుండి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ప్రభుత్వ వేలం భూముల వేలం పాటలలో ఎవరు పాల్గొనరాదని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ వేలంలో పాల్గొని భూములను కొనుగోలు చేస్తే, వారి దగ్గర నుండి విద్యార్థి సంఘాలతో కలిసి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వాగ్దానం చేసిన 2,324.05 ఎకరాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి బదిలీ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 295 గురుకుల హాస్టల్స్ ఉన్నాయని, వాటిలో ఒక్కటి కూడ సొంత భవనం లేదని, వెంటనే సొంత భవనాలను నిర్మించి ప్రభుత్వ నిజాయితీని చాటుకోవాలని డిమాండ్ చేశారు. భూముల విషయంపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. భావితరాల కోసం ప్రభుత్వం కోరారు. ఈ కార్యక్రమంలో కోలా జనార్ధన్, మురళీకృష్ణ యాదవ్, శివ కుమార్ యాదవ్, డి.అభినీష్, నందగోపాల్, ఉదయ్ నేత, రాజు నేత, మణికంఠ, రవి యాదవ్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తితో ట్రిపుల్ ఐటీ క్యాంపస్

- ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల విద్యార్థులకు వెసలుబాటు



**హనుమకొండ, మార్చి14 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 100 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ క్యాంపస్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్యాంపస్ ఏర్పాటయితే.. బాసరలో మాత్రమే ఉన్న ట్రిపుల్ ఐటీ విద్య ఇప్పుడు హనుమకొండలో కూడా అందుబాటులోకి రానుంది. ఈ కొత్త క్యాంపస్ ఏర్పాటుతో మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల విద్యార్థులకు అనువుగా ఉండేలా ఎల్కతుర్తిని ఎంపిక చేశారు. గురువారం (మార్చి 13న) హన్మకొండ జిల్లాకు వచ్చిన అధికారులు.. క్యాంపస్ ఏర్పాటుకు భూమిని పరిశీలించి, కలెక్టర్‌తో చర్చలు జరిపారు. రెండేళ్లలో క్యాంపస్ సిద్ధం కావచ్చని అధికారులు చెప్తున్నారు. హన్మకొండ జిల్లాలో కొత్త ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటుతో చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు ఉన్నత విద్య సులభతరం కానుంది. బాసరలో మాత్రమే ఉన్న ట్రిపుల్ ఐటీ ఇప్పుడు హనుమకొండలో కూడా అందుబాటులోకి రానుండటం విశేషం. ఎల్కతుర్తి మండల కేంద్రంలో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్యాంపస్ నిర్మాణం జరుగుతుంది. ఈ కొత్త క్యాంపస్ ఏర్పాటుతో ట్రిపుల్ ఐటీలో మరిన్ని సీట్లు అందుబాటులోకి వచ్చి, మరింత మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది.

# రాంగ్ రూట్లో విచ్చేసి రిపోర్టర్‌పై మందుబాబుల దాడి



**రేగొండ, మార్చి 14 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రాంగ్ రూట్ లో వచ్చిన మందుబాబులు రిపోర్టర్ పై దాడి చేయడంతో రిపోర్టర్ మందు బాబు పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే రేగొండ మండల కేంద్రంలోని స్థానిక కొడవటంచ ఆర్చి సమీపంలో కొడవటంచ జాతర న్యూస్ కవరేజ్ కి వెళ్తున్న మండల రిపోర్టర్ పై ఎదురుగా విచ్చేసిన స్థానిక మందుబాబులు విచక్షణరహితంగా దాడి చేయగా కుప్పకూలిన రిపోర్టర్ వెను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలోకి వెళ్లిన కూడా దాడికి ప్రయత్నించారు.పోలీస్ స్టేషన్ లో కూడా దాడికి ప్రయత్నించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు...

**రిపోర్టర్ పై దాడిని ఖండిస్తున్నాం**

రిపోర్టర్లపై దాడిని రేగొండ మండల ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. రాంగ్ రూట్లో విచ్చేసి రిపోర్టర్ పై దాడి చేసిన మందు బాబును చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేగొండ ప్రెస్ క్లబ్ తరఫున వారు కోరారు.



# ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీల తీన్మార్

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** హెూలీ పండగ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఎస్పీ అఖిల్ మహాజన్ లు పోలీసులతో కలిసి నృత్యాలు చేస్తూ అలరించారు. దాండియా చేతబట్టి ఇద్దరూ తీన్మార్ వాయిస్తూ తమదైన శైలిలో నృత్యం చేస్తూ ఉర్రూతలూగించారు.

# పాఠశాలల పిల్లలను టార్గెట్ చేసిన కిలేడీ

- మత్తు మందు ఇచ్చి మృగాళ్లకు అప్పజెప్పుతున్న వైనం
- పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి...




**వరంగల్, మార్చి 14 (జనంసాక్షి) :** వరంగల్‌లో ఓ కిలేడీ అమాయక ఆడపిల్లలే లక్ష్యంగా ఆమె చేసిన ఘోరాలు సినీ స్టోరీని తలపిస్తున్నాయి. మత్తుమందులకు అలవాటు పడి ముఠాగా ఏర్పడిన వారంతా చేసిన అకృత్యాలు పోలీసులనే అవాక్కయ్యేలా చేస్తున్నాయి. వారు చేసిన దారుణాలు తెలుసుకుంటే ఆడపిల్లలను పాఠశాలలకు పంపాలంటేనే భయం వేస్తుంది. హనుమకొండ జిల్లా దామెర మండలానికి చెందిన ఓ కిలాడీ లేడీ కొంతకాలంగా వరంగల్ మిల్స్ కాలనీలో నివాసం ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన సదరు మహిళ తనతోపాటు డ్రగ్స్‌కు అలవాటు పడిన ఓ అమ్మాయి, నలుగురు యువకులతో కలిసి ముఠా ఏర్పడింది. ఈజీ మనీ కోసం అలవాటు పడిన వారంతా పాఠశాల బాలికలే లక్ష్యంగా దారుణాలకు పాల్పడ్డారు. వరంగల్‌లోని సంపన్నుల కాలనీలు, కార్పొరేట్ పాఠశాలల వద్ద రెక్కీ నిర్వహించే కిలేడీ స్కూళ్లకు వెళ్లే బాలికలతో పరిచయం పెంచుకునేది. అలా ఎంపిక చేసుకున్న బాలికలకు రోజూ మాటలు కలిపి తాను మంచిదాన్నని నమ్మించేది. బాగా పరిచయం ఏర్పడిన తర్వాత బయటకు వెళ్దామని చెప్పి కిడ్నాప్ చేసేది. అనంతరం బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి అప్పటికే తన గ్యాంగ్‌కు టచ్లో ఉన్న మానవ మృగాలకు వారిని అప్పగించేది. వారంతా డ్రగ్స్ మత్తులో ఉన్న బాలికపై అత్యాచారం చేసి కామవాంఛలు తీర్చుకునే వారు. అనంతరం బాలికను తిరిగి ఆ మహిళకు అప్పగించేవారు. ఈ విధంగా బాలికలను వివిధ జిల్లాలకు సైతం కిలేడీ తిప్పేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండ్రోజుల క్రితం మిల్స్ కాలనీలో ఓ బాలిక కిడ్నాప్ అయ్యింది. చిన్నారి తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రెండ్రోజుల తర్వాత బాలిక తనంతట తానే ఇంటికి వచ్చేసింది. ఈ విషయం పోలీసులకు తెలపగా బాలికను ఆరా తీశారు. నిన్ను ఎవరు తీసుకెళ్లారు, ఎక్కడికి తీసుకెళ్లారంటూ పలు ప్రశ్నలు సంధించారు. ఓ మహిళ తనకు కొన్ని రోజుల క్రితం పరిచయం అయ్యిందని, బయటకు వెళ్దామని చెప్పి తీసుకెళ్లిందని వెల్లడించింది. అనంతరం మత్తుమందు ఇచ్చిందని ఆ తర్వాత ఏం జరిగింతో తెలియదంటూ చెప్పుకొచ్చింది. ఈ మేరకు సదరు బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లిన ఖాకీలు వైద్య పరీక్షలు చేయించారు. దీంతో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కిలేడీ గ్యాంగ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరి ఆకృత్యాలు తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. ఒంటరిగా పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ఒక్క వరంగల్ నగరమే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఇలాంటి గ్యాంగ్?లు ఇంకేమైనా ఉన్నాయా? అనే ఆలోచనలో పడ్డారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి గ్యాంగ్?లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విచారణకు హాజరైన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** ఫామ్‌హౌస్ కేసులో పోలీసుల విచారణకు హాజరయ్యారు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి . ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఎమ్మెల్సీకి మొయినాబాద్ పోలీసులు రెండు సార్లు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఫామ్‌హౌస్‌లో జరిగిన కోడి పందాలపై మొదటి సారి ఇచ్చిన నోటీసులపై పోచంపల్లి సమాధానం ఇచ్చారు. అయితే రెండో సారి మాత్రం వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు పేర్కొన్నారు. దీంతో శుక్రవారం ఉదయం వ్యక్తిగతంగా మొయినాబాద్ పోలీసుల ఎదుట విచారణకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కాగా.. సంక్రాంతి పండుగ తర్వాత మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో కోడి పందాలు, క్యాసినో నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఫామ్‌హౌజ్‌పై దాడి చేశారు. కోడిపందాలు, క్యాసినో ఆడుతున్న దాదాపు 64 మంది అదుపులోకి తీసుకున్నారు. అలాగే దాదాపు రూ.30 లక్షల నగదు, 55 లగ్జరీ కార్లు, పందాల కోసం ఉపయోగించే 86 కోళ్లు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో 10 మంది తెలంగాణకు చెందిన వారు కాగా.. మిగిలిన వారు అంతా ఏపీ వాసులే. కోడిపందాలు నిర్వహిస్తున్న భూపతిరాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతకు ముందు రెండు మూడు సార్లు కూడా మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో కోడిపందాలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేబట్టారు. అయితే దర్యాప్తులో భాగంగా ఫామ్‌హౌస్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిదిగా పోలీసులు గుర్తించారు. దీంతో ఆయనకు పోలీసులు మొదటి సారి నోటీసులు ఇవ్వగా.. ఫిబ్రవరి 17 నోటీసులపై వివరణ ఇచ్చారు ఎమ్మెల్సీ. న్యాయవాదితితో కలిసి వచ్చిన పోచంపల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. అయితే మొయినాబాద్ ఫామ్‌హౌస్ తననే అని 2023లో రమేష్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి లీజుకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రమేష్‌తో పాటు మరొకరికి కూడా లీజ్‌కు ఇచ్చినట్లు చెప్పారు. లీజ్‌కు ఇచ్చిన భూమిని ఏపీకి చెందిన వ్యాపారి భూపతి రాజు శివ కుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ తీసుకున్నట్లు తెలిపారు. అయితే కోడిపందాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులకు ఇచ్చిన లేఖలో వెల్లడించారు పోచంపల్లి శ్రీనివాస్. ఇదిలా ఉండగా.. రెండో సారి కూడా పోచంపల్లికి నోటీసులు ఇచ్చారు పోలీసులు. వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ నోటీసుల్లో పేర్కొనడంతో ఈరోజు పోలీసుల ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్సీ విచారణకు హాజరయ్యారు.

# మార్క్సిస్ట్ సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్ వర్ధంతి

### మార్క్సిజం ఆవిర్భావ నేపథ్యం

18వ శతాబ్దం మలి భాగము నుండి 19వ శతాబ్దం మధ్య వరకు వాయువ్య యూరప్ అమెరికా ప్రాంతాలలో పెట్టుబడిదారీ విధానం నాటకీయంగాను విప్లవకరంగాను వృద్ధి చెందింది. ఈ కాలంలోనే ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన గొప్ప పరిణామాలుగా ఇంగ్లాండ్ లో జరిగిన 1789 పారిశ్రామిక విప్లవం,ఫ్రెంచి ఇంగ్లాండ్ వగైరా దేశాలలో జరిగిన ప్రజాస్వామిక విప్లవాలు కొనసాగిన కాలం. ఆనాడు ప్రబలమైనదిగా ఉండిన భూస్వామ్య విధానం పైన పెట్టుబడిదారీ విధానం తిరుగులేని విజయం సాధించింది.


పశ్చిమ యూరప్ ప్రభుత్వాల ప్రత్యేకించి బ్రిటీష్ వారి ప్రపంచ అధిపత్యము ఏర్పడిన కాలమది. ఆ అధిపత్యం పెట్టుబడిదారీ దేశాలలో విప్లవ కరమైన సామాజిక ఆర్థిక పరివర్తనకు దారి తీసింది. అంతేకాదు అది ప్రపంచంలోని పురాతన నాగరికతలు సామ్రాజ్యాలు పెద్ద సంఖ్యలో లొంగిపోవడానికి లేదా కుప్పకూలిపోవడానికి కూడా దారితీసింది.

భారతదేశం బ్రిటీష్ గవర్నర్ల పాలన కింద ఉండే ఒక రాష్ట్రంగా మారిపోయింది. ఇస్లామిక్ దేశాలు సంక్షోభంలోకి తోసి వేయబడ్డాయి. 1839-42 మధ్య కాలంలో గొప్ప చైనా సామ్రాజ్యం సైతం పాశ్చాత్య దోపిడికి తలుపులు తెరవవలసిన స్థితికి నెట్టబడింది. పెట్టుబడి దారీ వ్యాపారపు పురోగమనానికి మరే అడ్డంకి లేకుండా పోయింది. వారు ప్రతి వెనుకబడిన దేశాన్ని వలసలుగా మార్చుకొని పెట్టుబడి దారివలస సామ్రాజ్య ఆధిపత్యం నెలకొల్పిన కాలం. ప్రపంచ వ్యాప్తంగా ఎదురులేని అధికారంతో విర్ర వీగుతున్న బూర్జువా వర్గాన్ని ప్రతిఘటించ డానికి, దానిని ఓడించేటటువంటి కార్మిక వర్గ శక్తుల సంఘటిత పోరాటానికి, కమ్యూనిస్ట్ సిద్ధాంత ఆవిర్భావానికి కూడా దారి తీసాయి. మానవ చరిత్రలో అతి గొప్ప మార్పులు సంభవిస్తూ కొన్ని పాశ్చా త్య పెట్టుబడిదారీ రాజ్యాలు ప్రపంచం పై పెత్తనాన్ని నెలకొల్పుతూ ఉన్న కాలములో మార్క్సిజం పుట్టింది.

**మార్క్సిజం పుట్టుకకు కారణమైన వస్తు గత పరిస్థితులను ఎత్తిచూపుతూ కామ్రేడ్ మావో ఇలా అన్నాడు:**

"చరిత్రలో చాలా దీర్ఘకాలం పాటు మానవులు సమాజ చరిత్ర గురించిన అవగాహనలో అనివార్యంగానే ఏకపక్ష అవగాహనకు పరిమితమైపోయారు. దీనికి కారణం దోపిడి వర్గాల పక్షపాత బుద్ధి ఎల్లప్పుడూ చరిత్రను వక్రీకరించడం ఒకటైతే , చిన్న తరహా ఉత్పత్తి మానవుల దృక్పథాన్ని పరిమితం చేయడం రెండవ కారణం .బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల ( భారీ పరిశ్రమల) తో పాటు ఆధునికమైన కార్మిక వర్గం ఆవిర్భవించిన తర్వాతనే మానవుడు సమాజ అభివృద్ధిని గురించి సమగ్రమైన చారిత్రక అవగాహనను సంపాదించుకోగలిగాడు ఆ జ్ఞానాన్ని ఒక విజ్ఞాన శాస్త్రంగా మార్క్సిజం అనే విజ్ఞాన శాస్త్రంగా మలుచుకోగలిగాడు."

### మార్క్స్ జీవిత విశేషాలు



మార్క్స్ 1818 మే 5న జర్మనీ దేశానికి చెందిన రైన్ రాష్ట్రంలోని ట్రీయర్ నగరంలో జన్మించాడు తండ్రి న్యాయవాది. మార్క్స్ మొదటగా న్యాయ శాస్త్రం చదివినాడు .చరిత్ర తత్వశాస్త్రంపై ప్రధానంగా తన అధ్యయనాన్ని కేంద్రీక రించాడు. తత్వ శాస్త్ర సిద్ధాంతాలపై రచనలు కొనసాగిస్తూ ఒక పత్రికకు సైతం చీఫ్ ఎడిటర్గా పనిచేసినాడు. తన అధ్యయనం లో ప్రపంచాన్ని గతి తార్కిక భౌతిక వాద దృక్పథంతో పరిశీలించిన ఫలితంగా నే మార్క్స్ ప్రపంచ శ్రామికవర్గ మహో పాధ్యాయుడుగా మారినాడు.

మార్క్స్ తన ప్రేమికురాలు అయిన జెన్నీవాన్ వెస్ట్ ఫాలిన్ 1843లో వివాహం చేసుకున్న ప్పటి నుండి జెన్నీ అన్ని రకాల బల మైన తోడ్పాటుతో మాత్రమే మార్క్స్ సిద్ధాంతాలు అభివృద్ధి చేయగలిగి నాడు.

1844లో మార్క్ ఎంగెల్స్‌లు పారిస్‌లో కలిసి అత్యంత కార్మిక వర్గ మిత్రులుగా చివరి వరకు కొనసాగినారు. 1847 మార్క్స్ ఎంగెల్స్ లు కమ్యూనిస్టు లీగ్ ప్రచార సంఘంలో చేరినారు 1847వ సంవత్సరములో కమ్యూనిస్టు ప్రణాళిక సమర్పించినారు. మార్క్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంగెల్స్ తో 1864లో అంతర్జాతీయ కార్మిక సంఘం స్థాపించి కమ్యూనిజం ప్రచారం ,కార్మిక ,కమ్యూనిస్ట్ సంస్థల నిర్మాణ కృషి చేసినారు.

మార్క్స్ ఎంతో నికృష్ట జీవితాన్ని గడిపాడు ఎంగెల్స్ సహాయం చేయబట్టిగాని లేకపోతే పెట్టుబడి గ్రంథాన్ని పూర్తి చేయకపోవడమే కాక ఆర్థికలేమితో ముందే చనిపోయేవాడు. మార్క్స్ ఎంగెల్స్ సహాయంతో మార్క్సిజం అనే కార్మిక వర్గ విజ్ఞాన శాస్త్రం రూపొందింది.

### మార్క్స్ ఎంగెల్స్ రచనలే మార్క్సిజంగా:

మార్క్స్ తో ఎంగెల్స్ చేసిన గొప్ప చేర్పులు విడదీసి చూడరానివి ఎంగెల్స్ తో కలిసే మార్క్స్ తన సిద్ధాంతాన్ని అభివృద్ధి పరిచాడు. చరిత్ర పరిణామ క్రమం గురించి తత్వవేత్తల్లో వెనుకటి కాలం నుంచి దైవము ఆశించే దాన్నిబట్టి ,దైవంశ సంభూతులైన రాజు, మత గురువుల ఇష్టా ఇష్టాన్ని బట్టి మానవాతీత శక్తులను బట్టి సాగుతుందని భావ వాద దృక్పథం ప్రబలంగా వుంది.ఇదే భావ వాద దృక్పథం తో ప్రజలను తర తరాలుగా దోపిడీ చేస్తున్నది. మానవ చరిత్ర పరిణామానికి ప్రధాన భౌతిక కారణంగా శ్రమ సంబంధాల నుంచి పుట్టుకొచ్చేదిగానే ఉంటుంది అని మార్క్స్ బహిర్గత పరిచినాడు. చరిత్ర గురించిన భౌతికవాద భావనను కనుగొనేందుకు సామాజిక అభివృద్ధి చలన నియమాలు ఏమిటి అనే గతితార్కిక పద్ధతిని కనుగొన్నారు. పెట్టుబడి దారీ విధానంలో వర్గ వైరుధ్యాలతో సహా ఆ విధానపు చలన నియమాలను దోపిడి మూలాన్ని బట్టబయలు చేసినారు.శ్రమ దోపిడికి కారణమైన అదనపు విలువ సిద్ధాంతాన్ని ఆవిష్కరించి కార్మిక వర్గ రాజకీయ అర్థ శాస్త్రం అభివృద్ధి చేశారు. వర్గ పోరాట సిద్ధాంతం పునాదిగా శాస్త్రీయ సోషలిజాన్ని అభివృద్ధి చేశారు. కార్మిక వర్గపు పోరాట వ్యూహము ఎత్తుగడలను నియంత్రించే సూత్రాలను రూపొందించారు.

కార్మిక వర్గం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి తనను తాను విముక్తం కావించుకోవాలంటే అది తన సొంత కార్మిక వర్గ పార్టీని ఏర్పరుచుకోవాలని మార్స్ ఎంగెల్స్ లు ప్రబోధించినారు.కార్మిక వర్గ పార్టీ అంటే కమ్యూనిస్ట్ పార్టీ పెట్టుబడి దారి వర్గానికి వ్యతిరేక పార్టీ గానే వుంటూ రైతులు ఉద్యోగులు వగైరా శ్రామిక వర్గ ప్రజల మధ్య బలమైన ఐక్య సంఘటన ఏర్పడాలని చెప్పినారు.

వర్గ సమాజంలో ఉత్పత్తి శక్తులకు ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఉండే వైరుధ్యం వర్గ వైరుధ్యంగా ప్రతిపలిస్తుందని వారు నిరూపించారు. ఈ వర్గ పోరాటమే సమాజానికి శోదక శక్తిగా పనిచేస్తుంది .అందువల్లనే వారు ప్రపంచ చరిత్ర అంటే వర్గ పోరాటాల చరిత్రని వర్ణించారు .కార్మిక వర్గం సమాజం లోని సకల శ్రామిక వర్గాలతో ఐక్యత ద్వారా మానవ సమాజాన్ని అన్ని రకాల దోపిడి అసమానతల నుండి విముక్తి చేయడానికి వర్గ పోరాట శాస్త్రాన్ని రచించినారు.

బానిస సమాజం నుండి కమ్యూనిజం వరకు మానవ సమాజపు అభివృద్ధి క్రమంలో రాజ్యం ఎలా పుట్టి అభివృద్ధి చెంది అంతరించిపోతుందో మార్క్స్ ఎంగెల్స్ లు వివరించారు." ఆధునిక రాజ్యం యొక్క పరిపాలన విభాగం అంటే మొత్తంగా బూర్జువా వర్గం యొక్క ఉమ్మడి కార్యకలాపాలను చక్కబెట్టే ఒక కమిటీ తప్ప మరేమీ కాదు" అని కమ్యూనిస్టు ప్రణాళికలో చేసిన ప్రకటన పెట్టుబడి దారి వర్గం పై వివిధ బూర్జువా పార్టీ ల పై ఖచ్చితమైన శ్రామిక వర్గ వైఖరి వెల్లడించారు. మార్క్సిజం అంటే తత్వశాస్త్రం (గతి తార్కిక భౌతిక వాదం )రాజకీయ అర్థశాస్త్రం (పెట్టుబడి) శాస్త్రీయ సోషలిజం, శ్రామిక వర్గ పోరాటాల ఎత్తుగడల సమగ్ర సమహారం.

మార్క్స్ రచనలు వందల కొలది వున్నప్పటికీ మార్క్స్ బోధనలోని అతి ముఖ్యమైన అంశాలను క్లుప్తంగా ఏడు శీర్షికల కింద లెనిన్ విభజించి నాడు. 1)భౌతిక వాద తత్వశాస్త్రం 2) గతి తర్కం 3) చారిత్రక భౌతిక వాదం 4) వర్గ పోరాటం 5)మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం 6) సోషలిజం 7)కార్మిక వర్గ పోరాట ఎత్తుగడలు. మార్క్స్ జీవితంలో ఆఖరి కొద్ది సంవత్సరాలు అనేక వ్యాధులతో బాధ పడ్డాడు. అవి అతని రాజకీయ, రచనా వ్యాసంగానికి ఆటంకంగా పరిణమించాయి. దానితో మార్క్స్ తాను రచించదలచుకున్న వాటిలో కొన్నింటిని రచించలేక పోయి చివరకు లండన్ లోనే మార్చి 14, 1883 న మరణించాడు.

### మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ చేసిన ప్రసంగంలో:

డార్విన్ ఏ విధంగానైతే జీవ ప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో సరిగ్గా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. మార్క్స్ కనిపెట్టిన సమగ్రమైన శాస్త్రీయమైన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతం అంతవరకు చరిత్ర గురించి ఉనికిలో ఉన్న అన్ని రకాల తప్పుడు సిద్ధాంతాలను చావు దెబ్బ కొట్టింది.

కారల్ మార్క్స్ ఒక గొప్ప మానవ విజ్ఞాన శాస్త్రవేత్త .అన్నింటికంటే ముఖ్యంగా ఆయన గొప్పశ్రామిక విప్లవవాది.ఆయన మానవ సమాజ విముక్తి పథ నిర్దేశకుడు. 19వ శతాబ్దం మానవ సమాజానికి సమర్పించిన ఒక మహోన్నత మానవుడు. పెట్టుబడిదారీ సమాజాన్ని కూల్చివేయడానికి ఆధునిక శ్రామిక వర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశం. ఆయన పేరు యుగయుగాల దాకా అమరంగా ఉంటుంది .అలాగే ఆ కృషి కూడా చిరస్థాయిగా ఉంటుంది. అదనపు విలువ ఆవిష్కారంతో సమకాలిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని శాసించే ప్రత్యేక గతి నియమాన్ని మార్క్స్ కనుగొనడంలో చరిత్రలో మొదటి సారిగా వెలుగు ప్రసరించబడింది.

కామ్రేడ్ మార్క్స్ పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ ,తాత్విక ,చారిత్రక, ఆర్థిక ,సామాజిక వర్గ పోరాట రంగాల్లోని ప్రతి ఒక్క విషయంపై కూడా ఆయన స్వతంత్రమైన లోతైన ఆవిష్కరణ చేశాడు .

"మార్క్సిజము అంటే ప్రకృతి మానవ సమాజాల అభివృద్ధిని నియంత్రించే నియమాల విజ్ఞాన శాస్త్రం .దోపిడికి పీడనకు గురయ్యే ప్రజారాశుల విప్లవ శాస్త్రం. సకల దేశాలలో సోషలిజానికి విజయాన్ని సాధించే శాస్త్రం కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే శాస్త్రం". కామ్రేడ్ స్టాలిన్

"మార్క్సిజం నిర్జీవమైన పిడివాదం కాదు పరిపూర్ణమైన తయారై సిద్ధంగా ఉన్న మార్పు చెందని సిద్ధాంతం కాదు ఆచరణకు అది సజీవ మార్గదర్శి "కామ్రేడ్ లెనిన్.

కార్మిక కమ్యూనిస్టు ఉద్యమాలు నేడు అనేక బలహీనతలతో వెనుకంజలో ఉండడానికి గల కారణాలని మార్క్సిజము దృష్టి కోణం నుండి సమీక్షించుకొని శ్రామిక వర్గ అధికారం కోసం ప్రజలను సోషలిస్టు చైతన్యం వంతం చేయడమే నేటి ప్రధాన కర్తవ్యం.

కమ్యూనిస్ట్ సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్ కు జోహార్లు.



**జంపన్న**
మార్క్సిస్టు లెనినిస్ట్ రచయిత

---

# అసెంబ్లీ వ్యవహారాలు
# ప్రజలు చూస్తున్నారు!



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఈసారి విపక్ష నేత టిఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ హాజరయ్యారు గవర్నర్ ప్రసంగం రోజు మాత్రమే ఆయన సమావేశాలకు వచ్చారు రెండవ రోజు రాలేదు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే చర్చలు ఆయన పాల్గొనలేదు కేసీఆర్ రావడంతో బిఆర్ఎస్‌లో మొదటి రోజు మంచి ఉత్సాహమే కనిపించింది రెండో రోజు ఆయన రాలేదు రేపు మళ్లీ ప్రారంభమయ్యే సమావేశాలలో ఆయన పాల్గొంటారా లేదా తెలియదు స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి ఏకవచనంతో ఈ సభ నీది కాదు అనే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి టిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మంత్రులు సహా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై 15 నిమిషాలు సభ వాయిదా కూడా పడింది. వాయిదా అనంతరం కూడా టిఆర్ఎస్ అధికార కాంగ్రెస్ పక్షం మధ్యన వాగ్వివాదాలు జరిగాయి. చివరికి జగదీశ్ రెడ్డి ని సభ నుంచి సస్పెండ్ చేశారు. అందుకు నిరసనగా టిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి బయట కూర్చున్నారు. వారిని పోలీసులు అరెస్ట్ కూడా చేశారు.

**బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏం జరిగింది.**

ఇక్కడి వరకు విషయం సరే అసలు అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా బిఆర్ఎస్ సభ్యులకు మాట్లాడుతున్నప్పుడు అడ్డు తగిన సందర్భాలు తక్కువే గత తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలన లో విపక్షంలో ఉన్న కాంగ్రెస్ సభ్యులను అసలు మాట్లాడనీయకపోవడం చీటికిమాటికి సస్పెండ్ చేయడం, ఒక సభ్యుడిని అయితే మొత్తానికే బహిష్కరించడం లాంటివి ఎన్నో జరిగాయి. కాంగ్రెస్ పార్టీకి విపక్ష హోదా రాకుండా ఆ పార్టీకి సంబంధించిన వారిని అందరిని చీల్చి తమ పార్టీలో చేర్చుకోవడం లాంటివి ఎన్నో చర్యలకు బిఆర్ఎస్ పాల్పడింది. టిఆర్ఎస్ కాలంలో నిజానికి పరిశీలిస్తే అసెంబ్లీ సమావేశాలు ఏకపక్షంగానే నడిచాయి. తమకు మెజారిటీ ఉంది. లేదా విపక్ష పార్టీలకు చెందిన వారు తమ పార్టీలో చేరిపోయారు, ఇగ ఎక్కడి విపక్షం ఎక్కడి కాంగ్రెస్ అనే విధంగానే అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా అందరూ హేళన చేసేవారు, అదే పద్ధతిలో ప్రభుత్వాన్ని నడిపారు. అసలు విపక్షానికి విలువ లేకుండా చేశారు. ఇప్పుడు సస్పెన్షన్లు లేవు.

**అవహేళనలు వద్దు.**

మాట్లాడండి కాస్త మర్యాదగా మాట్లాడండి!చిత్తం వచ్చినట్లు కాదు అనేదే కాంగ్రెస్ మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి లాంటి వారు పేర్కొంటున్నారు. సభ్యులకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ నాయకులకు సంబంధించి ఇప్పటికీ అవహేళన చేసే అలవాటు బిఆర్ఎస్ లో పోలేదు. కేటీఆర్ అయినా జగదీశ్ రెడ్డి అయినా ఇంకా ఎవరు మాట్లాడినా పాత పద్ధతి లోనే ఇంకా తాము అధికారంలో ఉన్న లాగే మాట్లాడుతున్నారు. వాస్తవాలను వారి ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపిన అప్పులను ఎత్తి చూపిన జీర్ణించుకోలేని పరిస్థితి ఉంటుంది.

**గ్యారంటీల అమలు పై రేవంత్ స్పష్టత.**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలుకు సంబంధించి కొన్నింటికి జరుగుతున్న జాప్యం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ప్రతి మంత్రి నిధుల కు సంబంధించిన ఇబ్బందులను స్పష్టంగా జనం ముందు పెడుతున్నారు. ఇందులో ఎలాంటి శషబిషలు లేవు. చాలా స్పష్టంగా పలు విషయాలలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. ఏడు లక్షల కోట్ల అప్పులను రాష్ట్రం మీద గత బిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టింది.దాని వడ్డే భారీగా చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నది. వడ్డీ మాత్రమే కాదు అసలును కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఇవన్నీ చేసుకుంటూనే హామీలను అమలు చేస్తూ రావాలి. ఇప్పటికీ తాము ఎందుకు ఓడిపోయాము , బిఆర్ఎస్ నేతలు నిజాన్ని చెప్పరు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నదని పేర్కొంటారు. నిజంగా ఉచితాలు ప్రారంభించింది గా ఎవరు? బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉచితాల ను ప్రోత్సహించింది ఎవరు? తద్వారా ఓట్లు అడిగింది ఎవరు? టిఆర్ఎస్ కాదా అలాంటప్పుడు ఇతరులను వేలెత్తి చూపే అర్హత హక్కు బిఆర్ఎస్ పార్టీకి ఎక్కడిది? నిజానికి ఓటర్లు అత్యాశకు పోయి కాంగ్రెస్ను గెలిపించారని మాజీ సీఎం కేసీఆర్ సైతం పేర్కొంటూ ఉంటారు. ఇప్పటికీ ప్రజల ముందు తమ ఓటమికి కారణాన్ని తెలిసి కూడా తెలియనట్టు అంగీకరించకపోవడం అహంకారం కాకుంటే ఇంకేమవుతుంది. అసెంబ్లీలోనూ అదేవిధంగా ఉంది స్పీకర్ అంటే గౌరవం లేదు. మంత్రులంటే గౌరవం లేదు.

**దళిత స్పీకర్‌పై ఏకవచనాలు.**

ఒక దళిత స్పీకర్ పట్టుకొని శాసనసభ్యుడు జగదీష్ రెడ్డి చిత్తం వచ్చినట్లు మాట్లాడుతాడు. క్షమాపణ చెప్పమంటే నామోషీ అయిపోతుంది తప్పేముంది. క్షమాపణ చెప్తే స్పీకర్ స్వయంగా తనని అలా ఉద్దేశించి మాట్లాడడం జరిగిందని బాధపడుతూ పేర్కొనడం జరిగింది. తప్పైందని చెప్తే జగదీశ్ రెడ్డి కి నోటి ముత్యాలు రాలిపోతాయా?

**దళితుడిని ఎందుకు సీఎం చేయలేదు.**

దళితుడు సీఎంగా ఉంటాడని తెలంగాణ ఉద్యమం సందర్భంగా పలుమార్లు మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం జరిగింది. దళితున్ని సీఎంగా చేయకుంటే తన మెడ మీద తలకాయ ఉండదని, కూడా ఆయన పేర్కొన్నారు. అలాంటివాడు తొమ్మిదేళ్లు ఆయనే సీఎం గా ఉన్నాడు. ఈ విషయాన్ని మొన్న అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నిస్తే దానికి ఒక్కరి సమాధానం బిఆర్ఎస్ నుంచి లేదు. పాపం రాజయ్యను డిప్యూటీ సీఎం గా కొన్ని రోజులు ఉంచి తర్వాత తీసేసారు. ఐదేళ్లపాటు మొదటి విడతలో మహిళ లేకుండానే మంత్రివర్గం కొనసాగింది. ఇవన్నీ సమాధానాలు ప్రజలు బిఆర్ఎస్ నుంచి ఆ పార్టీ నేతల నుంచి కోరుతున్నారు. ఈ ప్రశ్నలకు జవాబు ఇవ్వండి. ప్రస్తుతం ఎంపీ బీజేపీలో ఉన్న ఈటెల రాజేందర్ ను పార్టీ నుంచి తీసేసి హుజురాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆయనను ఓడించడానికి చేసిన ప్రయత్నాలు వందల కోట్ల ఖర్చులు జనానికి తెలియదా? కక్ష కట్టి మరీ ఎంతోమంది ఉద్యమకారులను దూరం చేయడమే కాదు. పార్టీలో టికెట్ ఇచ్చి కూడా కొందరిని ఓడించడం కోసం ఎదుటి పార్టీ వారికి ఫండ్స్ పంపిన వైనం పరిస్థితి నిజాన్ని ఎంత కప్పిపుచ్చిన ఈరోజు వరకు కూడా నేల మీద చర్చగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నో విషయాలు ఉన్నాయి. ప్రస్తుతం అప్రస్తుతము కానీ ఎందుకో ప్రస్తావించాలని ఒక సీనియర్ జర్నలిస్టుగా తెలంగాణ ఉద్యమకారుడిగా భావించాను. కాబట్టే మాట్లాడాల్సి రాకున్నా రాయాల్సి వచ్చింది. సభ సజావుగా నడిపే ప్రయత్నం స్పీకర్ చేస్తారు. అయితే ఆ సభను సజావుగా నడిపే విధంగా సహకరించాల్సిన బాధ్యత అధికార విపక్ష పార్టీల ఎమ్మెల్యేలకు మంత్రులకు ఉంటుంది.

**సిఎం అంటే చులకన ఎందుకు?**

నేను చాలా వరకు ఒక జర్నలిస్టుగా గమనిస్తున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల మొదటి నుంచి బిఆర్ఎస్ లో కెసిఆర్ కు అయినా కేటీఆర్ కు అయినా ఇంకా కొంతమంది బిఆర్ఎస్ నాయకులకు అలర్జీలా వ్యవహరిస్తా ఉంటారు. అందుకే చీటికిమాటికి ఏక వచనంతో కేటీఆర్ మాట్లాడుతూ మళ్లీ సదురుకున్నట్టు మాట్లాడుతూ ఉంటారు. సిఎం అంటే ఒక హేళన భావం ఆయన మాటల్లో కనిపిస్తుంది. ఎందుకంత? అవసరమా. రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి ,బిఆర్ఎస్ ను మట్టికరిపించి మరి కాంగ్రెస్ను అధికారంలోకి తీసుకొచ్చిన వాళ్లలో రేవంత్ రెడ్డి ముఖ్యులు, ఎవరు అవునన్నా కాదన్నా అయినకుండే గౌరవం ఆయనకు ఉంటుంది. ఎందుకు పనికిరాని జనం పట్టించుకోని విషయాలపై అసెంబ్లీ సమయాన్ని ఇప్పటికైనా వృధా చేయకుండా ప్రజల సమస్యల మీద వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయే ఒక మంచి ప్రతిపక్షంగా ,విపక్షంగా బిఆర్ఎస్ సభ్యులు మాజీ సీఎం కేసీఆర్ సహా ముందుకు వెళితే మంచిది.

**ప్రజలు గమనిస్తున్నారు**

ప్రజలు అసెంబ్లీ సమావేశాలను చాలా క్షుణ్ణంగా గమనిస్తున్నారు. రానున్న రోజుల్లో మళ్లీ అధికారం సంగతి పక్కన పెడితే ఇప్పుడున్న విపక్ష స్థానం కూడా దక్కకుండా పోయే ప్రమాదం ఉంటుంది. ఎందుకంటే నెత్తినెక్కించుకున్నోళ్లే నేలకేసి కొడతారు. అధికార పక్షం కూడా సమన్వయంగా, సంవన యం పాటించాల్సిన బాధ్యతను విస్మరించవద్దు.



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

---

# గ్రీన్‌లాండ్‌పై దాడి.. ట్రంప్ ఆకాంక్షలు

### 'నాటో' ప్రతిస్పందన



ఇటీవలి సంవత్సరాలలో, ప్రపంచంలోనే అతి పెద్ద ద్వీపమైన గ్రీన్‌లాండ్ అంతర్జాతీయ రాజకీయాలలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. 56 వేల మందికే నివాసంగా ఉన్న ఈ మంచుతో కప్పబడిన ప్రాంతం భౌగోళికంగా కీలక స్థానంలో ఉండటం, అపారమైన సహజ వనరులు కలిగి ఉండటం, అంతర్జాతీయ శక్తుల ఆసక్తిని కలగజేయడం వంటి అంశాల కారణంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 2019లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలన్న తన ఆకాంక్షను వ్యక్తం చేయడం వివాదాస్పద పరిణామంగా నిలిచింది. చాలామంది దీనిని హాస్యాస్పదంగా కొట్టిపారేసినా, ఈ ద్వీపం గ్లోబల్ రాజకీయాలలో పెరుగుతు న్న ప్రాధాన్యతను స్పష్టంగా సూచించింది.

గ్రీన్‌లాండ్ పై ట్రంప్ ఆకాంక్ష: భౌగోళిక వ్యూహాత్మక యత్నమా?

2019 ఆగస్టులో ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలనే తన ఆలోచనను బహిరంగంగా ప్రకటించారు. అయితే డెన్మార్క్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తక్షణమే తిరస్కరించింది, ఎందుకంటే గ్రీన్‌లాండ్ యొక్క విదేశాంగ వ్యవహారాలు, రక్షణ నేరుగా డెన్మార్క్ పరిధిలో ఉంటాయి. డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ దీనిని "అసంభవం"గా అభివర్ణించగా, గ్రీన్‌లాండ్ ప్రభుత్వం తమ ద్వీపం విక్రయానికి ఉద్దేశించబడలేదని స్పష్టం చేసింది. ఈ తిరస్కారానికి ప్రతిస్పందనగా ట్రంప్ డెన్మార్క్‌లో తన పర్యటనను రద్దు చేసుకున్నారు, తద్వారా అమెరికా-డెన్మార్క్ సంబంధాలలో మరింత చీలిక తెచ్చారు.

ట్రంప్ కు గ్రీన్ ల్యాండ్ పై ఆసక్తికి ప్రధాన కారణాలు:

ఈ ద్వీపానికి ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక విలువలే. గ్రీన్‌లాండ్ అరుదైన ఖనిజ సంపత్తులతో నిండి ఉంది, ఇవి స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ వాహనాలు, సైనిక పరికరాల తయారీలో కీలకం. ప్రపంచవ్యాప్తంగా ఈ ఖనిజాల సరఫరాలో చైనా ఆధిపత్యం చెలాయిస్తుండగా, అమెరికా గ్రీన్‌లాండ్‌ను ప్రత్యామ్నాయ వనరుగా భావించింది. అంతేగాక, ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్న గ్రీన్‌లాండ్ భూభాగం భవిష్యత్ వాణిజ్య మార్గాలకు కీలకం.

అయితే ట్రంప్ గ్రీన్ ల్యాండ్ పై ప్రకటనా తీరును విమర్శకులు నిర్లక్ష్యంగా, ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయంగా పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన ద్వారా ఆయన డెన్మార్క్ వంటి కీలక నాటో మిత్రదేశాన్ని దూరం చేసుకున్నారు. ఇది సామ్రాజ్యవాద వైఖరిని ప్రతిబింబిస్తున్నదని, స్థానిక ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోకుండా పాశ్చాత్య దేశాలు భూములను సంపాదించుకునే పాత తరహా విధానాన్ని గుర్తు చేస్తున్నదని పలువురు విమర్శించారు. గ్రీన్‌లాండ్ స్వాయత్తమైన పాలనను కలిగి ఉన్నప్పటికీ, ఇది ఇంకా డెన్మార్క్ రాజ్యానికి చెందినదే.

గ్రీన్‌లాండ్ వైఖరి: స్వాయత్తత మరియు పర్యావరణ పరిరక్షణ

ట్రంప్ ప్రతిపాదన గ్రీన్‌లాండ్‌కు ఒక హెచ్చరికలా మారింది. డెన్మార్క్ నుంచి మరింత స్వాతంత్ర్యం కోరుకుంటున్న గ్రీన్‌లాండ్, ఈ ఘటన ద్వారా తన హక్కులను మరింత బలంగా రక్షించుకోవాల్సిన అవసరం ఉందని గ్రహించింది. స్థానిక ప్రభుత్వం ఏ అభివృద్ధి చర్యలు చేపట్టినా అవి తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉండాలనే విషయాన్ని స్పష్టంగా చెప్పింది.

గ్రీన్‌లాండ్‌లో సమృద్ధిగా ఉన్న ఖనిజ సంపద ఆర్థికంగా లాభదాయకంగా మారవచ్చు, కానీ అదే సమయంలో పర్యావరణానికి, స్థానిక ఆదివాసీ సముదాయాలకు ప్రమాదకరంగా మారే ప్రమాదం కూడా ఉంది. డెన్మార్క్ సబ్సిడీలపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిగా మారాలన్న లక్ష్యంతో గ్రీన్‌లాండ్ ప్రభుత్వం సమతుల్యతను పాటిస్తూ ముందుకెళ్తోంది. ఇదే సమయంలో, గ్రీన్‌లాండ్ వ్యూహాత్మక ప్రాధాన్యత కూడా పెరుగుతోంది. చలి తరిగిపోతున్న కారణంగా కొత్త వాణిజ్య మార్గాలు ఏర్పడే అవకాశం ఉంది, ఇది ద్వీపానికి మరింత ప్రాముఖ్యతను ఇస్తుంది.

నాటో ప్రతిస్పందన: ఆంతరంగిక అసమతుల్యత

ట్రంప్ -గ్రీన్‌లాండ్ యత్నం నాటో దేశాలను గందరగోళానికి గురిచేసింది. ఒకవైపు, అమెరికా ఈ కూటమిలో అత్యంత శక్తివంతమైన సభ్య దేశం. మరోవైపు, ఈ ప్రతిపాదన డెన్మార్క్‌తో సంబంధాలను దెబ్బతీసింది. నాటో దేశాలు ఎక్కువగా ఈ అంశంపై నేరుగా విమర్శలు చేయకుండా, ఆర్కిటిక్ భద్రతపైనే దృష్టిపెట్టాయి. రష్యా, చైనా ఈ ప్రాంతంలో తమ ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో, నాటో తన సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచడానికి ప్రయత్నిస్తోంది. డెన్మార్క్ కూడా గ్రీన్‌లాండ్‌తో సంబంధాలను బలోపేతం చేసేందుకు, అక్కడ మౌలిక వసతుల పెంపునకు అధిక పెట్టుబడులు పెడుతోంది.

గ్రీన్‌లాండ్ భవిష్యత్ మార్గం?

ట్రంప్ ప్రతిపాదన రాజకీయ నాటకంగా తోసిపుచ్చబడినప్పటికీ, ఇది గ్రీన్‌లాండ్ యొక్క భవిష్యత్ ప్రాముఖ్యతను సూచించింది. 21వ శతాబ్దంలో శక్తి, వనరుల కోసం ప్రపంచ శక్తులు పోటీ పడుతున్న వేళ, ఈ ద్వీపం ఒక కీలక కేంద్రంగా మారుతోంది.

గ్రీన్‌లాండ్ భవిష్యత్తు పూర్తిగా స్వయంపాలన సాధించగలుగుతుందా? లేదా ప్రపంచ శక్తుల రాజకీయ బలాలకు లోనవుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం ద్వీప ప్రజల చొరవ, దాని పరిరక్షణ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది. గ్రీన్‌లాండ్ అమ్మకానికి ఉందా? అనే ప్రశ్న కాదు, అది తన స్వతంత్ర స్థానాన్ని ఎలా నిర్ధారించుకుంటుందన్నదే అసలు ప్రశ్న.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

---

# నాలుగు ముళ్ళు..?
### ఎనిమిది అడుగులు..?

(హాస్య కవిత)



అక్కడ...ఎక్కడో గుర్తులేదు
కాకతాళీయంగా కలుసుకున్నాం...
కళ్లు కబుర్లు చెప్పుకున్నాయి...
మాటలు మొదలై
మమతలుగా మారాయి...
మనసు మనసుని తాకింది...
ఏకాంతంగా చీకటిలో చిలిపిగా
మల్లెపూలతోట వెనకాల
కలుసుకున్నాం...

మూగబాసలు మాట్లాడుకున్నాం
తనువును తనువులో కలిపి
తేనె తాగిన తుమ్మెదల్లా
తేలిపోయాం..!
కౌగిలిలో కరిగిపోయాం...
ఆకాశాన్నందుకున్నాం...

స్వర్గానికి నిచ్చెనలు వేశాం...
చందమామ మీద విందు చేశాం..!
మనువాడాలని ముచ్చట పడ్డాం...
మూడు కాదు
"నాలుగు ముళ్ళు" వేసుకోవాలని...
ముక్కోటి దేవతల
ముందు మొక్కుకున్నాం...!
ఏడడుగులకంటే "
"ఎనిమిది అడుగులు" వేసి
ఎడబాటులేని బంధమై పోవాలని...

ఏడుకొండల వెంకన్నను
వేడుకున్నాం..!

పెళ్లి ఘనంగా జరిగింది!
అంగరంగ వైభవంగా...
మంగళ వాయిద్యాల మధ్య...
కమనీయంగా...రమణీయంగా...
నిన్న అదొక తీపి జ్ఞాపకం...
నేడు చెరగని ఓ చేదు జ్ఞాపకం..!

ఏ దైవం పగబట్టిందో...
ఏ విధి విషం చిమ్మిందో...
మూడునాళ్ల ముచ్చటగా
మా కాపురం మిగిలిపోయింది..!

నిన్న చిలక గోరింకల్లా ఉన్నాం...
నేడు చికాకులతో చెదిరిన
గూటిలో...
నిన్న కౌగిట్లో కరిగిపోయాం...
నేడు కోర్టు మెట్లు ఎక్కుతున్నాం..!

ప్రేమానురాగాలు
ఆవిరైపోయాయి...
పచ్చని కాపురంలో చిచ్చు
రగిలింది...
మా ఇంటి మామిడాకుల
తోరణాలే...
నేడు మా విడాకుల తీర్పును
చెప్పాయి..!

అయ్యో దైవమా..!
ఏం పాపం చేసాం..?
ఏం విధి రాసిందీ..?
అత్యాశ మా పాశమైపోయిందా..?
ఔను ! ఇప్పుడర్థమైంది మాకు..!
"అత్యాశ వ్యర్థమని...అది
అనర్ధమని"..!

రచన:
కవి రత్న
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# ఒంటిపూట.. కనిపెట్టు ఓ కంట..!

- ఒంటిపూట బడులంటే పిల్లల్లో ఆనందం
- సరదాల మాటున ప్రమాదాలు
- ఒంటిపూట బడులతో సగం రోజు సెలవు
- చిన్నారులకు చెప్పలేని ఆనందం
- సరదాల మాటును ప్రమాదాలు
- విద్యార్థుల తల్లిదండ్రులు బహుపరాక్
- నేటి నుంచి ఒంటిపూట బడులు

**ఒంటిపూట బడుల కారణంగా సమయం ముగిసిందంటే మధ్యాహ్నం ఆటపాటల్లో విద్యార్థులంతా సరదాగా గడిపేందుకే ఉత్సాహం చూపిస్తుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కాలువలు, వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామం మంచిదే అయినప్పటికీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సరదామాటున ప్రమా దాలు పొంచి ఉంటాయని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణతాపం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పిల్లలకు అవగాహన కల్పించాలని వైద్యులు చెపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒంటి పూట బడులు నేటి నుంచి కొనసాగుతాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు జరుగుతాయి. పదవ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో చిన్నారుల సంరక్ష ణలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'జనం సాక్షి' అందిస్తున్న కథనం...**





**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 14 (జనం సాక్షి)**
ఒంటి పూట బడుల కారణంగా బడికి వెళ్లే పిల్లలు మధ్యాహ్నం ఖాళీగా ఉండటం ఇష్టం లేక వీలైనంత వరకు తోటి స్నేహి తులతో సరదాగా కాలం గడపాలని చూస్తారు. పిల్లలకు వేసవిలో కలిగే ఇబ్బం దులను దష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తుందని గమనించాలి. నిర్లక్ష్యం చేస్తే తెలిసీ తెలియని వయస్సులో ఉన్న పిలల ఆరోగ్యంతోపాటు వారి ప్రాణాలపై ప్రభావం పడుతుందనే విషయం తల్లిదండ్రులు గమనించాలి.

### టీవీతో అనర్థం

ఇంట్లో తరచూ కంప్యూటర్, వీడియో గేమ్స్, టీవీలకు అతుక్కుపోతే దృష్టి లోపం తలెత్తే అవ కాశముందని కంటి వైద్యనిపుణులు హెచ్చరిస్తు న్నారు. సాధ్యమైనంత వరకు వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులుచ ర్యలు తీసుకోవాలి.

### బోర్ ఫీలవకుండా..

ఇంట్లో ఖాళీగా ఉంటే పిల్లలు బోర్ గా ఫీలయ్యే అవకాశం ఉన్నందున వారికి కొత్త ఆటలు గాని విజ్ఞా నాన్ని పంచే అంశాలపై దష్టి సారించేలా చూడాలి. వీలైనంత మేర తల్లిదండ్రులు తమ పిల్లలతో గడి పేందుకు ప్రయత్నించాలి. పాఠశాలల్లో ఇచ్చిన హోమ్ వర్క్ మధ్యాహ్నం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. దీని ద్వారా సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత అడుకునే వెసులుబాటు కలుగుతుంది. వేసవి తాపం కారణంగా పిల్లలు తొందరగా అలిసిపోయే అవకాశం ఉన్నందున మధ్యాహ్నం కొంత సమయం విశ్రాంతి తీసుకునేలా చూడాలి.

### వాహనాలతో జర జాగ్రత్త

ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై పిల్లలకు మోజు ఎక్కువ, ఇంట్లో చెప్పకుండా వాటిని నడుపుతూ రోడెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశ ముంది. ఈ నేపథ్యంలో చిన్నారులను మోటారు సైకిళ, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. బైక్‌ల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు. అవసరమైతేనే పెద్దల పర్యవేక్షణలో వాహనాలను నడపడం నేర్పించాలి. అలాగే పిల్లలను ఎక్కువ సమయం తిర గనిస్తే పరీక్షల సమయంలో అనారోగ్యా నికి గురవుతారు. అందుకే ఎక్కువ సేపు బయట ఆడుకోనివ్వ కూడదు.

### ఇంటి పట్టునే ఉంచుకోవాలి

ఒంటి పూట బడి సమయంలో పాఠశాల అయిపో యాక చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా తోటి పిల్లలతో, స్నేహితులతో కలసి ఆడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అయితే వేసవిలో ఎండకు తిరిగి అస్థవ్యస్థకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలను ఇంటి అవరణలో, పరిసర ప్రాంతం లో ఆడుకునేలా, చదువు కునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకొవాలి. పాఠశాల అనంతరం వారు ఇంటి పట్టునే ఉండేలా చూడాలి.

### పెద్దల సమక్షంలో శిక్షణ

సైకిల్ తొక్కడం, ద్విచక్రవాహనాలు నడపడం నేర్చు కోవాలన్న కోరిక పిల్లల్లో సహజంగానే ఉంటుంది. వారి వయస్సు ఆధారంగా సైకిల్ గాని, ద్విచక్రవాహనం నడి పేందుకు శిక్షణ తోటి మిత్రుల ఆధ్వర్యంలో కాకుండా పెద్దల సమక్షంలో జనం సంచారం లేని చోట జరిగేలా చిన్నారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలి. సెలవుల్లో కొత్త స్నేహాలకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిల్లల స్నేహితులు ఎవరో, వారు ఎక్కడికి వెళ్తున్నారో ఎప్పటికప్పుడు గమనించాలి.

### వేసవిలో సేదతీరేందుకు...

వేసవి తాపాన్ని తట్టుకోవడం కోసం మధ్యాహ్నం పూట పిల్లలు చెరువులు, పంట కాలువలు, వ్యవసాయ బోరు బావుల్లో ఈతకని వెళ్లి ప్రమాదాలు బారిన పడిన విషాధకర సంఘటనలు ఏటా ఎన్నో జరుగుతున్నాయి. ఈత నేర్చుక కోవడం మంచిదే అయినప్పటికీ పెద్దలు, అనుభవజ్ఞుల సమ క్షంలో చేసే ఫలితం ఉంటుందని తల్లిదండ్రులు గమ నించాలి.

### ఆరోగ్యంపై ఉష్ణోగ్రతల ప్రభావం



వేసవిలో సాధ్యమైనంత వరకు పిల్లలను మధ్యాహ్నం పూట ఎండలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా బయటకు వెళ్లే సమయంలో ఎక్కువ నీరుతాగాలి. శీతల పానియాల బదులు కొబ్బరి బొండాం, పండ్ల రసాలు తీసుకోవాలి. వడ దెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించాలి. దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకు వెళ్లి వైద్యం అందించాలి.

**డాక్టర్ కృష్ణమూర్తి**

## ప్రశ్నిస్తే నిండు సభ నుండి సస్పెండ్ చేస్తారా...



**ఇబ్రహీంపట్నం, మార్చి 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ అసమర్థతను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని సమావేశాలను నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివసాయిలి అన్నారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను తీవ్రంగా నిరసిస్తూ లిబీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిలి ఆదేశాల మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతాంగ సమస్యలపై ఓ రైతుగా అసెంబ్లీలో పోరాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాక్షేత్రంలోకి రేవంత్ రెడ్డి వస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సస్పెన్షన్‌కు భయపడేది లేదని ప్రజాక్షేత్రంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ భరత్ కుమార్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్ కుమార్, కరుణాకర్, కొత్త గణేష్, మనీష్ రెడ్డి, సురేష్, జలేందర్, కిరణ్, అఖిలేష్ గౌడ్, బన్నీ, సాయి, జైపాల్, ఉదయ్, వినోద్, యుగేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- మేడిపల్లి తహసీల్దార్ హసీనా



**బోడుప్పల్, మార్చి 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనా అన్నారు.మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 63/28 నుండి 63/39 వరకు గల ప్రభుత్వ భూమిని అక్రమించి ఇంటి నిర్మాణం చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమణపై ఫిర్యాదుతో తహసీల్దార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ రాకేష్ పరిశీలించి ఇంటిని కూల్చివేశారు.దీంతో అక్రమదారులైన రవికుమార్,పుష్ప జెసీబీకి అడ్డు వచ్చి దుర్భాషలాడుతూ ఆర్ఐ,రెవిన్యూ సిబ్బందిని అడ్డగించారు.దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య



**చిన్నశంకరంపేట, మార్చి 14 (జనం సాక్షి) :** మదూర్ గ్రామ శివారులోని పొలం వద్ద ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది ఎస్సై నారాయణ గౌడ్ తెలిపిన వివరాలు ఏమనగా చిన్న శంకరంపేట మండలం మదూరు గ్రామానికి చెందిన ఫిరంగల్ల శివరాజ్ తండ్రి యాదగిరి వయసు 24 సంవత్సరాలు వృత్తి కులం ఎస్సీ మాదిగ వ్యవసాయం శివరాజ్ కౌలుకు చేస్తున్న పొలం వద్దకు సాయంత్రం నీళ్లు పెట్టడానికి పోయి వస్తానని వెళ్లి రాకపోయేసరికి అతని తండ్రి యాదగిరి భూమి యజమాని సత్యనారాయణ రాత్రి ఒంటి గంట టైం కు పొలం వద్దకు పోయి అక్కడ చూసేసరికి పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు మృతుడు శివరాజుకు ఒక సంవత్సరం నుండి పెళ్లి సంబంధాలు చూడగా కుదురనందున తనకంటే చిన్న వాళ్లకు పెళ్లిళ్లు కావడంతో జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని తండ్రి యాదగిరి తెలిపినారు ఇట్టి విషయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

## ఊరూరా రంగుల రంగోళీ



**శివ్వంపేట, మార్చి 14 (జనంసాక్షి) :** సప్తవర్ణాల సమ్మేళనం హోళీ పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రమైన శివ్వంపేట లో శుక్రవారం హోళీ పండుగ సంబరాలను ఊరురా రంగుల రంఘోళీతో యువకులు కేరింతలు కొడుతూ ఆనందోత్సవాల మధ్య ఘనంగా హోళీ పండుగను జరుపుకున్నారు. కుల, మతాలకు అతీతంగా చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొట్టారు. అదేవిధంగా శివంపేట, గోమారం, దొంతి కొంతాన్ పల్లి, నవాబుపేట, సికింద్లాపూర్, పెద్దగొట్టిముక్ల, చిన్నగొట్టిముక్ల గ్రామాలలో ఆనందోత్సవాలతో యువకులు నృత్యాలు చేస్తూ, దారిన వెళ్లే వారిపై కూడా రంగులు చల్లి ఆనందం పంచుకున్నారు. ఆ తర్వాత బ్యాండ్ మేళాలు, డప్పు చప్పుల మధ్య ర్యాలీలు నిర్వహించుకుంటూ, రంగుల రంగేళిని సప్తవరణాల శోభితం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఆడేది హోలీ



**చంపాపేట్, మార్చి 14 (జనం సాక్షి) :** చిన్న పెద్ద తేడా లేకుండా ఆడేది హోలీ పండుగ అని సరూర్ నగర్ సిఐ సైది రెడ్డి ఆదేశం మేరకు ఎస్సై కిషన్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని మనసా గార్డెన్ పరిధిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గణిత శాస్త్రవేత్తల కృషి అభినందనీయం




**మల్దకల్, మార్చి 14 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ గణిత దినోత్సవం పైడే ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్తలు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.గణితంలో, "పై"జూ అనేది ఒక వృత్తం యొక్క చుట్టుకొలత దాని వ్యాసానికి నిష్పత్తిగా నిర్వచించబడిన ఒక స్థిరాంకం అని,దీని విలువ సుమారుగా 3.141592653గా ఉంటుందని దీనిని గుర్తుంచు కొనేలా అనే వాక్యంలోని అక్షరాల సంఖ్యను గుర్తుంచుకోవచ్చు అని తెలిపారు.ప్రపంచానికిపై విలువను మొదటిగా సారిగా తెలియజేసిన వ్యక్తి ఆర్కిమెడిస్ అయినా పై విలువను నా మొదటి నాలుగు దశాంశాలకు 3.1416గా తెలియజేసిన వ్యక్తి ఆర్యభట్ట అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శు భ,జాకీర్ హుస్సేన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓయూ బీఎస్ఎఫ్ ఐదవ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



**ఓయూ, మార్చి 14 (జనం సాక్షి) :** మన్యశ్రీ కాన్షీరామ్ 91వ జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఐదవ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ పిలుపునిచ్చారు. బీఎస్ఎఫ్ ఐదవ రాష్ట్ర మహాసభ గోడపత్రిక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద పత్రిసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు.

## ఘనంగా కార్ల్‌మార్క్స్ వర్ధంతి




**వనపర్తి, మార్చి 14 (జనంసాక్షి) :** కార్ల్‌మార్క్స్ 142వ వర్ధంతి సభ సిఐటియు జిల్లా కార్యాలయంలో సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం. పరమేశ్వర చారి అధ్యక్షత వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. జబ్బార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్‌డి. జబ్బార్ మాటల్లో కారల్‌మార్క్స్ 1818 మే 5న జర్మనీ దేశంలో ట్రైర్ పట్టణంలో జన్మించి 1823 మార్చి 14న మరణించారని అన్నారు. ప్రపంచమంతా దారిద్యము, ఆకలి చావులు, ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచమంతా అనేక తిరుగుబాట్లు జరుగుతున్నాయి. మార్క్సిజం ఆధారంగా ఏర్పడ్డ దేశాలు చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తరకొరియా, లావోస్ దేశాల్లో ఆర్థిక సంక్షోభం నుండి తట్టుకొని స్థిరంగా అభివృద్ధి చెందుతున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదానికి - చైనా సోషలిజంకు మధ్య వైరుధ్యం తీవ్ర రూపం దాలుస్తున్నది. లాటిన్ అమెరికా దేశాల్లో దాదాపు పది దేశాల్లో ఎర్రజెండా ఎన్నికల ద్వారా గెలిచి రెపరెపలాడుతుంది. ఇటీవల కాలంలో శ్రీలంకలో 2024 నవంబర్‌లో ఎన్నికలు జరగగా మూడు శాతం ఓట్లు, మూడు సీట్లు ఉన్నా కమ్యూనిస్టులు 159 ఎంపీ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దేశ అధ్యక్షుడుగా ఎన్నికల్లో కమ్యూనిస్టు నాయకులు దిశ నాయక్ గెలిచారు. భారత దేశంలో సిపిఎం ఆధ్వర్యంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా అందరికి విద్య, వైద్యం అందించడం, కనీస వేతనాలు అమలు చేయడంలో ముందున్నది. ప్రత్యామ్నాయ విధానాలతో దూసుకుపోతున్నది. కాబట్టి మార్క్సిజందే భవిష్యత్తు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. బాల్ రెడ్డి, ఏ లక్ష్మి సిపిఎం పట్టణ నాయకులు డి. కురుమయ్య, జి. బాలస్వామి, గంధం గట్టయ్య, నందిమల్ల రాములు, బిసన్న, రత్నయ్య, కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదే..



**ఉప్పల్, మార్చి 14 (జనం సాక్షి) :** భగత్‌సింగ్ కలలుగన్న అవినీతి,దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలి అని కృష్ణ ప్రసాద్, శాస్త్రవేత్త. సామాజిక కార్యకర్త యువతకు పిలుపునిచ్చారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదేనని, భగత్ సింగ్ కలలుగన్న అవినీతి,దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలని శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్ అన్నారు. ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి ని పురస్కరించుకోని ఉస్మానియావిశ్వవిద్యాలయం లోని క్రికెట్ గ్రౌండ్లో రెండవ రోజు ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్ కు కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిధిగాహాజరయ్యారు. రెండవ రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కరచాలనం చేసి అభినందించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నో క్రీడలు అంతరించి పోతున్నాయని వాటిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం చిరు ప్రాయంలోనే పోరాడి వీరమరణం పొందారని అటువంటి భగత్ ఆశయ సాధన లో నేటి యువత పాటుపడాలని వారు అన్నారు. భగత్ కలలుగన్న అవినీతి, అక్రమాలు, దోపిడీ లేని సమసమాజ స్థాపనకు నేటి యువత నడుంబిగించాలని వారు ఉద్ఘాటించారు. కానీ నేడు దేశంలో అవినీతి, అక్రమాలతో కూడిన రాజకీయాలు సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థ లను ధ్వంసం చేసేలా ఉన్నాయని, రాజకీయాలంటే కార్పొరేట్ శక్తులు మాత్రమే అనేలా అపహాస్యం చేసేలా ఉన్నాయని, సేవ చేయాలనే యువత ఆలోచనలను నేటి పాలకులు కుతంత్రాలతో నాశనం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులలో ఆర్థిక అరాచకాలు,నేరాలు చేసిన వారే ఉన్నారని ఇది మన దేశ భవిష్యత్ కు పెను ప్రమాదమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కె. ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్,హేమంత్, బాలు, విజయ్,మహేష్, తో పాటు 10జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 15 మార్చి 2025

# ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి

- కిజ్రా ఎన్క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఆలీ



**రాజేంద్రనగర్, మార్చి 14 (జనం సాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ కిజ్రా కాలనీలో ఓ బిల్డర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. తన సొంత ప్రయోజనాల కోసం ఫుట్పాట్లను ఆక్రమిస్తూ, చెట్లను నరికి వేసి, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సదరు బిల్డర్ పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు కలెక్టర్కు కిజ్రా ఎన్క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఆలీ కాలనీవాసులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తన సొంత ఇంటి నిర్మాణం స్టీల్ ప్లస్ అనుమతులు తీసుకొని స్టీల్ ప్లేస్ 6 నిర్మిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఓ పక్క తన ఇంటి నిర్మాణంలో ఫుట్పాట్లను ఆక్రమిస్తూ, రోడ్డు కిరువైపుల హరితహారంలో నాటిన మొక్కలను తన సొంత ప్రయోజనాల కోసం ఇంటి నిర్మాణంలో అడ్డు వస్తున్నాయని నరికి వేయడం పై పర్యావరణ ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, బిల్డర్ అరాచకాలపై వివిధ శాఖలలో ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులపై వారే డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ బిల్డర్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేస్తున్నాడని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా వివిధ శాఖల అధికారులు సదరు బిల్డర్ పై చర్యలు తీసుకోని అనుమతులు లేని అక్రమ భవన నిర్మాణం అంతస్తులను కూల్చివేయాలని, అలాగే హరితహారంలో రోడ్డుకిరువైపులా నరికిన మొక్కలను తిరిగి నాటించి ఫుట్‌పాత్‌లను ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.

# హెూళి వేళ విషాదం

- బావిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి..?
- మృతదేహం కోసం ముమ్మర గాలింపు





**న్యాల్‌కల్, మార్చి 14 (జనం సాక్షి) :** తోటి స్నేహితులతో కలిసి సరదాగా హెూళి (రంగోళి) జరుపుకున్న యువకుడు కాసేపటికే మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెల కొన్నాయి. తోటి స్నేహితులు చూస్తూ.. చూస్తుండగానే నీట మునిగాడు. ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, వడ్డీ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఘటనస్థలి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డీ గ్రామానికి చెందిన కీర్తి శేషులు గాళేప్ప కుమారుడు శివకుమార్ (19) శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన తోటి మిత్రులు మాణిక్, చంద్రకాంత్, దీపక్, వెంకటేష్, ఆనంద్ లతో కలిసి మధ్యాహ్నం వరకు హెూళి పండగ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం మిత్రులతో కలిసి శంషాల్లాపూర్ గ్రామ శివారులోని దశాబ్దాల కాలం నాటి ఓ వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లారు. బావిలో స్నానం చేసిన అనంతరం శివకుమార్ (19) మినహా మిగిలిన నలుగురు యువకులు బావిలోంచి బయటకు వచ్చారు. యువకులందరూ చూస్తుండగానే శివకుమార్ బావినీటిలో మునగడంతో కేకలు వేశారు. ఇద్దరు యువకులు ప్రమాదస్థలి వద్దనే ఉండి.. మరో ఇద్దరు యువకులు వడ్డీ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, స్థానికులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం బావినీటిలో గల్లంతైన శివకుమార్ (19) తల్లి గాళమ్మ , సోదరుడు బసవరాజ్ స్థానిక హదునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై చెల్లా రాజశేఖర్, పోలీసుల బృందంతో కలిసి ప్రమాదస్థలిని పరిశీలించారు. బావిలో గల్లంతైన యువకుడి మృతదేహం కోసం తీవ్రంగా శ్రమించారు. పలువురితో మృతదేహాన్ని వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు మృతుడి తల్లి గాళమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

# హద్దునూర్ చెరువులో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**న్యాల్‌కల్, మార్చి 14 (జనం సాక్షి) :** రోజు వారీగా సమీపంలోని ఓ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని హద్దునూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చెల్లా రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హద్దునూర్ గ్రామానికి చెందిన వడ్డెర వెంకటేష్ (45) ఈ నెల12న ఉదయం స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఉదయం వెళ్ళిన వ్యక్తి సాయంత్రమైన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలింపు చేపట్టారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు మరుసటి రోజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల14న ఉదయం చెరువులో వెంకట్ (45) మృతదేహాన్ని స్థానిక పోలీసులు గుర్తించారు. విచారణ చేపట్టిన అనంతరం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి తగు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# విశ్వ మానవ ధర్మ పరిరక్షణకే పాదయాత్ర



**న్యాల్‌కల్, మార్చి 14 (జనం సాక్షి) :** ధర్మ పరిరక్షణ, విశ్వ మానవ కళ్యాణ పరిరక్షణ కోసమే ప్రతి ఏటా పాదయాత్ర, పల్లకి సేవ, రథయాత్ర కార్యక్రమాలను చేపడుతూ భక్తులకు ఉపదేశం అందిస్తున్నట్లు బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి, వైరాగ్య శిఖామణి దస్తగిరి మహారాజ్, మహామండలేశ్వర్ సిద్దేశ్వర నందగిరి మహారాజ్‌లు భక్తులకు మార్గదర్శనం చేశారు. బిల్లాపూర్ దత్తగిరి మహారాజ్ 46వ వార్షిక అమర తిథి సందర్భంగా కార్యక్రమాలను చేపట్టారు. ఈనెల 10న ప్రారంభమైన పల్లకి సేవ, పాదయాత్ర గురువారం రాత్రి న్యాల్ కల్ మండలంలోని హద్దునూర్ గ్రామానికి చేరుకుంది. ముంగి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్, న్యామతాబాద్ మహారాజ్ విశ్వగిరి మహారాజ్, నందిని గిరి మహారాజ్ లను మిర్జాపురి (ఎన్), హద్దునూర్ గ్రామాల శివారులోని దత్తగిరి ఆశ్రమం వద్ద స్థానిక భక్తులు కే.భాస్కర్ రెడ్డి, విట్టల్ రెడ్డి, రాజ్ కుమార్, విజయకుమార్, గోపాల్ రెడ్డి, సంగారెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం గంగువార్, మిర్జాపూర్ (బి) గ్రామాల మీదుగా పాదయాత్ర, పల్లకి సేవ జహీరాబాద్ పట్టణానికి చేరుకుంది.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**నర్సాపూర్, మార్చి 14 (జనం సాక్షి) :** మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటుకు నిరసనగా నర్సాపూర్‌లో శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భోగ శేఖర్ మాట్లాడుతూ స్పష్టమైన కారణం లేకుండా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై వేటు వేయాడం హేయమైన చర్య అని కాంగ్రెస్ ప్రభుత్వ దుశ్చర్యను ఖండిస్తూనామని తెలంగాణ సమాజం అంతా చూస్తోందన్నారు,ప్రజాక్షేత్రంలో ప్రతి ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్,నర్సింగ్ రావు,పార్టీ పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి,నాయకులు షేక్ హుస్సేన్,సూరారం నర్సింలు, పంబల్ల రాంచెందర్, జ్ఞానేశ్వర్ గుప్త,నాగరాజు గౌడ్,రాజేష్ , సలీం అలీ,ఇర్ఫాన్, హైమద్,వెల మర్తి జాన్, మానయ్య, విఠల్ గుప్త,కురుమ నవీన్, మహేష్ గౌడ్ ,కురుమ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తమ్మలోనిగూడలో బెల్ట్‌షాప్‌పై దాడి మద్యం సీసాలు స్వాధీనం

**యాచారం, మార్చి 14 (జనం సాక్షి) :** హెూలీ పండుగ రోజున మద్యం షాపులు తెరిచి ఉండకూడదని నిర్దిష్టంగా ఆదేశాలు ఉన్నా యధావిధిగా హెూలీ పండుగ రోజు కూడా ఓ బెల్టు షాపు నిర్వాహకుడు మద్యం విక్రయించాడు. సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తమ్మలోనిగూడకు చెందిన రాములు (55) వృత్తిరీత్యా కిరాణా షాపు నిర్వహిస్తూ బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్నాడు. అయితే ఈ క్రమంలో మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం తెలుసుకొని ఎస్సై పోలీసులు రాములు కిరాణా షాపుపై దాడి చేసి సోదా చేశారు. సోదాలో పలు మద్యం సీసాలు లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఇంపీరియల్ బ్లూ 750 ఎంఎల్ ఒక బాటిల్, కింగ్ ఫిషర్ బీర్లు 24 బాటిళ్ళు, రాయల్ స్టాగ్ ఐదు బాటిల్లో, ఐకాన్ క్యూ నాలుగు బాటిల్లో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.

# మానవత్వం చాటుకున్న మేము సైతం

- అంత్యక్రియలకు 8000 వేల ఆర్థిక సహాయం



**మందమర్రి, మార్చి 14 (జనం సాక్షి) :** ఇటీవల అంగడి బజార్‌లో హత్యయత్నంలో గాయపడిన రాంబాయి అనే మహిళ మరణించింది. సదురు మహిళది నిరుపేద కుటుంబం కాగ. దహన సంస్కారాలకు డబ్బులు లేని దుస్థితి. కాలనీ వాసులతో విషయం తెలుసుకున్న మేముసైతం సంస్థ విరాళం 8000/-సేకరించి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేము సైతం సంస్థ అధ్యక్షుడు బుబత్తుల శ్రీనివాస్, కమిటీ సభ్యులు సోమయ్య, మరియు అక్కెపెల్లి జనార్ధన్ పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం





**ఖమ్మం రూరల్, మార్చి 14 (జనం సాక్షి) :** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల తనయుడు యుగేందర్ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనడు తుమ్మల యుగేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిదిలోని బారుగూడెం శ్రీ సిటీలో నూతనంగా ఏర్పాటుచేసిన అనన్య మినరల్ వాటర్ ప్లాంట్ ను తుమ్మల యుగేందర్ చేతులమీదుగా ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వం కంటే ప్రజాప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ అందించి అన్నదాతకు అండగా నిలిచిన ప్రభుత్వం ప్రజాప్రభుత్వమే అన్నారు. గత ప్రభుత్వం చేయలని విదంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇళు ్ళ, ఇంటి స్థలం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజలకు అతి తక్కువ ధరకే మినరల్ వాటర్ అందిస్తున్న అనన్య మినరల్ వాటర్ ప్లాంట్ యజమాని కాకాని యశంత్ చౌదరి, దివ్య శ్రీ దంపతులను యుగేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, డైరెక్టర్ గరికపాటి విజయ్, జ్యోతి దంపతులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు తమ్మినేని నవీన్, విజయ్ రెడ్డి, నాగండ్ల దాసయ్య, భార్గవ్, రాజేష్, నరేష్, దావూద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలి



**కాప్రా, మార్చి 14 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని. బిఆర్ఎస్ పార్టీ యువజన రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి పేర్కొన్నారు. కాప్రా లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్‌లో అన్యువల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగాని రాజు అకాడమిక్ మేనేజర్ మురళి, జోనల్ మేనేజర్ జావేద్ అలీ, అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని విజయాలు సాధించాలని కోరుకున్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ మమత, , రవి మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ కక్ష



**మోమిన్‌పేట, మార్చి 14 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సామాజిక న్యాయాన్ని జీర్ణించుకొని కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుటుంబం తెలంగాణా రాష్ట్ర స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ఆ సీట్లో కూర్చోవడం పట్ల బిఆర్ఏస్ కక్ష కట్టిందని వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్కతల వెంకటేశం అన్నారు. గురువారం అసెంబ్లీలో బిఆర్ఏస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాటలు బిఆర్ఏస్ పార్టీ అహంకారానికి నిదర్శనం అని పేర్కొన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా బట్టి విక్రమార్క ఉంటే మా కాంగ్రెస్ ఎమ్మెల్యే లను పార్టీ పిరాయింపులకు ఆజ్యం పోసి నాడు బట్టి విక్రమార్కకి ప్రతిపక్ష నాయకుడు హెూదాను తొలగించారు. సభలో కీలక పదవులైన స్పీకర్, ఉప ముఖ్యమంత్రిగా దలితున్నారనే అహంకారంతో కేసీఆర్ సభకు రాకుండా అహంకారంతో కొనసాగుతున్నారని బిఆర్ఏస్ పార్టీ తెలంగాణా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం అనైతికం

- రాజ్యాంగ పదవిని ప్రభావితం చేసిన పాలకపక్షం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్



**వనపర్తి, మార్చి 14 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే అయిన జి. జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అనైతిక చర్యయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ధ్వజమెత్తారు. జగదీశ్వర్ రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ ఒంటికాలు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల తరుపున ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని మాట్లాడనివ్వకుండా అధికార పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు పలు సార్లు అడ్డుతగిలారని అన్నారు. అందుకే ఈ సభ మీ ఒక్కరిది కాదని అందరిదని మాజీ మంత్రి మాట్లాడిన విజువల్స్ ను తెలంగాణ ప్రజలు ప్రత్యక్షంగాచూశారని అన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి వాటిని స్పీకర్ కు అన్వయించి పాలకపక్షం నేతలు కుట్లు పన్నారని దుయ్యబట్టారు.బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు పి.రమేష్ గౌడ్,జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయి, పాలన పక్కదారి పడుతుంది, సమయం ఇవ్వాలని కోరితే సస్పెండ్ చేయడాన్ని నిరసించారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు రైతు భరోసా, రైతు భీమా,రైతు రుణ మాఫీ, మహిళకు రూ.2500 పింఛన్లు,నిరుద్యోగ భృతి,కె.సి.ఆర్ కిట్టు,కళ్యాణ లక్ష్మి తోలం బంగారం తదితర అంశాలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తే తట్టుకోలేక అన్ పార్లమెంటరీ పదాలు మాట్లాడారని,దళిత స్పీకర్ ని అవమాన పరిచారని ఆరోపిస్తూ అసెంబ్లీ వాయిదా వేసి కుట్ర పూర్తిగా సస్పెండ్ చేయాడాని తీవ్రంగా ఖండించారు.వెంటనే బేషరతుగా సస్పెండ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ బండారు కృష్ణ,నాగన్న యాదవ్, ఉంగ్లమ్ తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, డాక్టర్ డ్యానియల్, స్టార్ రహీమ్,జానంపేట్.శ్రీనివాసులు, జోహెబ్ హుస్సేన్, ఫజల్, ఏ.కె.పాషా, అలీం, ఎం.వెంకటయ్య, మాణికుమార్, లక్ష్మణ్ శివ, భరత్, ఇంతియాజ్,తోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం



**అల్వాల్, మార్చి 14 (జనంసాక్షి) :** మచ్చ బొల్లారం కు చెందిన రాజు, పెయింటర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అల్వాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంత రెడ్డి, శుక్రవారం రాజు ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఆయన, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సంఘటన తోట దశమంత రెడ్డి యొక్క మానవీయ వైఖరిని ప్రతిబింబించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# తాటిచెట్టుపై నుంచి జారిపడిన గీతా కార్మికుడు



**నంగునూరు, మార్చి 14 (జనం సాక్షి) :** నంగునూరు మండలం కొండంరాజుపల్లికి చెందిన గీతా కార్మికుడు సల్లూరి మోహన్ గౌడ్ శుక్రవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీది నుండి జారి పడ్డాడు. దీంతో వెన్ను పూసకు దెబ్బలు తగిలాయి. చుట్టుపక్కల ఉన్నవారు గమనించి వెంటనే మోహన్ గౌడ్‌ను సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించారు. బీ ఆర్ ఎస్ కార్మిక విభాగం మండలశాఖ అధ్యక్షుడు గొనేపల్లి సిద్ధేశ్వర్ గౌడ్ విషయాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు తెలియజేశారు. వెంటనే స్పందించిన హరీశ్ రావు ఆసుపత్రికి ఫోన్ చేసి మోహన్ కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మోహన్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## హెూలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :**

హెూలీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హెూలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదట ఎల్ఎండి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నాయకులు కార్యకర్తల సమక్షంలో రంగులు చల్లుకుని ఉత్సాహంగా పాటలకు స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి మాట్లాడుతూ... ఈ రంగుల హెూలీ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం నగర కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లా టిఎన్జీవోల ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు

**కరీంనగర్ బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :**

ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీ ఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు బ్యాండ్ భాజాలతో సాంప్రదాయ నృత్యాలతో డ్యాన్సులు చేస్తూ రంగులు చల్లుకుని వారి ఐకమత్యాన్ని చాటారు. తదాంతరం ర్యాలీగా డప్పు సప్పులతో డ్యాన్సులతో సందడి చేస్తూ వెళ్లి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ని కలిసి హెూలీ శుభాకాంక్షలు తెలియజేసీ హెూలీ సంబరాలు షేర్ చేసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రపులు దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ కి హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ... హెూలీ మన భారత దేశ సంస్కృతి సంప్రదాయాలు లోతుగా పాతకపోయినా శక్తివంతమైన పండుగని చెడుపై మంచి విజయం సాధించిన రోజు అని ప్రజలు ఉద్యోగులు పండుగను భక్తి శ్రద్ధలతో



కులాలకుతీతంగా ఉత్సాహంగా ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. జిల్లా అధికారులతో కలిసి హెూలీ సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. టీజీవోల జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్ వారి కార్యదర్శి అరవింద్ రెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, లక్ష్మి నరసింహారావు, సబిత, కోశాధికర్ కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డితో పాటు మహిళా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శారద, సబితా, సునీత, సరిత, విజయలక్ష్మి, శైలజ, సుస్మిత, రామా స్వరూప, రాధిక, రమున, జిల్లా టీఎన్జిఓ నాయకులు రాజేశ్వరరావు, సర్దార్ హరిమేందర్ సింగ్, కేశవరెడ్డి, అభిషేక్ రెడ్డి, మహేష్, అజయ్ నారాయణ, అల్లే శ్రీనివాస్, కాంతయ్య, బధిర (మాట వినిగిరి లోపం )ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, బధిర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆదికవి పాల్కూరికి సోమనాధుడు

**పాలకుర్తి, మార్చి 14(జనంసాక్షి)**



పాల్కూరికి సోమనాధుడు ఆదికవి అని కాంగ్రెస్ పార్టీ న్నియోజకవర్గ ఇంచార్జి అను మాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని పాల్కూరికి సోమనా ధుడు దీపారాధన కార్యక్రమ ంలో భాగంగా ఆయన విగ్రహానికి ఝాన్సీరెడ్డి మ్యు అతిధిగా హాజరై పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సోమనాధుడుని ఆదర్శంగా తీసుకొని కవులు, రచయితలుగా ఎదిగారని అన్నారు. ఈ ప్రాంతంలో జన్మించిన ప్రతి ఒక్కరు ఆదృష్టవంతులని అన్నారు. సోమనాదుడు ఇంటిపేరే క్రమ క్రమంగా పాలకుర్తిగా మారిందని అన్నారు. చారిత్రక ప్రాంతంగా విరాజిల్లుతున్న ఈ నేలను అన్ని విధాలు అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, దేవస్థానం సూపరిండెంట్ వెంకటయ్య. పూజారి దేవగిరి అనిల్ శర్మ, గూడూరు లెనిన్, తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సభను అడ్డుకుంటాం

### జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి

**స్టేషన్ ఘన్పూర్** : మాజీ ఎంఎల్ఏ డాక్టర్ రాజయ్య నేతృత్వంలో స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో ఈ నెల 16న జరగనున్న సీఎం రేవంత్ రెడ్డి సభను కచ్చితంగాఅడ్డుకుంటామని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్,జెడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ మారిన వాళ్లను రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని,అదే వ్యక్తి ఇప్పుడు పార్టీ మారిన కడియం శ్రీహరితో కలిసి సభ నిర్వహించడం ఎలా న్యాయం అని ప్రశ్నించారు. మీరు ముందుంటే మేము కూడా ముందుంటామని, మీరు హామీ ఇస్తే, అదే సభా వేదికపై కడియం శ్రీహరిపై రాళ్లు విసరడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో రైతులు రాజులా జీవించార నీ,ఇప్పుడు సాగునీరు అందక పంటపొలాలు ఎండిపో తున్నాయని అన్నారు. స్టేషన్ఘన్పూర్లో ఏడు రిజ ర్వాయర్లుఉన్నా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి స్టేషన్ఘన్పూర్లో అడుగు పెట్టడానికి ఏ హక్కుందని ఆయన ప్రశ్నించా రు. తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడతామని అన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి స్వార్థం కోసం కాంగ్రెస్లో చేరినందుకు వ్యతిరేకంగా ఈ సభను తప్పకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రైతు బంధు ను రైతు బరోసాగా మార్చి , రైతులకు ఎలాంటి బరోసా లేకుండా చేసి దాదాపు 420 మంది రైతుల ఆత్మహత్యలకు కారణమైన సీఎం రైతు బరోసాఅందరి రైతులకు అందజేసినాక ఈ గడ్డపైఅడుగు పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ మండల సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు తాటికొండ సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనకం గణేష్ , ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ చల్ల చందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గుండె మల్లేష్, దళిత నాయకులు గుర్రం చిట్టిబాబు,గాదే రాజు తదితరులు పాల్గొన్నారు.



## పాములు పట్టే వినీల్ అంటే నిర్మల్ పట్టణ వాసులకు కొండంత ధైర్యం

**నిర్మల్ పట్టణం , మర్చి 14 ( జనం సాక్షి )**



నిర్మల్ జిల్లా శాంతినగర్ లో పాల వ్యాపారిగా తన జీవితం కొనసాగిస్తూ తనదైన రీతిలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వన్యప్రాణు లపై తన జాలి గల మనస్సుతో విష సర్పాలను పట్టి అడవుల్లో వదిలేస్తా డు. గతంలో అతి నుంచి అతిభారీ కొండచిలువను నిర్మల్ లోని ఇందిరానగర్ లో పట్టి శబాష్ అనిపించుకున్నాడు. నాగుపాము చెడ్డ చెడుగు రక్తపింజర లాంటి పాములను చాల చాకచక్యం గ పట్టుకునే వినీల్ నిన్న 13 మర్చి రోజున కనీసం 5 అడుగుల నాగుము పామును పట్టి అడవిలో వదిలి పెట్టడు నిర్మల్ జిల్లాలో అక్కడైనా విష స్వరూపాలు కనిపిస్తే వినీల్ 8522859941 నెంబర్ కి కాల్ చేస్తే ఎటువంటి ఫీజు లేకుండా పామును పట్టు కొని అడవి లో వదిలే స్తాడు వినీల్ ని ప్రభుత్వం ప్రత్యక గుర్తింపు ఇవ్వాలని స్థానికులు కోరుకుంటున్నారు.







# ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా హెూలీ వేడుకలు

### కరీంనగర్ జిల్లా ప్రముఖులను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆర్ఎస్ఎస్ బాధ్యులు.

**కరీంనగర్ బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంపర్క విభాగం కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ , ఆర్ డి ఓ , కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ లతో పాటు ఇతర ప్రముఖులను ఆర్ఎస్ఎస్ బాధ్యులు డాక్టర్ రమణ చారి, నిరంజన చారి, ఎలగందు సత్యనారాయణ , పాక సత్యనారాయణ కలిసి హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ బాధ్యులు మాట్లాడుతూ... ఆధునిక కాలంలో సామాజిక సమైక్యత, సమిష్టి భావనకు ప్రత్యేకంగా నిలిచినట్లే హెూలీ పండుగకు పురాణ నేపథ్యం ఉందన్నారు. ముఖ్యంగా కాముని దహనం, ప్రహల్లాద చరిత్ర ఈ పండుగతో ముడిపడి ఉన్నాయన్నారు. హెూలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందోత్సవాలు , ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను మరింత పెంపొందాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రేమ, ఆప్యాయత, సౌభ్రాతృత్వానికి ప్రతీక హెూలీ

**కరీంనగర్ బ్యూరో, మార్చి 14 (జనంసాక్షి) :**

ప్రజలందరికి హెూలీని
శుభాకాంక్షలు
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్
పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి
వెలిచాల రాజేందర్ రావు.



హెూలీ పండుగ అందరి జీవితాల్లో ఆనం దాన్ని నింపాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆకాంక్షించారు. శుక్రవారం హెూలీ పండుగ సందర్భంగా రాజేందర్ రావు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ... ప్రేమ, ఆప్యాయత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన ఈ రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకొనే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని తెలిపారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మరింత ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ఆదర్శ రాష్ట్రంగా మంచి పేరు సాధిస్తుందని చెప్పారు. వసంత ఋతువు ఆగమనాన్ని తెలియజేసే విధంగా హెూలీ దేశవ్యాప్తంగా ప్రజలు ఆనందంగా, ఉల్లాసంగా జరుపుకుంటారని తెలిపారు. ఇంద్రధనస్సులోని రంగులు ఇంటింటా వసంతంగా కురిసే ఆనందాల పండుగ హెూలీ అని పేర్కొన్నారు.
పండుగను ప్రకృతిపరంగా లభించే సహజ సిద్ధమైన రంగుల మిశ్రమాలతో జరుపుకున్నామని వెలిచాల రాజేందర్ రావు తెలిపారు.

# ట్యాంక్ బండ్ పై ప్రభాకర్ రావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి...



### ప్రభాకర్ రావు 77వ వర్ధంతి సభలో ఎల్లాపి సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల మురళి డిమాండ్

**ఖానాపూర్ రూరల్ 14 మార్చి (జనం సాక్షి)**

రాష్ట్ర రాజధానిలో ట్యాంక్ బండ్ పై ప్రభాకర్ రావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎల్లాపి సంఘం జిల్లా అధ్యక్షులు పుప్పాల మురళీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో అనబేరి ప్రభాకర్ రావు 77వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో ఎల్లాపి సంఘం జిల్లా అధ్యక్షులు మురళి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, తదితరులు వేదికపై మాట్లాడారు. ఈ సందర్భంగా స్వాతంత్ర ఉద్యమంలో ప్రభాకర్ రావు సేవలను గుర్తించేలా పాఠ్య పుస్తకాలలో ఆయన చరిత్రను ముద్రించాలని కోరారు.

అనభేరి ప్రభాకర్ రావు చేసిన సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని వక్తలు డిమాండ్ చేశారు. అనంతరం అనభేరి ప్రభాకర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎల్లాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని గణపతి రావు, మాజీ జిల్లా కార్యదర్శి పడాల మోహన్ రావు, జిల్లా నాయకులు పెర్క గంగాధర్, బోనగిరి కాంతారావు, చింతపండు సత్తయ్య, శెట్టి ప్రభాకర్, రామారావు, శెట్టి సతీష్, నర్సింగ్ రావు తదితరులున్నారు.

# కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీరాజ్, అటవీ అధికారుల మధ్య సయోధ్య

## కలెక్టర్ హామీతో శాంతించినఈజిఎస్ కూలీలు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో మార్చ్ 14 ( జనం సాక్షి) :**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలో ఈజిఎస్ కూలీలు, అటవీశాఖ అధికారుల మధ్య నెలకొన్న సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయింది. గత బుధవారం మండలంలోని బోరిగాం గ్రామప ంచాయతీ పరిధిలోగల దరిగాం అటవీ సమీపంలో మండలంలోని బట్టుపల్లి గ్రామా నికి కూలీలు ఉపాధి హామీ పనులను చేస్తుండగా బీట్ అధికారి రవి అడ్డుకొని, దుర్భాషణలు ఆడుతూ వివాదానికి కారకులు అయ్యారు. దీంతో ఎంపీడీవో రమేష్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో బీతాధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సమస్య తీవ్రం కావడంతో నేరుగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ రంగంలోకి దిగారు. వెంటనే డిఆర్డిఓ, జెడ్పి సీఈఓ లను కాగజ్నగర్ మండలానికి సమస్యను పరిష్కరించాలని పంపించారు. దీంతో వారు ఎంపీడీవో ఆధ్వర్యంలో ఈజీఎస్ కూలీలతో చర్చించారు. అలాగే కూలీలపై దురుసుగా వ్యవహరించిన అటవీ శాఖ బీట్ అధికారి రవి గురించి స్థానిక అటవీశాఖ ఉన్నత అధికారులతో

మాట్లాడారు. అనంతరం గురువారం రాత్రి కాగజ్ నగర్ ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ అనిల్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శశిధర్ బాబు, సెక్షన్ ఆఫీసర్ మోహన్, బీట్ అధికారి రవి లు ఎంపీడీవో కార్యానికి వచ్చి సమస్యపై చర్చించారు. ఇకమీదట ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా

చూస్తామని అటవీశాఖ అధికారులు ఎంపీడీవో బి .రమేష్, ఉపాధి హామీ అధికారి బుచ్చన్న, ఉపాధి హామీ కూలీలకు సంజాయిశి ఇచ్చుకున్నారు. దీంతో సమస్యకు పరిష్కారం కుదిరింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
15 మార్చి 2025

# మంత్రి ఆదేశాలు సైతం బేఖాతర్

- యథేచ్ఛగా భూకబ్జా
- హుస్నాబాద్ ఎల్లమ్మ గుడి భూమి కబ్జాకు యత్నం
- మంత్రి కొండా సురేఖ ఆదేశాలిచ్చినా ఆగని ఆక్రమణ
- చిత్ర దర్శకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ రఫీ



**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) : మంత్రి కొండా సురేఖ ఆదేశాలను కూడా బేఖాతర్** చేశారని చిత్రదర్శకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ రఫీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో సర్వే నంబర్ 265లో సోదర భావంతో ఎల్లమ్మ గుడికి మేము 4 ఎకరాల 4 గుంటల భూమిని దానం చేశామన్నారు. ఇప్పుడు దాని విలువ సుమారు 32 కోట్ల 80 లక్షల రూపాయలని తెలిపారు. దాని ప్రక్కన ఉత్తరం వైపు సర్వే నంబర్ 264 లో 32 1/2 గుంటల మా సొంత భూమిని ఆ గుడి ఈవో ఇంకా కొందరు కలిసి, రెండో శనివారం, ఆదివారం, రాత్రిపూటలు లైట్లు పెట్టి మరి, ఎండోమెంట్ ముసుగులో కబ్జా చేస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశామన్నారు. సెప్టెంబర్ 2024లో అడ్వకేట్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన మా భూమి సర్వే హద్దు రాళ్ళను తొలగించి మరి, పిల్లర్లు లేపడం మొదలు పెట్టినారని పేర్కొన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇద్దరు ఒకటై, ఈ ఆక్రమణకు పాలుపడుతున్నారనే అనుమానం వస్తుందన్నారు. మంత్రి కొండా సురేఖ తక్షణమే స్పందించి అక్కడ జరుగుతున్న పనిని ఆపేయాలని, అపరాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జాయింట్ సర్వే చేయించాలని, దేవాదాయ శాఖ కమిషనర్ ని ఆదేశించినా, అక్రమ నిర్మాణం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈ దుశ్చర్యలను తక్షణమే నిలిపివేసి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

# సంక్షేమ పథకాల్లో ఎక్కడా వివక్ష లేదు

- పార్టీలకు అతీతంగా అందరికీ వర్తింపు
- వైకాపా నాయకులతో చెట్టాపట్టాలేయవద్దు
- నామినేటెడ్ పదవులను త్వరలోనే భర్తీ చేస్తాం
- గ్రామాల్లో అభివృద్ధి పనులపై సవిరీక్షించాలి
- పిఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం చేయాలి
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, మార్చి 14 (జనంసాక్షి) :** ఏ స్థాయిలో కూడా వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని స్పష్టం పార్టీ నేతలకు చంద్రబాబ నాయుడు మరోమారు స్పష్టం చేశారు. నేను ఈ విషయాన్ని చెప్తే వైసీపీకి ఓటు వేసిన వారికి పథకాలు ఇవ్వొద్దని చెప్పినట్లు ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆయన.. సంక్షేమ కార్యక్రమాల అమల్లో వివక్ష ఉండదు.. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నాం.. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ పరమైన సంబంధాలు వేరన్నారు. వైసీపీ వారిని దరిచేరనివ్వొద్దని సూచించారు.. మరోవైపు, నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నాం. పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని.. వీల్కెనంత త్వరగా పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలను నామినేటెడ్ పదువుల కోసం అందించాలి. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం.. రాష్ట్రం వ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు చైర్మన్‌లను నియమిస్తాం అని అన్నారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం.. పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయన్న ఆయన.. జిల్లాల్లో ఇంఛార్జ్ మంత్రులు తప్పనిసరిగా పర్యటించాలని స్పష్టం చేశారు.. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సవిరీక్షలు నిర్వహించాలి. జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లా కో-ఆర్డినేటర్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంత్రులు సమాచారం అందించాలి. గ్రూపు రాజకీయాలకు ఎక్కడా తావు ఇవ్వకూడదు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో ఫోకస్ పెట్టాలి. పర్యటనల సంఖ్య పెరగాలి. కార్యకర్తలు, నాయకులతో మమేకమవ్వడంతోపాటు జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలని ఆదేశించారు.నామినేటెడ్ పదువుల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి.. అన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నాం. పదువులు తీసుకున్నట్లు కాదు? ఎన్నికల్లో ప్రభావం చూపించాలని సూచించారు. మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు? రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తామన్న ఆయన.. ఇప్పటికే పదవులు తీసుకున్న వారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నామో ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలి. ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన మనం అందించాలి. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం మన విధానం. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి గ్రామంలో అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు, నేతలు చొరవ తీసుకోవాలి. 2 కిలోవాట్‌ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రూ.20 వేల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనంగా అందిస్తాం. కేంద్రం ఇచ్చే రాయితీతో కలిపి బీసీలకు రూ.80 వేల మేర రాయితీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తాం. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యం పెట్టుకోవాలన్నారు.. ప్రతి ఎమ్మెల్యే



అసెంబ్లీలో, ఎంపీలు పార్లమెంట్‌లో విరీ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకుని ప్రజాప్రతినిధులు ముందుకెళ్లాలని సూచించారు. పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రులు తప్పనిసరిగా పర్యటించాలని ఆదేశించారు. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సవిరీక్షలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లా కో-ఆర్డినేటర్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంత్రులు సమాచారం అందజేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. గ్రూపు రాజకీయాలకు ఎక్కడా తావు ఇవ్వకూడదని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో ఫోకస్ పెట్టాలని పర్యటనల సంఖ్య ఇంకా పెరగాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులతో మమేకమవ్వడంతో పాటు జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలని సూచించారు.

# మంగళగిరి రూపురేఖలు మారుస్తా..

- గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానన్న మంత్రి లోకేశ్

**గుంటూరు, మార్చి 14 (జనంసాక్షి) :** ఎన్నికల్లో భారీ మెజారిటీతో తనను గెలిపించిన మంగళగిరి వాసులకు జీవితాంతం గుర్తుండిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలను రానున్న వంద రోజుల్లో ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. భూగర్భ డ్రైనేజీ, నడుమూరు ఫ్లై ఓవర్ పనులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. ఎర్రబాలెంలో జైనుల ఆధ్వర్యంలో నిర్మించిన భగవాన్ మహవీర్ గోశాలను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. హెూలీ సందర్భంగా చిన్నారులకు లోకేశ్ రంగులు పూశారు. అనంతరం రమేశ్ జైన్ ఆధ్వర్యంలో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్‌ను మార్వాడీలు ఘనంగా సన్మానించారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి అభివృద్ధి పనులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న వంద రోజుల్లో మంగళగిరి ప్రజలు ఊహించని రేంజ్ లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. రహదారులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారు. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటానని.. రాబోయే ఐదేళ్లలో మంగళగిరి రూపు రేఖలు మారుస్తానని తెలిపారు. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత తన విరీద ఉందన్నారు. గత ప్రభుత్వం మంగళగిరిని పట్టించుకోకుండా అన్యాయం చేసిందన్నారు. రాబోయే



వంద రోజుల్లో మంగళగిరిని పూర్తిగా మార్చేస్తామని వివరించారు. విద్యాశాఖలో తాము చేస్తున్న మార్పులు చూసి అంతా మెచ్చుకుంటున్నట్టు తెలిపారు. ఏపీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ లక్ష్యం అని.. ఏ ప్రాంతం విరీద తమకు వివక్ష లేదన్నారు. తమకు గొప్పలు చెప్పుకునే అలవాటు లేదని.. రాబోయే రోజుల్లో ఏపీ రాజధాని పనులు చాలా వరకు పూర్తవుతాయన్నారు.

# దేశవ్యాప్తంగా హెూలీ వేడుకలు

- సంభాల్‌లో 46 ఏళ్ల తరవాడ సంబరాలు

**లక్నో, మార్చి 14 (జనంసాక్షి) :** దేశమంతటా అత్యంత ఉల్లాసంగా, ఉత్సాహంగా హెూలీ వేడుకలు జరిగాయి. జనమంతా రంగుళకేళిలో తేలియాడారు. ముఖ్యంగా చిన్నారులు వాటర్ గన్‌లను తీసుకుని రంగులు జల్లుకుంటూ ఉత్సాహాన్ని పంచుకున్నారు. కాగా.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్‌లో మాత్రం 46 ఏళ్ల తర్వాత హెూలీ ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారిగా నగరంలోని కార్తికేయ ఆలయంలో హెూలీ వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఒకరినొకరు గులాల్ పూసుకుంటూ.. సంబరాలు జరుపుకున్నారు. హెూలీ ఊరేగింపు సంభాల్‌లోని ఒక మసీదు ముందు నుంచి సాగింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. వాస్తవానికి.. భస్మ శంకర్ ఆలయం అని కూడా పిలువబడే కార్తీక్ మహాదేవ్ దేవాలయం 1978లో మూసేశారు. మత అల్లర్లు నగరాన్ని కుదిపివేసిన తరువాత.. ఆలయం మూతపడిరది. ఈ ఆయంలో46 సంవత్సరాల తర్వాత డిసెంబర్ 13, 2024న తిరిగి తెరిచారు. ఈ దేవాలయానికి విముక్తి కలిగిన తర్వాత వచ్చిన మొదటి హెూలీ ఇది. అందుకే భక్తులు, హిందువులు పెద్ద ఎత్తున డీజే చప్పుళ్లతో నగర పుర వీధులు గుండా డ్యాన్స్‌లు చేస్తే ఘనంగా హెూలీ నిర్వహించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ విరీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల సంభాల్ పోలీస్ అధికారి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అయ్యాయి. 'హెూలీ ఏడాదికి ఒకసారి వస్తుంది. శుక్రవారం నమాజ్ 52 సార్లు చేసుకోవచ్చు. ఎవరికైనా హెూలీతో ఇబ్బంది ఉంటే ఇంట్లోనే ఉండండి.' అని సంభాల్ పోలీస్ అధికారి అనుజ్ చౌదరి అన్నారు. దీనిపై రాజకీయ విమర్శలు వచ్చాయి. సంభాల్‌లోని వివాదాస్పద జామా మసీదుతో పాటు మరో 10 మసీదులను టార్పలిన్లతో కప్పారు. పోలీసులు భారీ బందోబస్తు మధ్య రెండు మతాల పండుగలు సామరస్యంగా జరుపుకున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

**తిరుమల, మార్చి 14 (జనంసాక్షి) :** ప్రభుత్వానికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అమరావతిలో శ్రీనివాస కల్యాణం పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని మంత్రి రవీంద్ర తెలిపారు.

# మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి) :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ లిఫ్ట్ గుంతలో పడి యువకుడు మృతి చెందాడు. మద్యం మత్తులో ఇద్దరి స్నేహితుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో లిఫ్ట్ గుంతలో పడిపోయారు. గమనించిన తోటి స్నేహితులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఒకరు మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఓల్డ్ ఆఫీజ్ పెట్ కి చెందిన నరేందర్‌గా గుర్తించారు.

# మనం నిలబడ్డాం..టీడీపీని నిలబెట్టాం

- జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగం



**పిఠాపురం, మార్చి 14 (జనంసాక్షి):** జనసేన 11 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్ని..ఎన్నో కష్టష్టాలను ఓర్చుకుని..వేధింపులను తట్టుకుని...అరాచక పార్టీని అధికారం నుంచి దింపడమే కాదు...11 సీట్లకే పరిమితం చేశామని జనసేనాని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. అసెంబ్లీ గేటును కూడా తాకనివ్వమని చెప్పిన వారిని అధికారానికి దూరం చేశామని అన్నారు. ఎన్నికల్లో ఓడినా అడుగు ముందుకే వేశామని, ఎన్నికల్లో విజయం సాధించామని పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం శివారులోని చిత్రాడలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. 'మనం నిలబడ్డాం.. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో మనం ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం సట్రయిక్ రేట్ సాధించాం అంటే అది జనసేన పవర్ అని అన్నారు. భయం లేదు కాబట్టే ఇంత దూరం వచ్చానని, గుండె ధైర్యమే కవచం' అని పవన్ వివరించారు. 'జనసేన జన్మస్థలం తెలంగాణ.. కర్మస్థానం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగిగా సేవ చేస్తా..

- గ్రూప్ 3 ప్రథమ ర్యాంకర్ అర్జున్ రెడ్డి

**పాపన్నపేట, మార్చి 14 (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకును సొంతం చేసుకొని మెదక్ జిల్లా పాపన్నపేట చరిత్ర సృష్టించింది.గ్రూప్ 3 రాష్ట్ర టాపర్ గా పాపన్నపేటకు చెందిన కుకునూరి అర్జున్ రెడ్డి ప్రతిభ కనబరిచాడు.శుక్రవారం టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో 339.239 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంక్ సాధించాడు.ఇటీవల ప్రకటించిన గ్రూప్ 2 లో స్టేట్ 18 వ ర్యాంక్ సాధించాడు.అర్జున్ రెడ్డి విద్యాభ్యాసం ఇలా సాగింది..పదవ తరగతి 2006-2007 శిశుమందిర్ మెదక్ లో 548 మార్కులు,ఇంటర్ ఎంపీసీ నారాయణ కాలేజీ 934 మార్కులు వచ్చాయి.బిటెక్ ఈసిఈ ఇంజినీరింగ్ 2009-2013 హైదరాబాద్ లో చదివాడు.2014 వీఆర్ వో ఉద్యోగం నుండి 2020 ఆర్ఐ గా ప్రమోషన్ వచ్చింది.ప్రస్తుతం హవేలీ ఘనపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ,మెదక్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు.వరుసగా ప్రకటించిన ఫలితాల్లో అర్జున్ మంచి ప్రతిభ కనబర్చడం పట్ల మెతుకు సీమ జిల్లా



వాసులు,స్నేహితులు, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన తల్లిదండ్రులు శోభ,నరేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా ప్రథమ ర్యాంకర్ అర్జున్ రెడ్డి జనంసాక్షి ప్రతినిధితో మాట్లాడారు.రోజుకు 10 నుండి 12 గంటలు చదివినానని అన్నారు.తాత ధర్మారెడ్డి ప్రజలకు సేవ చేయాలని చెప్పేవారని గుర్తు చేశారు.ప్రభుత్వ ఉద్యోగిగా సాధ్యమైనంత వరకు ప్రజలకు సేవ చేస్తానన్నారు.కాగా గ్రూప్ 2 పోస్టుకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.భవిష్యత్తులో గ్రూప్ 1 డిప్యూటీ కలెక్టర్ కు అర్హత సాధించడానికి కృషి చేస్తానని వివరించారు.పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని,ప్రామాణిక మైన పుస్తకాలను ఎంపిక చేసుకుని చదవాలని సూచించారు.

# ప్రజల సంక్షేమమే పవన్‌కళ్యాణ్ లక్ష్యం

- పిఠాపురం జనసేన జయకేతన సభలో నాగబాబు



**పిఠాపురం, మార్చి 14 (జనంసాక్షి) :** పిఠాపురం ప్రజలు, జన సైనికులకు రుణపడి ఉన్నామని జనసేన ముఖ్యనేత, ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబు అన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన 'జయ కేతనం' సభలో నాగబాబు మాటల్లో.... 'నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఏం జరుగుతుందో చూశాం. నోటిదురుసు ఉన్న నేతకు ప్రతిపక్ష హెూదా కూడా దక్కలేదు. రాజకీయాల్లో జాగ్రత్తగా మాట్లాడాలని పవన్ చెప్పారు. జగన్ లాంటి హాస్యనటులు ఎన్నో కలలు కన్నారు. మరో 20 ఏళ్ల వరకు జగన్ కలలు కంటూనే ఉండాలని నా సలహా అంటూ చలోక్తులు విసిరారు. జనసేన నేతలు, కార్యకర్తలు, వీర మహిళలకు జనసేన 12వ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.అధికారం వచ్చింది కదా అని నేతలెవరూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని సలహా ఇచ్చారు. పవన్ కల్యాణ్ క్రమశిక్షణ కలిగిన నేత. 12 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఆయన ఎదుర్కొన్నారు. పిఠాపురంలో ఘన విజయం సాధిస్తామని పవన్‌కు ముందే తెలుసు. రాబోయే 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణయుగం చూడబోతోంది. పదవులు వచ్చినా, రాకపోయినా ఆయనకు సేవలు చేస్తాం. ప్రజలు బాగోగులు చూసే వ్యక్తి పవన్. అడగకుండానే వరాలు ఇచ్చేది వ్యక్తి పవన్. జనసేనకు ప్రాణవాయువు కార్యకర్తలు, వీర మహిళలు. పవన్‌లా గొప్ప వ్యక్తి కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలని' చెప్పారు.ప్రజల బాగోగులు చూసే వ్యక్తి పవన్ కల్యాణ్. అలాంటి ఒక గొప్ప వ్యక్తిగా కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలి. వచ్చే రెండు, మూడు తరాల గురించి ఆలోచించే వ్యక్తి పవన్. దేవుడు అడిగితేనే వరాలిస్తాడు.. కానీ, ఆయన అడగకుండానే వరాలిస్తారు. నాకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చిన పవన్‌కు కృతజ్ఞతలు. జనసైనికుడిని అని చెప్పుకొనేందుకు గర్వ పడుతున్నా. పిఠాపురంలో పవన్ విజయానికి తానే కారణమని ఎవరైనా అనుకుంటే అది వారి కర్మ' అని నాగబాబు అన్నారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా 12 ఏళ్ల జన సేన ప్రస్థానంపై ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని వేదికపై ప్రదర్శించారు. జనసేన పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు భారీగా తరలివచ్చారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తల కోసం ప్రత్యేక గ్యాలరీలను పార్టీ వర్గాలు ఏర్పాటు చేశాయి. ఒక్కో గ్యాలరీలో సుమారు 2,500 మంది కూర్చొనేలా సిద్ధం చేశారు. అయినా భారీగా కార్యకర్తలు తరలిరావడంతో సభా ప్రాంగణం బయటే పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు నిలిచిపోయారు.

# గోశాలను ప్రారంభించిన లోకేశ్

**మంగళగిరి, మార్చి 14 (జనంసాక్షి) :** మంగళగిరికి మంత్రి నారా లోకేష్ హావిరీల వర్షం కురిపించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మంగళగిరి ప్రజలకు అండగా ఉంటానని హావిరీ ఇచ్చారు. ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోలేనిదని తెలిపారు. ప్రజలు తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారని మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం, యర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో భగవాన్ మహవీర్ గోశాల సంస్థ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన గోశాలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఏపీలో ఎప్పుడూ జరగని విధంగా మంగళగిరిని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

ఇదిలావుంటే మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మెూత్సవాల్లో భాగంగా రాత్రి 12 గంటలకు నిర్వహించిన స్వామి వారి కల్యాణమహెూత్సవంలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ప్రభుత్వం తరపున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివార్లకు విష్వక్షణ ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, మధుపర్క నివేదన, స్వామివారి పాదపక్షాలన, విశేష అర్చన, మహా సంకల్పం, ముత్యపు తలంబ్రాలు, బ్రహ్మముడి, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

మంత్రి నారా లోకేష్ దంపతుల రాకను పురస్కరించుకుని ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ నరసింహస్వామ దేవాలయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ దంపతులకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విపణి

## రైలు టికెట్ కొనడమే కాదు...

# క్యాన్సలేషన్‌పైనా అవగాహన ఉండాలి



**జనంసాక్షి:**పండగలు, పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు ట్రైన్ టికెట్ల కోసం వేట మొదలవుతుంది. సుదీర్ఘ ప్రయాణం చేయాలనుకొనేవారు కొన్ని వారాల ముందే టికెట్లు బుక్ చేసుకుంటుంటారు.ఒక్కోసారి అనుకోని పరిస్థితుల కారణంగా ట్రిప్‌ను క్యాన్సిల్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. కాబట్టి టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఏ తరగతికి (ఏసీ, స్లీపర్) ఏ మేరకు ఛార్జీలు వర్తిస్తాయి? ఎంతమేర వాపసు పొందొచ్చో తెలుసుకుందాం.ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ నిబంధనల ప్రకారం తరగతి, రద్దు చేసే సమయాన్ని బట్టి క్యాన్సిలేషన్ ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటుంది. ఏసీ క్లాస్‌లపై టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీతో పాటు జీఎస్టీ కూడా వసూలు చేస్తారు. ఇండియన్ రైల్వే ఈ ఛార్జీలను ఎప్పటికప్పుడు మారుస్తుంటుంది. ప్రస్తుతం వసూలు చేస్తున్న ఛార్జీలు చూస్తే..

**కన్ఫార్మ్ టికెట్‌పై ఛార్జీలు**

ప్రయాణానికి 48 గంటల ముందు టికెట్ క్యాన్సిల్ చేస్తే ఒక్కో ప్రయాణికుడికి ఏసీ ఫస్ట్ క్లాస్/ఎగ్జిక్యూటివ్ క్లాస్ రూ.240 క్యాన్సిలేషన్ ఛార్జీ + జీఎస్టీ ఏసీ 2 టైర్/ఫస్ట్ క్లాస్‌లో రూ.200+ జీఎస్టీ ఏసీ 3 టైర్/ఏసీ ఛైర్ కార్/ ఏసీ 3 ఎకానమీ అయితే రూ.180+ జీఎస్టీ స్లీపర్ క్లాస్‌లో రూ.120, సెకండ్ క్లాస్‌లో రూ.60 చెల్లించాలి. ప్రయాణానికి 48 గంటల నుంచి 12 గంటల మధ్య అయితే మొత్తం ఛార్జీలో 25 శాతం వసూలు చేస్తారు. కనీస ఛార్జీకి లోబడి ఉంటుంది. ఏసీ క్లాసులపై అయితే జీఎస్టీ వసూలు చేస్తారు. రైలు ప్రయాణానికి 12 గంటల ముందు నుంచి 4 గంటల మధ్య రద్దు చేస్తే టికెట్ ధరలో 50 శాతం కోత విధిస్తారు. అన్ని ఏసీ తరగతులకు జీఎస్టీని జోడిస్తారు. ప్రయాణానికి 4 గంటల ముందు రద్దు చేస్తే ఒక్క రుపాయి కూడా వాపసు రాదు.

**వెయిటింగ్ లిస్ట్ టికెట్**


కన్ఫర్మేషన్ టికెట్‌తో పోలిస్తే వెయిట్‌లిస్ట్ టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీలు భిన్నంగా ఉంటాయి. ప్రయాణానికి 4 గంటల ముందు వెయిటింగ్ లిస్ట్‌లోని టికెట్‌ను క్యాన్సిల్ చేస్తే రూ.20+ జీఎస్టీ వసూలుచేస్తారు. మిగిలిన సొమ్మును ఖాతాలో జమ చేస్తారు. ఇక ఛార్ట్ కన్ఫార్మ్ అయ్యాక కూడా వెయిట్‌లిస్ట్‌లో పేర్లు ఉంటే టికెట్ ఆటోమేటిక్‌గా క్యాన్సిల్ అవుతుంది. కాబట్టి ఎలాంటి ఛార్జీలూ పడవు. పూర్తి సొమ్ము వాపసు పొందొచ్చు.

తత్కాల్ టికెట్

తత్కాల్‌లో టికెట్ కన్ఫార్మ్ అయిన తర్వాత క్యాన్సిల్ చేస్తే ఒక్క రూపాయి కూడా సొమ్ము వాపసు రాదు. ఒకవేళ తత్కాల్ వెయిట్‌లిస్ట్‌లో క్యాన్సిల్ చేస్తే సొమ్ములు వెనక్కి వస్తాయి. అయితే, క్లరికల్ ఫీజు, కన్వీనియెన్స్ ఫీజు, లావాదేవీ రుసుము వంటివి మినహాయించి మిగిలిన మొత్తం చెల్లిస్తారు.

# ధనవంతులుగా మారాలంటే..

## ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గొయెంకా టిప్స్



**జనంసాక్షి:**ఎంత డబ్బు సంపాదిస్తున్నాం అనే విషయం కంటే ఎంత మొత్తాన్ని ఖర్చు చేస్తున్నామనే విషయమే కీలకం అంటున్నారు ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా ఎప్పుడూ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనదైన శైలిలో నెటిజన్లతో ముచ్చటించే ఆయన.. తాజాగా 'ఎక్స్' వేదికగా కొన్ని ఆర్థిక సూత్రాలను పంచుకున్నారు. ఆర్థిక విజయాన్ని సాధించాలంటే వీటిని కచ్చితంగా అనుసరించాలన్నారు. ఆ టిప్స్ ఏంటంటే.. ఆదాయాన్ని సృష్టించే ఆస్తులు కూడగట్టుకోండి. సంపాదన కన్నా తక్కువ ఖర్చు చేయండి. ఆదాయాన్ని మాత్రమే కాదు.. సంపదను పెంచుకోవడంపై దృష్టి పెట్టండి. సంపదను పెంచుకోవడంపై దృష్టి పెట్టండి. ఆర్థిక అక్షరాస్యత పెంచుకోండి. సంపద సృష్టించే అవకాశాల కోసం అన్వేషించండి. డబ్బు కోసమే కాకుండా నేర్చుకొనేందుకు పని చేయండి. ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక క్రమశిక్షణ అనేది కీలక పాత్ర పోషిస్తుందని గోయెంకా అన్నారు. ధనవంతులు కావా లంటే ప్రతి ఒక్కరూ పై సూత్రాల్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. దీంతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీకి చెందిన ఓ వీడియోను పంచుకున్నారు. "దేన్నైనా సాధించాలనుకుంటే ఆ విషయంపైనే దృష్టి కేంద్రీకరించండి. దాన్ని సాధించేందుకు కలలు కనండి. ఎప్పుడూ దాని గురించే తెలుసుకొనేందుకు ప్రయత్నించండి. దాన్నే జీవితంగా మార్చుకోండి. మెదడు, శరీరం, నరాలు ఇలా మీ శరీరంలోని ప్రతి భాగాన్ని ఆ ఆలోచనతో నింపండి. అనవసర విషయాల్ని దరి చేరనీకండి. ఇదే విజయానికి మార్గం" అని వివేకానంద చెప్పిన సూత్రాన్ని అంబానీ గుర్తు చేస్తున్న వీడియో అది. ముకేశ్ అంబానీ సక్సెస్ సైకాలజీ ఇదే అంటూ క్యాప్షన్‌తో ఆ వీడియోను షేర్ చేశారు. ప్రస్తుతం గోయెంకా పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

## స్టార్‌లింక్ భారత్ ఎంట్రీ..

# మరింత కఠినం

### ఆ షరతులకు ఓకే అంటేనే..

**జనంసాక్షి:**శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో దేశీయ అగ్రగామి టెలికాం సంస్థలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.దీంతో మరికొద్ది రోజుల్లో భారత్‌లో స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీని ఎంట్రీకి కేంద్ర ప్రభుత్వం కొన్ని కఠిన షరతులు విధించినట్లు తాజా కథనాల సమాచారం. ఇక్కడ సేవలు అందించాలంటే దేశంలో కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని కేంద్రం స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది.సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థను కొనసాగించడం, నిలిపివేయడానికి వీలు ఉండాలా భారత్ తినిలోనే కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని కేంద్రం కండీషన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ సెంటర్ అందుబాటులో ఉంటే శాంతి భద్రతల సమస్య తలెత్తిన సమయంలో తక్షణమే చర్యలు తీసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. "శాంతిభద్రతలు చేయి దాటిపోయేలా ఉన్నప్పుడు అమెరికాలో ఉన్న స్టార్‌లింక్ ప్రధాన కార్యాలయం తలుపు కొట్టాల్సిన అసవరం లేకుండా స్వదేశంలోనే మేం నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు ఉండాలి" అని కేంద్ర వర్గాలు చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీంతోపాటు





విపత్తు నిర్వహణ, ప్రజాభద్రత వంటి అత్యవసర పరిస్థితుల్లో అధికారిక మార్గాల ద్వారా దర్యాప్తు ఏజెన్సీలు.. ఆయా టెలికాం సర్వీస్‌లను తాత్కాలికంగా తమ నియంత్రణలోకి తీసుకుని కాల్స్‌ను యాక్సెస్ చేసుకునేలా సెక్యూరిటీ అనుమతులు ఉండాలని కేంద్రం స్పష్టంచేసినట్లు తెలుస్తోంది. ఇందులో కొత్త నిబంధనేదీ లేదని, ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి నెట్‌వర్క్‌లు కూడా దీనికి కట్టుబడి ఉన్నాయని ప్రభుత్వం చెప్పింది.ఈ నిబంధనలపై స్టార్‌లింక్ కంపెనీ కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. వీటిపై త్వరలోనే తమ అభిప్రాయాన్ని చెబుతామని కంపెనీ తెలియజేసింది. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించడం కోసం అనుమతులు కోరుతూ ఇప్పటికే స్టార్‌లింక్ కేంద్ర ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. దీనికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి ఆమోదం రావాల్సిఉంది. మరోవైపు, ఈ సేవలను తమ యూజర్లకు అందుబాటులోకి తెచ్చేందుకు భారతీ ఎయిర్‌టెల్, జియో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాయి.



## బ్యాంకు ఉద్యోగుల

# సమ్మె సైరన్

**జనంసాక్షి:**బ్యాంకు ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్స్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని బ్యాంకు యూనియన్లు తెలిపాయి. దీంతో ప్రణాళిక ప్రకారం మార్చి 24- 25 తేదీల్లో యథావిధిగా సమ్మె జరుగుతుందని స్పష్టం చేశాయి. ఐబీఏతో జరిగిన సమావేశంలో అన్ని కేడర్లలో నియామకాలు, ఐదు రోజుల పని దినాలు వంటి సమస్యల్ని యూఎఫ్ బీయూ సభ్యులు లేవనెత్తారు. వీటిపై జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఈ సమస్యలపై ఎటువంటి పరిష్కారం లభించలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ అన్నారు. అందుకే ముందు ప్రకటించినట్లుగానే రెండు రోజుల పాటు సమ్మె ఉంటుందని తెలిపారు .ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టుల్ని భర్తీ చేయడం వంటి డిమాండ్లతో యూఎఫ్‌బీయూ తొలుత సమ్మెను ప్రకటించింది. ఉద్యోగుల పనితీరుపై సమీక్షలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలకు సంబంధించి ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కూడా ఈ యూనియన్లు కోరుతున్నాయి. ఇటు వంటి చర్యలు ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగిస్తాయని ఆరోపిస్తున్నాయి .యూఎఫ్‌బీయూలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వంటి ప్రధాన బ్యాంకు సంఘాలు ఉన్నాయి.




# అసలుకే ఎసరు..

## 'రూపీ' లోగో వివాదానికి తెరలేపిన కేంద్రం, డీఎంకే ప్రభుత్వాల మధ్య హిందీ గొడవ



**జనంసాక్షి:**కేంద్రం, తమిళనాడు డీఎంకే ప్రభుత్వాల మధ్య హిందీ గొడవ.. 'రూపీ' లోగో వివాదానికి దారితీసింది. ఆ రాష్ట్ర బడ్జెట్ లోగోలో ఇప్పటివరకు ఉన్న ₹ అనే లోగో స్థానంలో తమిళంలోని 'రూ' అనే తమిళ అక్షరాన్ని మార్చడమే ఇందుక్కారణం.అయితే, రూపాయిని సూచించే ఈ ₹ గుర్తును ఓ తమిళ వ్యక్తే రూపొందించాడన్న సంగతి తెలిసిందే. మూడు వేలకు పైగా వచ్చిన గుర్తులతో పోటీపడి ఇది విజయం సాధించింది. అయితే దీని ఎంపిక ప్రక్రియా ఓ వివాదం కావడం గమనార్హం.భారత రూపాయిని సూచించడానికి ఓ మంచి సంకేతం కావాలంటూ 2009 మార్చి 5న కేంద్ర ప్రభుత్వం ఓ పోటీని నిర్వహించింది. ఆ గుర్తు మన విలువలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని 2010 కేంద్ర బడ్జెట్ సందర్భంగా నాటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ తెలిపారు. ఈ పోటీకి దేశవ్యాప్తంగా 3,331 స్పందనలు వచ్చాయి. అన్ని గుర్తుల్లో నుంచి ఐదు సింబల్స్‌ను షార్ట్‌లిస్ట్ చేశారు. నందిత మెహ్రోత్రా, హితేశ్ పద్మశాలి, షిబిన్ కేకే, షారుఖ్ ఇరానీ, డి.ఉదయ్‌కుమార్ రూపొందించిన గుర్తులు ఈ జాబితాలో ఉన్నాయి. 2010 జూన్‌లో కేంద్ర మంత్రివర్గం సమావేశమై వీటిల్లో ఒకదాన్ని ఫైనల్ చేసింది. ఉదయ్‌కుమార్ రూపొందించిన గుర్తు విజేతగా నిలిచినట్లు అదే ఏడాది జులైలో ఆర్థికశాఖ ప్రకటించింది. ఈయన తమిళనాడుకు చెందిన డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు. దేవనాగరి లిపిలోని 'ర', లాటిన్ బాషలోని 'ఆర్' అక్షరాన్ని మిళితం చేసి ఈ సింబల్‌ను ఉదయ్‌కుమార్ రూపొందించారు. పైనున్న రెండు అడ్డగీతలు మన జాతీయ పతాకాన్ని, సమానత్వాన్ని సూచిస్తాయి. అంటే ఆర్థిక అసమానతలను తగ్గించాలనే ఉద్దేశంతో దీన్ని ఇలా తీర్చిదిద్దారు. 2010 నుంచి భారత ప్రభుత్వం ఈ గుర్తును అధికారికంగా వినియోగిస్తోంది. అప్పటినుంచి నాణేలు, కరెన్సీ నోట్లతో పాటు పోస్టల్ స్టాంప్‌లు, బ్యాంకు చెక్కులోనూ ఈ సింబల్ మనకు కన్పిస్తోంది. అయితే, దీని ఎంపిక అప్పట్లో వివాదాస్పదమైంది. రూపీ సింబల్ పోటీదారుల్లో ఒకరైన రాకేశ్‌కుమార్ అనే వ్యక్తి ఎంపిక ప్రక్రియను సవాల్ చేస్తూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోటీలో వివక్షపూరితంగా వ్యవహరించారని, లోపాలు, అసమానతలు ఉన్నాయని ఆరోపించారు. అయితే, వాటిని రుజువు చేసే ఆధారాలు లేకపోవడంతో ఆయన పిటిషన్‌ను హైకోర్టు సింగిల్ బెంచ్ కొట్టేసింది.అనంతరం ఈ వ్యవహారం డివిజన్ బెంచ్‌కు చేరగా.. న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై జాతీయసంస్థల చిహ్నాలు, లోగోలను రూపొందించడానికి నిర్వహించే ప్రజా పోటీల్లో అవకతవకలు జరగకుండా మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్రానికి చెందిన అన్ని మంత్రిత్వశాఖలను ఆదేశించింది. ఏకరీతి స్వభావంతో పోటీలు జరగాలని సూచించింది. అనంతరం 2013 ఏప్రిల్‌లో ఆర్థికశాఖ ఇందుకోసం మార్గదర్శకాలు జారీ చేసింది.

## పోక్సో కేసులో యడియూరప్పకు

# స్వల్ప ఊరట



**జనంసాక్షి:**మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఓ బాలికను లైంగికంగా వేధించిన కేసులో కర్ణాటక మా జీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు న్యాయస్థానం స్వల్ప ఊరట కల్పించింది. మార్చి 15న పోక్సో కేసు విచారణకు హాజరుకావాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇటీవల ఆయనను ఆదేశించింది. తాజాగా కర్ణాటక హైకోర్టు ఆ కేసుకు సంబంధించిన సమన్లను నిలిపి వేసింది. 17 ఏళ్ల బాలికపై యడియూరప్ప లైంగిక దా డికి పాల్పడినట్లు గతంలో ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఓ మోసం కేసులో సాయం చేయాలంటూ బాధితురాలు, ఆమె తల్లి గత ఏడాది ఫిబ్రవరి 2న యడి యూరప్పను కలిశారు. ఆ సమయంలో తన కుమార్తెను భాజపా నేత బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దా డికి పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై పోక్సో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను యడియూరప్ప కార్యాలయం ఖండించింది. ఫిర్యాదుదారు గతంలోనూ పలువురిపై ఇలాంటి ఆరోపణలు చేశారని పేర్కొంది.

# జాతీయం అంతర్జాతీయం

## ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

# కొండ అంచున ప్రయాణం


### ఒళ్లు గగుర్పొడిచే హిమాచల్ బస్సు ప్రయాణం

**జనంసాక్షి:**హిమాచల్ ప్రదేశ్ అనగానే ప్రకృతి అందాలు, అందమైన కొండలు, లోయలు గుర్తుకువస్తాయి. అయితే ఆ కొండలు మెలికలు తిరుగుతూ, లోయలకు దగ్గరగా ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో ప్రయాణం భయంకరంగా ఉంటుంది.ఈ దారిలో వాహనాలు నడిపించడం సాహసమనే చెప్పాలి. అయితే హిమాచల్‌ప్రదేశ్ ఆర్టీసీ బస్సులో తాను ప్రయాణించిన వీడియోను ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించామంటూ రాసుకొచ్చారు. హిమాచల్‌కు వెళ్లినవారు ఎప్పుడైనా అక్కడి ప్రజా రవాణా సదుపాయాలను వినియోగించుకున్నారా అంటూ ప్రశ్నించారు. ఆ వీడియోలో వారి ప్రయాణం వంపులు తిరిగిన కొండ అంచుల్లో భయంభయంగా సాగిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ వీడియోను చూసిన నెటిజన్లు అక్కడి డ్రైవర్ల ధైర్యాన్ని కొనియాడుతున్నారు.అంత క్లిష్ట పరిస్థితుల్లోనూ బస్సులను జాగ్రత్తగా నడుపుతూ.. ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న వారి పనితీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. నెటిజన్ స్పందిస్తూ.. ఇది చంబా అనే ప్రాంతం నుంచి పంగి అనే మరో ప్రాంతానికి వెళ్లే రహదారి అని పేర్కొన్నారు. "హిమాచల్‌లోని ప్రజలు కొండల అంచున కాదు.. తమ జీవితాల అంచున ప్రయాణం చేస్తారు" అని మరో నెటిజన్ తన అభిప్రాయం వ్యక్తంచేశారు.



## వలపు వల..

# పాక్‌కు మిలిటరీ రహస్యాలు లీక్



**జనంసాక్షి:**పాకిస్థాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తూ.. భారత రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.ఓ అమ్మాయి వలపు వలలో చిక్కిన అతడు.. భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీంద్ర కుమార్ ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పుర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది అతడికి నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న ఆమె.. ఆ విషయాన్ని దాచిపెట్టి రవీంద్రతో స్నేహం చేసింది. డబ్బుల ఆశ జూపి వలపు వల విసిరింది. అనంతరం అతడి నుంచి మిలిటరీ రహస్యాలను సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో ఆమె నంబరును సేవ్ చేసుకున్న రవీంద్ర.. వాట్సప్‌లో ఆమెకు అనేక కీలక పత్రాలు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోర్ఖా రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు నిర్వహించిన లాజిస్టిక్స్ డ్రోన్ పరీక్షలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి వాటిని ఆ మహిళకు పంపించినట్లు తెలిసింది. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.అంతేకాదు.. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని వారికి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడితో పాటు అతడి స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వాట్సప్ చాట్‌లను పరిశీలిస్తున్నారు.

## గ్రీన్‌కార్డ్ వచ్చినా అమెరికాలో

# శాశ్వత నివాసం లభించదు

### అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా గ్రీన్‌కార్డుదారులు అమెరికాలో నిరవధికంగా ఉండలేరని వ్యాఖ్యానించారు. ఇప్పటికే ట్రంప్ సర్కారు ఇమిగ్రేషన్ విధానాలపై చర్చ జరుగుతున్న వేళ వాన్స్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.ఓ మీడియా ఛానల్‌లో మాట్లాడుతూ "గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు. ఇది వాక్‌స్వేచ్ఛకు సంబంధించిన అంశం కాదు, జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. అమెరికా పౌరులుగా ఎవరిని మాలో విలీనం చేసుకోవాలో మేం నిర్ణయిస్తాం" అని పేర్కొన్నారు.అమెరికా చట్టాల ప్రకారం గ్రీన్‌కార్డ్ పొందిన వ్యక్తి నుంచి కొన్ని సందర్భాల్లో దానిని తిరిగి తీసుకోవచ్చు. నేరాలకు పాల్పడినా, సుదీర్ఘకాలం దేశంలో నివసించకపోయినా, వలస నిబంధనలు పాటించడంలో విఫలమైనా ఈ చర్య తీసుకోవచ్చు.ఇప్పటికే గ్రీన్‌కార్డుకు పోటీగా ట్రంప్ గోల్డ్‌కార్డ్ విధానం ప్రకటించారు. దీనికోసం సుదీర్ఘకాలంపాటు వేచి ఉండాల్సిన అవసరం లేదు. 5 మిలియన్ డాలర్లు చెల్లించి దీనిని కొనుగోలు చేసి.. ఈ కార్డును పొందొచ్చు. దీంతో అమెరికా పౌరసత్వం కూడా సాధించుకోవచ్చని ట్రంప్ సర్కారు చెబుతోంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపన్నులు, ఎగ్జిక్యూటివ్‌లను ఆకర్షించాలన్నది ట్రంప్ ప్లాన్." అని అన్నారు.

# ఈ కజ్జికాయలు చాలా హాట్‌గురూ..

### కేజీ రూ.50 వేలట..



**జనంసాక్షి:**దేశవ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేస్తున్నారు. హోలీ వేళ.. నోరు తీపి చేసుకునేందుకు ప క్కాగా స్వీట్ ఉండాల్సిందే..!ఈక్రమంలో మార్కెట్లో రకరకాల స్వీట్లు దర్శనమిస్తున్నాయి. ఇక, ఉత్తరప్రదేశ్‌లోని ఓ దుకాణదారు తయారుచేసిన కజ్జికాయలు నోరూరిస్తున్నాయి. కానీ, వాటి ధర చూసి కస్ట మర్లు అవాక్కవు తున్నారు. అవును మరి, ఆ కజ్జికాయల ధర కేజీ రూ.50 వేలట. ఎందుకు.. బంగారంతో ఏమైనా తయారుచేశారా? అంటే అవునని అంటున్నారు ఆ యజమాని..! 24 క్యారెట్ల పుత్తడితో చేసిన ఈ మిఠాయిలు అందర్నీ ఆకట్టుకుంటు న్నాయి.ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో హోలీ సందర్భంగా ఓ స్వీట్ షాపు వ్యాపారి 'బంగారు కజ్జికాయలు' తయారుచేసి అమ్మకానికి పెట్టారు. వీటి ధర కేజీ రూ.50 వేలు అని బోర్డు పెట్టారు. ఒక్క స్వీటు చాలనుకుంటే దానికి రూ.1300లు చెల్లించాలి. ఆ కజ్జికాయల పైన 24 క్యారెట్ల బం గారు పూత పూయడంతో పాటు అందులో ప్రత్యేకమైన డ్రైఫ్రూ ట్స్‌ను నింపినట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ మిఠాయిల ఫొ టోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు ఆశ్చర్య పోతున్నారు. ఇదిలాఉండగా.. లఖ్‌నవూలోని మరో స్వీట్ షాపు దేశంలోనే అతిపెద్ద కజ్జికాయను తయారుచేసి రికార్డు సృష్టించింది. ఆరు కేజీల బరువుతో 25 అంగుళాలు ఉన్న ఈ కజ్జికాయ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈవిషయాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. మునుపటి రికార్డులను ఈ కజ్జికాయ బద్దలు కొట్టిందని వెల్లడించారు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకున్న టీమ్‌ఇండియాకు అభినందనలు తెలుపుతూ ఈ మిఠాయిని మువ్వన్నెల రంగుల్లో ప్రత్యేకంగా తయారుచేశారు.

# హోలీ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి..





**సంబరాల్లో పాల్గొన్న పలు శాఖల అధికారులు,**

**సిబ్బంది, ఉద్యోగ సంఘాలు..**

**వరంగల్ ప్రతినిధి, మార్చి14 (జనంసాక్షి)**

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తన కుటుంబ సభ్యుల సమేతంగా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, పలు శాఖల జిల్లా అధికారులు, టి జి ఓ, టి ఎన్జి ఓస్, తదితర సంఘాలు, తోటి ఉద్యోగస్తులతో కలిసి శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలను ఉత్సాహంతో ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,గ్రేటర్ వరంగల్ నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఈ వి శ్రీనివాస్, నగర ప్రముఖులు, కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి హోలీ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సహజమైన రంగులను వినియోగించి నందుకు అభినందించారు. హోలీ పండుగ ఐక్యతకు చిహ్నమని, జాతీయ సమైఖ్యతాభావంతో దేశంలో జరుపుకునే సంబరాల్లో హోలీ ఒకటని అన్నారు. తాను మొదటిసారి వరంగల్ లో హోలీ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. హోలీ పర్వదినం అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో కలెక్టర్ కూతురు శ్రీయాన్షి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీయాన్షి అందరికి కుంకుమ తిలకం పెట్టి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేయడం వేడుకలకు మరింత రంగులద్దింది. కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా అధికారులు, టీజీవో, టి ఎన్ జి ఓ స్ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హోలీ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని, ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ పండుగను ఉల్లాసంగా జరుపుకున్నారు.

జెడ్పి సీఈఓ రామీ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, డిపిఆర్ ఓ ఆయూబ్ అలీ,

టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. జగన్ మోహన్ రావు, రాష్ట్ర కార్యదర్శి కిరణ్మయి, వరంగల్ జిల్లా అధ్యక్షులు రామ్ రెడ్డి, కార్యదర్శి ఫణి కుమార్, ఎన్జి ఓస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, హేమ నాయక్, సదానందం, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్రిబుల్ ఆర్ వరకు హైదరాబాద్ విస్తరణ

**హెచ్ఎండిఏ పరిధిలోకి మర్రిగూడ మండలం**

**భారీగా పెరుగన్న భూముల ధరలు**

**మర్రిగూడ, మార్చ్14( జనం సాక్షి)**

హెచ్ఎండిఏ పరిధిలోకి మర్రిగూడ మండలం, త్రిబుల్ ఆర్ వరకు హైదరాబాద్ ను విస్తరిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది, మర్రిగూడ మండలంలోని బట్లపల్లి, దామర భీమనపల్లి, ఇందుర్తి, కె.బిపల్లి, కొండూర్, లెంకలపల్లి, మర్రిగూడ, మేటిచందాపురం, సరంపేట, తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి,యరగండ్లపల్లి రెవిన్యూ గ్రామాలను హెచ్ఎండిఏ పరిధిలోకి తీసుకుంటూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది, మర్రిగూడ మండలానికి మహర్దశ పట్టనుంది, మండలంలో భూములకు భారీగా ధరలు పెరగనున్నట్లు తెలుస్తుంది, భారీగా పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా,

# పోలీస్ స్టేషన్ లో ముగిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి విచారణ



**మొయినాబాద్ జనం సాక్షి మార్చ్ 14**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఇటీవల కోడిపందాల కేసులో నేరస్తుడిగా విచారించిన టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం నాడు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో
ఉదయం 11.30 కి పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఎమ్మెల్సీని సుమారు నాలుగు గంటలకు పైగా విచారించిన పోలీసులు,శ్రీనివాస్ రెడ్డి:- ఫార్మ్ హౌస్ లీజ్ విషయం లో అడిగిన అన్ని వివరాలు చెప్పడం జరిగింది, అంతకు మించి ఏమి అడగలేదుమళ్ళీ ఎప్పుడు విచారణకు పిలిచిన హాజరవుతాను, ఫార్మ్ హౌస్ వ్యవహారాలు మా అల్లుడు చూస్తుంటాడు భూమి నాదే కానీ రమేష్ రెడ్డి అనే వ్యక్తికి లీజ్ కి ఇచ్చాము దానికి సంబంధించి అన్ని పేపర్స్ పోలీసు వారికి ఇవ్వడం జరిగిందిరాష్ట్రంలో ప్రస్తుత రాజకీయా పరిస్థితుల వల్లే ఈ కేసు నమోదు చేయడం జరిగింది

# మంచిర్యాల జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ నిరసన.

**మంచిర్యాల ప్రతినిధి మార్చి 14 జనంసాక్షి.**



మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వెంటనే సస్పెండ్ రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బిఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గాదే సత్యం గోవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ..అసెంబ్లీ నుండి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెండ్ చేయడం అంటే ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నమే చేయడమే అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతులు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసిన జగదీశ్ రెడ్డి ని సభ నుండి సస్పెండ్ చేయడాన్ని తప్పుపట్టారు. , వెంటనే సస్పెన్షన్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాదె సత్యం, గోగుల రవీందర్ రెడ్డి, ఎర్రం తిరుపతి,తోట తిరుపతి, పడాల రవీందర్, కర్ర శంకర్, గట్టయ్య, కార్ల తిరుపతి, వొడ్నాల రవీందర్, కందుల ప్రశాంత్, జాడి భానుచందర్, కాటంరాజు,అమృత రాజ్ మరియు నాయకులు, కార్యకర్తలు,బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో

## కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం అడ్డుకున్న పోలీసులు..

**ఏటూరునాగారం, మార్చి 14(జనంసాక్షి) :**



ఏటూరు నాగారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమాన్నిపోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ప్రజల తరఫున శాసనసభలో బీఆర్ఎస్ ఉంటే, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతో బీఆర్ఎస్ పార్టీ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్, కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా, రేవంత్ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మలుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో ఈరోజు ఏటూరు నాగారం మండల కేంద్రంలో గల తెలంగాణ తల్లి విగ్రహం ముందు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల బీఆర్ఎస్ పార్టీ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ బాబు, ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు, జాడి బోజారావు, వాళ్ల రామకృష్ణ, ఈసం రామ్మూర్తి, గండేపేల్లి నర్సయ్య, ఎండి వలిబాబా, వావిలాల పోషాలు, మెరుగు వెంకటేశ్వర్లు, వావిలాల ముత్తయ్య, దేపాక శ్రీరాములు,గార ఆనంద్, గార రమేష్, బాసాని శేఖర్, వావిలాల కిషోర్, బట్టు రమేష్, మాదరి రామయ్య, కొండాయి చిన్ని, వావిలాల ముత్తయ్య, రాంబాబు రామ్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంతా అబద్ధం.... మరి ఏది నిజం..





**మర్రిగూడ, మర్చి12( జనం సాక్షి)**

**10 లక్షల నష్టం కలిగించే కుట్ర...**
**రైతు ఆరోపణ**
**భూమి ఉన్నది 1 ఎకరం 7 గుంటలు,2ఎకరాలు ఒక గుంట అమ్మినట్లు పత్రం**
**అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న రియల్టర్....**
**రైతు ఆరోపణ**
**అప్పుల కోసమే భూమి అమ్మకం**

ఏది నిజం...10 లక్షల నష్టం కలిగించే కుట్ర... రైతు ఆరోపణ,నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన సిరికొండ మల్లమ్మ అధికారులను రియల్ ఎస్టేట్ వ్యాపారి తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు, మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 160/ ఆ1/1 లో 1ఎకరం 7గంటల భూమి ఉంది,ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సిరికొండ మల్లమ్మ భూమి అమ్మకానికి పెట్టగా అదే గ్రామానికి చెందిన నీలం మహేష్ అనే వ్యాపారస్తుడు భూమి అమ్మిస్తానని చెప్పి 50వేల రూపాయలు నగదు భయానాగా ఇచ్చాడని, తమతో ఖాళీ బాండ్ పేపర్ పై సంతకాలు చేయించుకొని తమ ఒరిజినల్ పాస్ బుక్ ని తీసుకున్నాడని, అట్టి భూమిని 94 లక్షల 50 వేలకు బేరం చేసుకున్నాడని, భూమి అమ్మే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటూ తమ భూమి అమ్మకుండా అడ్డుపడుతుండడంతో అదే గ్రామానికి చెందిన నీల శ్రీశైలంనికి 1 కోటి 5 లక్షలకు భూమి విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు, అయితే అదే కక్షతో నీల మహేష్ బాండ్ పేపర్లో 5 లక్షల రూపాయలు భయానక ఇచ్చానని 160 సర్వే నెంబర్ లో 2ఎకరాల 1గుంట భూమి అమ్మినట్లు అక్రమంగా రాసుకొని తప్పుగా అధికారులకు ఫిర్యాదు చేశారని అసలు ఆ సర్వే నెంబర్లు తనకు భూమి లేదని, సర్వే నెంబర్ 160/ ఆ1/1లో 1ఎకరం 7 గుంటల
భూమి మాత్రమే ఉందని తెలిపారు, తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు ఒడడంతో అప్పుల కోసమే భూమి అమ్మినట్లు తెలిపారు,రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని, 10 లక్షల రూపాయలు నష్టం కలిగించాలని నీల మహేష్ ప్రయత్నించాడని రైతు సిరికొండ మల్లమ్మ ఆరోపించారు,

# మహిళా సాధికారత సమాజ పురోగతికి మార్గదర్శి

మహిళా సాధికారత అనేది కేవలం ఒక పదం మాత్రమే కాదు, ఇది సమాజ అభివృద్ధికి కీలకమైన అంశం.
పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో స్వేచ్ఛగా ఎదిగే హక్కు కలిగి ఉండాలి. మహిళల సాధికారత అంటే కేవలం విద్య, ఉద్యోగం మాత్రమే కాకుండా, వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, కుటుంబ పరంగా స్వతంత్రంగా భావించే స్థితికి చేరుకోవడమే.
గత కొన్ని దశాబ్దాలుగా మహిళల హక్కులు, అవకాశాలు పెరిగినప్పటికీ, ఇంకా సమాజంలో లింగ వివక్ష, అసమానత్వం, గృహ హింస, వేధింపులు వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. మహిళా సాధికారత నిజంగా అమలులోకి రావాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.
మహిళా సాధికారత యొక్క ప్రాముఖ్యత

1. విద్య %-% మహిళల భవిష్యత్తుకు పునాది

విద్య ప్రతి ఒక్కరి హక్కు. పురుషులతో సమానంగా మహిళలకు కూడా మంచి విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఒక మహిళ చదువుకుంటే, ఆమె కేవలం తన జీవితాన్ని మాత్రమే కాదు, తన కుటుంబాన్ని, సమాజాన్ని కూడా అభివృద్ధి పరచగలదు.
మహిళలు చదువుకునే హక్కును రక్షించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఉదాహరణకు, "బేటీ బచావో – బేటీ పడావో" వంటి కార్యక్రమాలు బాలికల విద్యను ప్రోత్సహిస్తున్నాయి.
చదువుకున్న మహిళలు స్వతంత్రంగా ఆర్థికంగా ఎదగగలరు.
అక్షరాస్యత మహిళల్లో అవగాహన పెంచి, వారి హక్కుల గురించి తెలియజేస్తుంది.
కానీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా మహిళల విద్యపై తక్కువ ప్రాధాన్యత ఉంది. బాల్య వివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, సంప్రదాయ పరమైన పరిమితులు ఇంకా ఉన్నాయంటే మహిళా సాధికారత ఇంకా సవాలుతోనే ఉందని అర్థం.

2. ఆర్థిక స్వతంత్రత మహిళా సాధికారతకు మరో కీలకం

స్వతంత్రంగా ఆర్థికంగా ఎదగడం మహిళలకు నిజమైన శక్తినిస్తుంది. ఒక మహిళ తన సొంత డబ్బు సంపాదిస్తే, కుటుంబంలో ఆమె ప్రాధాన్యత పెరుగుతుంది. అలాగే, కుటుంబ నిర్ణయాల్లో ఆమె పాత్ర పెరుగుతుంది.

**ఉద్యోగ రంగంలో మహిళలు**

గతంలో కంటే మహిళలు ఉద్యోగాల్లో పెరుగుతున్నారు.
ఐటీ, వైద్యం, బ్యాంకింగ్, వ్యాపారం వంటి రంగాల్లో మహిళలు సమానంగా పోటీ చేస్తున్నారు.
ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా, వారు ఎక్కువగా ఉద్యోగంలో చేరుతున్నారు.
వ్యాపార రంగంలో మహిళలు
అనేక మంది మహిళలు తమ స్వంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు.
స్వయం సహాయ సంఘాలు, ముడిసరుకు తయారీ, హస్తకళలు, ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తూ మహిళలు మంచి ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. మహిళలు వ్యవసాయ రంగంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. స్వయం సహాయ సంఘాలు (Self Help Groups - SHGs)
గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కలసికట్టుగా స్వయం సహాయ సంఘాల ద్వారా పొదుపు అలవాటు చేసుకుంటున్నారు.
ప్రభుత్వం అందించే చిన్న మొత్తపు రుణాలు, ఉపాధి అవకాశాలను ఉపయోగించుకుంటూ తమ ఆర్థిక స్థాయిని మెరుగుపరు చుకుంటున్నారు.
ఇవి అన్ని మహిళలకు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగే మార్గాన్ని చూపుతున్నాయి.

3. సామాజిక హక్కులు , లింగ సమానత్వం

మహిళలకు సమాజంలో సమాన హక్కులు ఉండాలి. కానీ, ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో లింగ వివక్ష ఉంది.

**లింగ వివక్ష (Gender Discrimination)**

చిన్నతనం నుంచే అమ్మాయిలు, అబ్బాయిల మధ్య తేడా చూపించడం ప్రారంభమవుతుంది.
కొందరు బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వరు, అయితే అబ్బాయిలను చదివిస్తారు.
మహిళలు బయట పని చేయడం తప్పు అనే అపోహ ఇంకా కొనసాగుతోంది.
ఉద్యోగాల్లో పురుషులకు ఎక్కువ అవకాశాలు ఇవ్వడం జరుగుతోంది.

గృహ హింస , మహిళల భద్రత
అనేక మంది మహిళలు తమ ఇంట్లోనే గృహ హింసను ఎదుర్కొంటున్నారు.
పౌరసత్వ హక్కుల కోసం మహిళలు పోరాడాల్సిన పరిస్థితి ఉంది.
నేటి సమాజంలో సైతం వేధింపులు, వేధించే దాడులు ఎక్కువగా ఉన్నాయి.
ఈ సమస్యలను పరిష్కరించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలి. "దిశ చట్టం," "భారతీయ శిక్షాస్మృతి (IPC) లోని సెక్షన్ 498A" వంటి చట్టాలు మహిళలను రక్షించేందుకు ఉద్దేశించబడ్డాయి.

4. రాజకీయ రంగంలో మహిళల పాత్ర

మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థిక స్వతంత్రత మాత్రమే కాదు, వారు తమ స్వంత నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవడమూ అవసరం.

**మహిళా రిజర్వేషన్ బిల్లు**

రాజ్యసభ, లోకసభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.
ప్రస్తుతం, పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళలకు 50% రిజర్వేషన్ ఉంది.
అనేక గ్రామాల్లో సర్పంచ్, కౌన్సిలర్, మేయర్ స్థాయిలో మహిళలు నాయకత్వం వహిస్తున్నారు.

**ప్రభుత్వ విధానాలు , పథకాలు**

ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు అందించడం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం.
జన్ ధన్ యోజన మహిళలు బ్యాంక్ ఖాతాలు తెరిచి, పొదుపు అలవాటు చేసుకోవడానికి అవకాశం. ముద్రా యోజన మహిళా వ్యాపారులకు రుణాలు అందించేందుకు రూపొందించిన పథకం.



**చకీలం సునీష**
**సిద్దిపేట**

కెఎల్ రాహుల్

# అతను భారత జట్టులో గొప్ప ఆటగాడు

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారతదేశం విజయం అందరికీ తెలిసిందే, వారు సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను మరియు ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించారు. ఈ విజయానికి ప్రతి ఆటగాడు గణనీయంగా దోహదపడ్డాడు, కానీ కెఎల్ రాహుల్ తన కొత్త పాత్రలో ప్రత్యేకంగా రాణించాడు. పరిచయం లేని ఆరో స్థానంలో అడుగుపెట్టి, అతను కీలకమైన పరుగులు సాధించాడు మరియు వికెట్ కీపర్‌గా అద్భుతంగా రాణించాడు. ఈ నేపథ్యంలో, గాయం కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్, రాహుల్‌ను "మిస్టర్ ఫిక్స్" అని అభివర్ణిస్తూ ఆయనను ప్రశంసించాడు. స్టార్క్ ఇలా వివరించాడు, "ఈ మారుపేరుకు చాలా కారణాలు ఉన్నాయి. అతను బ్యాటింగ్ ప్రారంభిస్తాడు మరియు అవసరమైతే, అతను మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగలడు. అతను వికెట్లు కీపింగ్ చేస్తాడు మరియు ఇతర స్థానాల్లో కూడా ఫీల్డింగ్ చేయడానికి సిద్ధంగా ఉంటాడు. అతను తన బహుముఖ ప్రజ్ఞకు అన్ని ప్రశంసలకు నిజంగా అర్హుడు. అతను ప్రతి పాత్రను పోషించాడు, మరియు నేను అతనితో కలిసి నటించడానికి ఎదురు చూస్తున్నాను."






"దుబాయ్ అడ్వాంటేజ్" అనే భావన గురించి స్టార్క్, భారతదేశం విజయం కేవలం మ్యాచ్‌ల స్థానం వల్లనే అనే ఆలోచనను తోసిపుచ్చాడు. "దుబాయ్‌లో ఆడటం ఒక ప్రయోజనమని నేను ఖచ్చితంగా చెప్పలేను" అని అతను చెప్పాడు. నేడు ఆటగాళ్ళు ప్రపంచవ్యాప్తంగా వివిధ ఫ్రాంచైజ్ మ్యాచ్‌లలో పాల్గొంటారు. అయితే, భారత ఆటగాళ్ళు ప్రధానంగా ఐపీఎల్‌లో ఆడతారు, ఇది ఏడాది పొడవునా బహుళ లీగ్‌లలో పోటీపడే వారితో పోలిస్తే విదేశీ పిచ్‌లపై వారి అవగాహనను పరిమితం చేయవచ్చు. భారతదేశం విజయం నన్ను ఆశ్చర్యపరచలేదుబీ నిజం చెప్పాలంటే, నేను వాళ్ళ మ్యాచ్‌లను నిశితంగా అనుసరించలేదు, అప్పుడప్పుడు మాత్రమే మా జట్టు ఆటలను క్యాచ్ చేస్తాను. గత సంవత్సరం, నేను అద్భుతమైన ప్రతిభ కలిగిన వరుణ్ చక్రవర్తితో కలిసి ఆడాను" అని స్టార్క్ వ్యాఖ్యానించాడు.

**భారత్.. ఒకేరోజు మూడు ఫార్మాట్లలో ఆడగలదు**

సిడ్నీ: భారత క్రికెట్‌లో అద్భుత ఆటగాళ్లకు కొదవ లేదని ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ కొనియాడాడు. 'ఒకే రోజు ఆసీసతో టెస్టును, ఇంగ్లండ్‌తో వన్డేను, దక్షిణాఫ్రికాతో టీ20 ఆడి పోటీనివ్వగల సత్తా భారత జట్టుకు ఉంది. ప్రపంచంలో మరే జట్టుకూ ఈ అవకాశంలేదు ఐపీఎల్ ద్వారా వారికి నైపుణ్యం కలిగిన క్రికెటర్లు లభిస్తున్నారు. అందుకే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. కానీ దుబాయ్‌లో వారికి లబ్ధి చేకూరిందని చెప్పలేం. ఎందుకంటే భారత్ మినహా ఇతర దేశాల ఆటగాళ్లు ప్రపంచంలోని అన్ని వేదికల్లో జరిగే లీగ్‌ల్లో ఆడతారు. కానీ భారత ప్లేయర్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కనిపిస్తారు' అని స్టార్క్ తేల్చాడు.

# నా స్టైల్ వేరు: డ్వేన్ బ్రావో

: డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్కతా నైటైడర్స్ ఐపీఎల్ 18వ సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఇప్పటికే సారథిగా అజింక్య రహానెను ప్రకటించిన సంగతి తెలిసిందే. గతేడాది గౌతమ్ గంభీర్ మెంటార్గా వ్యవహరించాడు. అతడు భారత జట్టు ప్రధాన కోచ్గా రావడంతో.. డ్వేన్ బ్రావోను మెంటార్గా నియమిస్తూ కేకేఆర్ నిర్ణయం తీసుకుంది. మెంటార్గా బ్రావో బాధ్యతలను స్వీకరించాడు. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న కొత్త సీజన్కు సంబంధించి సన్నాహకంపై బ్రావో స్పందించాడు. 'వివిధ కారణాల వల్ల మేం కొంతమందిని మిస్ అయ్యాం. జట్టుతో వ్యవహరించిన తీరు ఒక్కొక్కరికీ విభిన్నంగా ఉంటుంది. గౌతమ్ గంభీర్ స్టైల్ వేరు. నాకంటూ ఒక శైలి ఉంది. ఆ మార్గంలో ఇద్దరం సక్సెస్ అయ్యామని భావిస్తున్నా. పలుమార్లు గంభీర కు మెసేజ్ చేశా. చాలా టిప్స్ అడిగా. కేకేఆర్ దగ్గరే అద్భుతమైన సక్సెస్ ఫార్ములా ఉంది. వాటిపైనే ఎక్కువగా ఆధారపడి పనిచేస్తా. గత సీజన్లో గంభీర్ మార్గదర్శకంలో కేకేఆర్ ఆడింది. ఆ సీజన్కు సంబంధించి మంచి విషయాలను తీసుకోవాలి" అని బ్రావో తెలిపాడు.



**రహానేకి కెప్టెన్సీ ఇవ్వడానికి కారణమదే : వెంకీ మైసూర్**

భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్ను కాదని వెటరన్ ప్లేయర్ అజింక్య రహానెకు కెప్టెన్సీ ఇవ్వడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దానిపై ఇప్పటికే సమాధానం ఇచ్చిన కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ మరోసారి స్పష్టత ఇచ్చారు. "ఇతర లీగ్‌లతో పోలిస్తే ఐపీఎల్ విభిన్నమైన టోర్నమెంట్. ఇక్కడ ప్రతి అంశంపై మేం ఆలోచించే నిర్ణయం తీసుకుంటాం. వెంకటేశ్ అయ్యర్ విషయంలో కూడా అలానే ఉంటాం. కుర్రాడికి కెప్టెన్సీ అప్పగిస్తే ఎలా ఉంటుందనేది పరిశీలించాం. అయితే, సారథ్యమంటే చాలా సవాళ్లతో కూడుకున్నది. జట్టును ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుభవం కూడా కీలకమే. అజింక్య రహానె మంచి ఎంపిక అవుతుందని భావిస్తున్నాం. ఇదేమీ ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదు. అతడికి ఎంతో అనుభవం ఉంది. అంతర్జాతీయంగానూ కెప్టెన్సీ చేశాడు. 185 ఐపీఎల్ మ్యాచ్లు ఆడాడు. దేశవాళీలో ముంబయిని నడిపించాడు. రహానె నాయకత్వంలో వెంకటేశ్ అయ్యర్ తప్పకుండా మంచి లీడర్ గా ఎదుగుతాడని భావిస్తున్నాం" అని తెలిపారు.

# ఐపీఎల్‌యే కాదు.. భారత్ టెస్టులు ఆడండి



2025 ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారతదేశం విజయం సాధించిన తర్వాత, ఆటగాళ్ళు అంతర్జాతీయ క్రికెట్ నుండి గణనీయమైన విరామం తీసుకుంటున్నారు, తదుపరి సవాలు జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్. ఈ మధ్యంతర కాలంలో, ఆటగాళ్ళు ఐపిఎల్‌తో బిజీగా ఉంటారు, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సిద్ధు భారత జట్టు సన్నాహాలకు సంబంధించి కీలకమైన అంతర్దృష్టులను అందించడానికి నాయకత్వం వహిస్తారు.

ఇటీవలి టెస్ట్ సిరీస్‌లలో భారతదేశం ఎదుర్కొన్న ఇబ్బందు లను సిద్ధూ హైలైట్ చేశాడు, టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడవ సీజన్‌లో జట్టు ఫైనల్స్‌కు చేరుకోలేకపోయిందని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో జరగబోయే సిరీస్ వల్ల ఎదురయ్యే సవాళ్లను ఆయన నొక్కి చెప్పారు. "ఐపీఎల్ త్వరలో ప్రారంభం కానుంది, ఎవరూ దీనిలో ఆడటం మిస్ అవ్వకపోయినా, ఈ మెగా లీగ్ తర్వాత, భారతదేశం ఇంగ్లాండ్‌తో కీలకమైన టెస్ట్ సిరీస్‌ను ఎదుర్కోనుంది. ఐపీఎల్ నుంచి టెస్ట్ ఫార్మాట్ కు మారడం అంటే ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి మారినట్లే అవుతుంది" అని సిద్ధూ అన్నారు. సాంప్రదాయకంగా ఆగస్టులో ప్రారంభమయ్యే సిరీస్‌కు భిన్నంగా జూన్‌లో ప్రారంభమయ్యే ఈ సిరీస్ యొక్క ప్రత్యేకమైన సమయాన్ని ఆయన ఎత్తి చూపారు. "ఈసారి, సిరీస్ దాదాపు నెలన్నర ముందుగానే ప్రారంభమవు తుంది, అంటే పిచ్‌లలో గడ్డి ఉంటుంది. ఈ కాలంలో బంతి గణనీయంగా కదిలే బలమైన అవకాశం ఉంది," అని ఆయన అన్నారు.

**ప్రత్యామ్నాయం ఎవరు?**

ఇటీవలి పరాజయాల తర్వాత ఇంగ్లాండ్‌ను "గాయపడిన పులులు"గా అభివర్ణిస్తూ, సిద్ధూ ఇంగ్లాండ్ సంసిద్ధత గురించి ఆందోళన వ్యక్తం చేశాడు. వారు భారతదేశానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడతారని ఆయన హెచ్చరించారు. సిద్ధు ప్రకార ం, టీం ఇండియాకు ఒక ప్రధాన సమస్య మిడిల్ ఆర్డర్ యొ క్క ఆల్ రౌండర్ ఎంపికలు. రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ అందుబాటులో ఉన్నప్పటికీ, జడేజా మాత్రమే కొంతవరకు ఫిట్‌గా ఉన్నాడని, అయినప్పటికీ, అతను నిలకడగా నాలుగు లేదా ఐదు వికెట్లు తీయలేదని ఆయన పేర్కొన్నారు.

పేస్ పరంగా, జస్‌ప్రీత్ బుమ్రాపై ఆధారపడటం గురించి సిద్ధూ ప్రస్తావించాడు, షమీ మరియు అర్ష్‌దీప్ కూడా ఈ విభాగంలో ఉన్నారు. ఇంగ్లాండ్ బలహీనతలను ఉపయోగించుకోవడానికి భారతదేశం ఒక మిస్టరీ స్పిన్నర్‌ను చేర్చుకోవడాన్ని పరిగణించాలని, వరుణ్ చక్రవర్తిని సుదీర్ఘ ఫార్మాట్‌లో ఉపయోగించుకోకపోవడంతో బదులుగా కుల్దీప్ యాదవ్‌ను ఆచరణీయమైన ఎంపికగా సిఫార్సు చేయాలని ఆయన సూచించారు.

బ్యాటింగ్‌లో తమ వంతు పాత్ర పోషించగల సమర్థులైన ఆల్ రౌండర్లు లేకపోవడం వల్ల భారతదేశం తమ బ్యాటింగ్ ఆర్డర్‌ను బలోపేతం చేసుకునే సామర్థ్యం దెబ్బతింటుందని సిద్ధూ తన ప్రసంగాన్ని ముగించారు. ఇంగ్లాండ్‌తో జరగబోయే సిరీస్‌కు భారతదేశం సిద్ధమవుతున్న తరుణంలో ఈ సవాళ్లను పరిష్కరించాల్సి ఉంటుంది.

# ముంబయి జట్టులోకి బుమ్రా?



గవాస్కర్ ట్రోఫీ సమయంలో గాయపడిన జస్‌ప్రీత్ బుమ్రా ఆరోగ్యం ఇంకా కోలుకోలేదు. దీంతో ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్,ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనలేదు, దీంతో రాబోయే ఐపిఎల్ 2025 సీజన్‌కు అతడు ఆడడంపై సంధిగ్దత నెలకొంది. కొందరు అతను తిరిగి వస్తాడని, మరికొందరు అతను లీగ్‌లో అస్సలు ఆడకపోవచ్చని అభిప్రాయపడుతన్నారు. ఈ ఐపీఎల్ తర్వాత, టెస్ట్ ఛాంపియన్‌షిప్ నాల్గవ సీజన్, టీమ్ ఇండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. బుమ్రా పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోతే, అతని ఆరోగ్యం, అంతర్జాతీయ మ్యాచ్‌ల భవిష్యత్తు ప్రశ్నర్థాకంగా మారింది.

అయితే, ముంబై ఇండియన్స్ అభిమానులకు అతనిపై ఆశలు పెట్టుకున్నారు.. ఏప్రిల్ మొదటి లేదా రెండవ వారంలో బుమ్రా ముంబై జట్టులో చేరే అవకాశం ఉందని ఒక స్పోర్ట్స్ ఛానల్ ఇలా పేర్కొంది, "అతను ఇప్పుడు ఎన్ని మ్యాచ్‌లను కోల్పోతాడో మేము చెప్పలేము, కానీ అతను ఖచ్చితంగా జట్టులో చేరే అవకాశం ఉంది. ఖచ్చితమైన తేదీ ఇంకా తెలియదు, ఎందుకంటే అతనికి బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మెడికల్ టీం నుండి అనుమతి ఇంకా రాలేదన్నారు."ముంబై ఇండియన్స్ మార్చి 23న తమ తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది, ఆ తర్వాత మార్చి 29న అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో తలపడనుంది. ఏప్రిల్ మొదటి వారం తర్వాత బుమ్రా తిరిగి వస్తే, ముంబైకి లీగ్‌లో ఇంకా ఐదు మ్యాచ్‌లు మిగిలి ఉంటాయి. ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే, ఆ మ్యాచ్‌లలో కనీసం మూడు విజయాలు సాధించాలి.

## నా జట్టుకు రోహితే కెప్టెన్..: పాక్ మాజీ క్రికెటర్


: ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా విజేతగా నిలిచింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ జట్టును గెలిపించాడు. అయితే, ఐసీసీ తోపాటు ఇతర మాజీలు ప్రకటించిన జట్టులో అతడికి చోటు ఇవ్వలేదు. కానీ, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ మాత్రం తన జట్టుకు సారథిగా రోహిత్‌నే ఎంపిక చేస్తానని వెల్లడించాడు. ఆమేరకు బసిత్ ప్రకటించిన టీమ్లో భారత్ నుంచి ఏకంగా ఆరుగురికి అవకాశం ఇవ్వడం గమనార్హం. "నేను కూడా 11 మందితో కూడిన జట్టును ఎంపిక చేశా. దుబాయ్ వేదికగా మ్యాచ్లను చూశాం. గడాఫీ స్టేడియంలోనూ మంచి ప్రదర్శనలు ఇచ్చారు. నేను ఏ ఆటగాడు బాగా ఆడాడని భావించానో వారితోనే తుది జట్టును ప్రకటిస్తున్నా. ఐసీసీ జట్టును సరిపోల్చడం లేదు. నా టీమ్ కెప్టెన్గా రోహిత్ ఉంటాడు. టోర్నీ ఆసాంతం సారథిగా అద్భుతంగా రాణించాడు. ఫైనల్లో అర్ధశతకం సాధించాడు. మ్యాచ్ గతినే మార్చేశాడు. రోహిత్కు జోడీ ఓపెనర్గా రచిన్ రవీంద్రను ఎంపిక చేశా.

అతడు రెండు సెంచరీలు చేశాడు. ఇక వన్డేన్లో విరాట్ కోహ్లినే ఆడాలి. మ్యాచ్ పరిస్థితిని అంచనా వేసి రాణించడం అతడికి అలవాటు. శ్రేయస్ అయ్యర్ను నాలుగో స్థానంలో ఆడిస్తా. భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. సెమీస్, ఫైనల్లో విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కేఎల్ రాహుల్, ఆరో స్థానంలో గ్లెన్ ఫిలిప్స్ ఆడతారు. అతడు అద్భుతమైన బౌలరే కాకుండా.. ప్రమాదకరమైన ఫీల్డర్ కూడా. అజ్మతుల్లా ఒమర్జాయ్ను ఏడో స్థానంలో ఆడిస్తా. ఆల్రౌండర్ పాత్రకు సరిగ్గా సరిపోతాడు" అని వెల్లడించాడు.

## కోహ్లి హెయిర్ స్టైల్ ఆదుర్స్

**ఐపీఎల్ 2025 సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుండటంతో, అభిమానులు టోర్నమెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆటగాళ్ళు ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆర్‌సిబి ఆటగాడు విరాట్ కోహ్లి తన ఆటపైనే కాకుండా తన స్టైల్‌పై కూడా ఫోకస్ పెట్టాడు. ప్రఖ్యాత స్టైలిస్ట్ హాలీమ్ హకీమ్ చేత కొత్త హెయిర్ స్టైల్‌ను చెయించుకున్నాడు. హకీమ్ సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేసిన తర్వాత వైరల్ అయిన ఈ కొత్త లుక్ తో కోహ్లి చాలా అద్భుతంగా కనిపిస్తున్నాడు. అభిమానులు కోహ్లిని ప్రశంసిస్తూ, ఆప్యాయంగా "కింగ్ కోహ్లి" అని సంబోధిస్తూ తమ ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.**





## హైదరాబాద్ మెట్రోపాలిటన్‌లో కలవనున్న గ్రామాలు ఇవే

**జిల్లేడు గ్రామం వరకు మెట్రోపాలిటన్ పరిధి!**

**జిల్లేడ్ చౌదరిగుడా /జనంసాక్షి:**
ఇటీవల ప్రభుత్వం కొన్ని గ్రామాలను మెట్రో పాలిటీలో కలిపేటట్లు జీవో జారీ చేసింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగుడా మండల పరిధిలో 5 గ్రామాలు హైదరాబాద్ మెట్రోపాలిటీలో కలవనున్నాయి. గుర్రంపల్లి, ఇంద్రనగర్, జిల్లేడు, తూంపల్లి, తుమ్మలపల్లి, గ్రామాలు కలుస్తున్నట్లు అధికారు లు పేర్కొంటున్నారు, ఈ మండల పరిధిలో 24 గ్రామాలు ఉండగా ఐదు మాత్రమే కలుస్తున్నా యి. రాబోయే ఎన్నికలు మెట్రోపాలిటన్ పరిధిలో జరుగుతాయని నాయకుల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. వీళ్లంతా కార్పొరేటర్లుగా బరిలో దిగుతునట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.





# తలనీలాల తరలింపులో మతులబు ఏమిటో..?

## రూ 9.54 కోట్లు బాకీ ఉన్న కాంట్రాక్టర్..

**చెక్ బౌన్స్ కావడంతో కేసు నమోదు...**

**రూ 2.5 కోట్లు చెల్లిస్తే రూ.5 కోట్ల విలువైన తలనీలాలు అప్పగింత...**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 14 (జనంసాక్షి) :**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. తలనీలాలు పోగు చేసుకునేందుకు రెండేళ్లకోసారి ఆలయ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తుంటారు. గత రెండేళ్ల కాలానికి ఆంధ్రప్రదేశ్లోని హిందూపురానికి చెందిన సుమిత్ ఎంటర్ప్రైజెస్ తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కులు దక్కించుకున్నారు . టెండర్ హక్కులు దక్కించుకున్నటువంటి గుత్తేదారు ప్రతినెల రూ 79.17 లక్షలు ఆలయానికి చెల్లించాల్సి ఉంది. అయితే 2024 ఏప్రిల్ నుంచి గుత్తేదారు ఇచ్చినటువంటి చెక్కులు బౌన్స్ అవుతున్న క్రమంలో ఆలయ అధికారులు గుత్తేదారుపై చెక్ బౌన్స్ కేసు వేయగా కేసు నమోదు అయింది. తలనీలాలను ఆలయ అధికారులే భద్రపరిచి ఆరబెడుతున్నారు. తలనీలాలు తరలించుకునేందుకు గుత్తేదారు రాష్ట్రస్థాయిలో పైరవులు చేస్తున్నట్లు గతంలోనే ఆరోపణలు వచ్చాయి. తలనీలాలు తరలించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి అధికార నుంచి ఉత్తర్వులను కాంట్రాక్టర్ పొందారు. ఆలయానికి బాకీ ఉన్న రూ 9.54 కోట్లలో రూ 2.5 కోట్లు చెల్లించాలని అందుకుగాను డిసెంబర్ నాటికి భద్రపరిచిన తలనీలాలు అప్పగించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. రూ ఏడు కోట్ల వరకు బాకి ఉండగా సదరు కాంట్రాక్టర్ పాత పద్ధతిలోనే పోస్టెయిడ్ చెక్కులను అందజేశారు. మార్చి 28 నాటికి ఒక కోటి ఏప్రిల్ 10న రూ ఒక కోటి 11న రూ కోటిన్నర చెల్లించే విధంగా మూడున్నర కోట్లకు చెక్కులు ఇచ్చారు. మిగిలిన మూడున్నర కోట్లకు కాంట్రాక్టర్ గడువు ముగిసిన తర్వాత జూన్ నుంచి డిసెంబర్ నాటికి ప్రతినెలా చెల్లించే విధంగా చెక్కులను అందించారు. గడువు ముగిసిన అనంతరం కాంట్రాక్టర్కు తలనీలాలు తరలించకు పోయే విధంగా వెసులుబాటు కల్పించడం వెనక పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా 133 సంచుల్లో నిలువ ఉంచిన ఐదు కోట్ల విలువైన తలనిలాలను రెండు రోజుల క్రితం ఆలయ అధికారులు కాంట్రాక్టర్కు అప్పగించారు. ఈ విషయమే ఆలయ ఈవో వినోద్ రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గుత్తేదారుకు తరలించుకోవడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. తలనీలాలు చాలా రోజుగా నిల్వ ఉన్నందున పాడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నామని ఆదాయానికి ఎక్కడా కూడా నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



# హెూలీ వేడుకల్లో మత్తు దందా

**గంజాయి కుల్ఫీ, ఐస్క్రీమ్..**

**హైదరాబాద్, మార్చి 14 (జనంసాక్షి):** హెూలీ వేడుకల్లో గంజాయితో తయారు చేసిన కుల్ఫీ, ఐస్క్రీమ్తో పాటు గంజాయి బాల్స్ విక్రయిస్తున్న ముఠాను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ మహానగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు విభిన్న రీతుల్లో హెూలీ సంబరాలు చేసుకుంటారు. లోయర్ దూల్పేట్లోని మల్చిపురాలో కుల్ఫీ, ఐస్క్రీమ్, బర్ఫీ స్వీటులో, సిల్వర్ కోటెడ్ బాల్స్ లో గంజాయి వినియోగిస్తూ సంబరాలు జరపుకొన్నారు.

సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. 100 కుల్ఫీ, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్ను స్వాధీనం చేసుకున్నారు. కుల్ఫీ, ఐస్ క్రీమ్ విక్రయించే సత్యనారాయణ సింగ్.. గంజాయితో వీటిని తయారులు చేసినట్టు పోలీసులు గుర్తించారు. గంజాయి బర్ఫీ, చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

# పంచశీలలో హెూలీ సంబరం

**ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్**

**అల్వాల్, మార్చి 14 (జనంసాక్షి):** పంచశీల కాలనీలో హెూలీ సంబరాలు వైభవంగా నిర్వహించారు. డీజే పాటల మధ్య సహజ సిద్ధమైన రంగులతో, రెయిన్ డ్యాన్స్‌లతో ప్రజలను అలరించారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఆటపాటలతో హెూలీని ఘనంగా జరుపుకున్నారు. హెూలీ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మె ల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మహిళలతో కలిసి డ్యాన్స్‌లో పాల్గొని సందడి చేశారు. అలాగే మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరై ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు. విభిన్న సంస్కృతులను కలిగి ఉన్నవారంతా సంప్రదా యాన్ని అనుసరిస్తూ హెూలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాజేష్ అగర్వాల్, భరత్ రెడ్డి, రవి, బసవరాజ్, విజయవర్ధన్ రెడ్డి, చారి, శ్రీకాంత్, నరేష్ మిట్టల్, కరిందర్ సింగ్, మాణిక్య రెడ్డి, మహిపాల్ రెడ్డి, బి ఎల్ ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన హరీష్‌రావు

**వరంగల్, మార్చి 14 (జనంసాక్షి) :** వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న రజతోత్సవ వేడుకల భారీ బహిరంగ సభకు వేదిక ఖరారైంది. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలోని రింగురోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలాన్ని ఫైనల్ చేయనున్నారు. సభా స్థలాన్ని పరిశీలించేందుకు ఇటీవల వరంగల్‌కు వచ్చిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు శుక్రవారం రెండో సారి వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉనికిచర్ల ప్రాంతంలోని సభా వేదిక స్థలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని. నరేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరవనున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చూడాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు, పార్టీ శ్రేణులకు హరీష్ రావు సూచించారు.

# ఎంపీలు, ఎమ్మెల్సీ తీరుపై బీజేపీ ఎమ్మెల్సీ రాజాసింగ్ లేఖ విడుదల

- కొందరు నాయకులతో పార్టీకి భారీగా నష్టం
- వారు బయటకుపోతేతప్పిదే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు
- రాజాసింగ్ లేఖపై సర్వత్రా చర్చ



**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** పార్టీలో కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖను రిలీజ్ చేశారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ ముఖ్యమంత్రితో కొందరు నేతలు రహస్య సమావేశాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి మీటింగ్లు పెట్టుకుంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. కేంద్ర అధికారులు గమనించాలన్నారు. తెలంగాణ హిందూ సేఫ్‌గా ఉండాలంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. బీజేపీ గవర్నమెంట్ రావాలంటే పాత సామాను బీజేపీ నుంచి బయటికి వెళ్లి పోవాలన్నారు. కేంద్ర అధికారులు దీనిపైన ఆలోచన చేయాలని కోరారు. ఇది నా పార్టీ.. నా అయ్యా పార్టీ అనేవాళ్లు తెలంగాణలో చాలామంది ఉన్నారన్నారు. వాళ్లని రిటైర్ చేస్తేనే తెలంగాణలో బీజేపీకి మంచి రోజులు వస్తాయన్నారు. ఇది తాను కాదు ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ అధికారులు, కార్యకర్తలు ఇదే అనుకుంటున్నారని లేఖలో రాజాసింగ్ పేర్కొన్నారు. గతంలో కూడా బీజేపీని ఒకే సామాజిక వర్గానికి వ్యక్తులు శాసిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం అంతా కూడా రెడ్డి సామాజిక వర్గం చేతిలో ఉందంటూ బాహాటంగానే వ్యాఖ్యలు చేశారు. బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో కిషన్ రెడ్డి ఒకే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు అప్పట్లోనే రాజాసింగ్ లేఖ రాశారు. దీనిపై బీజేపీ జాతీయ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా ఎదిగే అవకాశం ఉంటుందని నెలరోజుల క్రితం రాజాసింగ్ విడుదల చేసి లేఖ కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు కొనసాగిస్తుండగా కొంతమంది బీజేపీ పార్టీ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రహస్యంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సమావేశం అవుతున్నారని, ఇది బీజేపీకి మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో మొదటి నుంచి పేరుకుపోయిన చాలా మంది నేతలను పార్టీ నుంచి బయటకు పంపించి వేయాలని, వాళ్లని పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. దాంతో పాటుగా పార్టీని తమ అయ్య జాగీరుగా భావిస్తున్న వారు బీజేపీలో చాలా మంది ఉన్నారని, వారంతో కొన్ని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే అంటూ ఆరోపణలు చేస్తూ లేఖను రిలీజ్ చేశారు రాజాసింగ్. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నవారి వివరాలు తనకు తెలుసని.. వారిపై త్వరలోనే బీజేపీ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు లేఖలో పేర్కొన్నా రాజాసింగ్. దీనిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.



# చేపల వలకు చిక్కిన కొండచిలువ

**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** పండుగ పూట చేపలు పడదామని చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో వల వేసి చేపల కోసం చూస్తున్నారు. ఇంతలో ఏదో బరువుగా తగలడంతో ఆశగా వలను పైకి గుంజారు. అందులో చేపలకు బదులు కొండ చిలువ ఉండటంతో చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండాపురంలో చోటుచేసుకున్నది. హోలీ పండుగ సందర్భంగా మత్స్యకారులు గ్రామంలోని ఊర చెరువులో చేపల కోసం వలలు వేశారు. ఈ క్రమంలో జాలర్ల వలలో కొండచిలువ పడింది. ఈ విషయం దావనంలా వ్యాపించడంతో కొండచిలువను చూసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకున్నారు.

# శరవేగంగా అమరావతి పునర్నిర్మాణం

- ప్రారంభ పనులకు ప్రధాని మోడీకి ఆహ్వానం



**అమరావతి, మార్చి14 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. గతంలో నిలిచిపోయిన రాజధాని అమరావతి పునఃనిర్మాణంపై దృష్టి పెట్టింది.. ఇప్పటికే అన్ని అడ్డంకులను అధిగమించి.. రాజధాని పనుల ప్రారంభానికి సిద్ధం అవుతోంది.. ఈ నేపథ్యంలో అమరావతి పునఃనిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ప్రభుత్వం ఆహ్వానించింది.. మొన్న ఢిల్లీ టూర్ లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించారు.. ఇప్పుడు రాష్ట్రంలో కూడా ఎన్డీయే ప్రభుత్వం ఉండడంతో ప్రధాని నరేంద్ర మోడీ చేత మళ్లీ రాజధాని ప్రారంభోత్సవం చేయిచాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నారు.. దీని కోసం వచ్చే నెలలో రెండు తేదీలను పరిశీలిస్తోంది ఏపీ ప్రభుత్వం.. అయితే, ప్రధాని మోడీ ఇచ్చే అపాయింట్‌మెంట్ ప్రకారం.. అందులో ఏదో ఒక డేట్ ఫిక్స్ అవుతుందంటున్నాయి ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా వచ్చే నెల మూడో వారంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందంటున్నాయి ఏపీ ప్రభుత్వ వర్గాలు.. రాజధాని అమరావతి ప్రాంతంలో నవ నగరాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.. స్పోర్ట్స్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీల్లో ఏదో ఒకటి ప్రధాని నరేంద్ర మోడీచే శంకుస్థాపన చేయించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది.. కాగా, రాజధాని అమరావతిలో మొత్తం రూ. 64,721 కోట్లతో 73 పనులను అంచనా వేసింది ఏపీ ప్రభుత్వం.. ఆ 73 పనుల్లో 63 పనులకు టెం డర్లు పూర్తి చేశామని ఇప్పటికే మంత్రి నారాయణ వెల్లడించారు.. వాటి విలువ రూ. 39,678 కోట్లని తెలిపిన విషయం విదితమే.. అమరావతి నిర్మాణాలపై అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన ఆయన.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల భవనాల నిర్మాణాలు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని.. సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపి సంస్థలకు లేఖలు ఇస్తామని పేర్కొన్నారు.. మొత్తంగా అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్, ఏడీబీ రూ. 13,400 కోట్లు ఇవ్వడానికి అనుమతి ఇచ్చాయని.. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రూ. 5 వేల కోట్లు, హడ్కో నుంచి రూ. 11 వేల కోట్లు అనుమతివచ్చిందని తెలిపారు.. ఇక, కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ కింద రూ. 1560 కోట్లు ఇస్తుందని కూడా మంత్రి నారాయణ వెల్లడించిన విషయం విదితమే..



# బాలయ్య ఇంటిముందు కారు బీభత్సం

**హైదరాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** నగరంలోని జూబ్లీహిల్స్‌లో సినీనటుడు బాలకృష్ణ ఇంటి వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నంబర్-1 లో బాలయ్య ఇంటి ముందున్న ఫుట్‌పాత్ పైకి శుక్రవారం తెల్లవారుజామున ఓ కారు వేగంతో దూసుకెళ్లి ఫెన్సింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫెన్సింగ్‌తో పాటు కారు ముందు భాగం ధ్వంసమైంది. అయితే, కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఆ కారు.. మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45 మీదుగా చెక్‌పోస్ట్ వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

# తెలంగాణ ప్రజాప్రతినిధులను అవమానిస్తున్న టిటిడి


- సిఫారసు లేఖలను అంగీకరించకపోవడం దుర్మార్గం
- టిటిడితో ఇక తాడోపేడో తేల్చుకుంటాం
- బిజెపి ఎంపి రఘునందన్ రావు హెచ్చరిక



**తిరుమల, మార్చి14 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుమతించకపోతే, రాష్ట్రంలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు కలిసి తిరుమలలో టీటీడీ అధికారులతో తేల్చుకుంటామని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు హెచ్చరించారు. ఇది తెలంగాణ ప్రాజప్రతినిధులను అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల ద్వారా భక్తులకు దర్శన అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు, వేసవి సెలవుల్లో అధిక సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చేందున, తమ సిఫార్సు లేఖల ద్వారా వీరికి దర్శన అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీటీడీ బోర్డు ఇప్పటికే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను ఆమోదిస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అంతేకాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 మంది ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను అంగీకరించిన టీటీడీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలకే ఈ సదుపాయాన్ని పరిమితం చేయడం అన్యాయం అని అన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను సమానత్వంతో అంగీకరించాలని, ఎలాంటి వివక్ష చూపకూడదని కోరారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా జోక్యం చేసుకుని, తెలంగాణ ప్రజాప్రతినిధులకు కూడా ఆంధప్రదేశ్ ప్రజాప్రతినిధులతో సమానంగా ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నటి రన్యారావుకు చుక్కెదురు

- బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన కోర్టు



**బెంగళూరు, మార్చి14 (జనంసాక్షి) :** కన్నడ నటి రన్యారావుకు చుక్కెదురయ్యింది. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకువస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కన్నడ నటి రన్యారావు కు చుక్కెదురైంది. ఆమె బెయిల్ అభ్యర్థనను ఆర్థిక నేరాల విచారణ కోర్టు శుక్రవారంనాడు తోసిపుచ్చింది. ఈ కేసులో రెండో నిందితుడైన తరుణ్ కొండూరు బెయిల్ అభ్యర్థను శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కోర్టు విచారించ నుంది. మార్చి 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రన్యారావును డీఆర్ఐ అధికారులు అదుపులోనికి తీసుకున్నారు. ఆమె నుంచి రూ.12.56 కోట్ల అక్రమ బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెయిలు కోరుతూ ఆమె దాఖలు చేసుకున్న పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుగగా, ఆమెకు బెయిల్ ఇవ్వరాదని కోర్టును డీఆర్ఐ కోరింది. బెయిలుపై ఆమెను విడుదల చేస్తే ప్రస్తుతం జరుగుతున్న విచారణకు అవరోధం కలుగుతుందని, సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని వాదించింది. ఖనికి ముందు, డీఆర్ఐ విచారణలో తన పట్ల అధికారులు అనుచితంగా ప్రవర్తించారని, మానసికంగా వేధించారని, బెదిరించారని రెన్యారావు ఇటీవల కోర్టు విచారణలో ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను డీఆర్ఐ తోసిపుచ్చింది. రన్యారావును అదుపులోకి తీసుకున్నప్పుడు, విచారణ జరిపినప్పుడు రికార్డు చేశామని, చట్టబద్ధంగా, గౌరవప్రదంగా విచారణ జరిపామని తెలిపింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల పాత్ర గుర్తించే దిశగా సిబీఐ దర్యాప్తు జరుపుతుండగా, మనీలాండరింగ్ కోణం నుంచి ఈడీ రంగంలోకి దిగి బెంగళూరు సహా పలు చోట్ల దాడులు చేపట్టింది. మరోవైపు, రెన్యారావు వ్యవహారంలో ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రారావు పాత్ర ఏమేరకు ఉందనే దానిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక సీనియర్ అధికారిని నియమించింది.

# హోళీ శుభాకాంక్షలు తెలిపిన టెక్ దిగ్గజాలు

**న్యూఢిల్లీ, మార్చి14 (జనంసాక్షి) :** దేశ ప్రజలు మరీ ముఖ్యంగా యువత, చిన్నారులు హోలీని ఎంజాయ్ చేస్తున్న వేళ, ఈ పండగను పురస్కరించుకొని ప్రముఖ టెక్ సంస్థలు యాపిల్, గూగుల్ సీఈఓలు టిమ్‌కుక్, సుందర్ పిచాయ్ శుభాకాంక్షలు తెలియజేశారు. 'హోలీ పండగ చేసుకుంటున్నవారందరికీ శుభాకాంక్షలు' అని పోస్టు పెట్టిన కుక్.. ఐఫోన్‌లో తీసిన ఫొటోను షేర్ చేశారు. ఆనందోత్సాహాలతో పండగ చేసుకుంటున్న ఓ అమ్మాయి చిత్రమది. భారత్‌లో హోలీ సంబరాలను గూగుల్ పిక్సెల్ ఫోన్‌లో బంధించిన దృశ్యాలను సుందర్ పిచాయ్ షేర్ చేశారు. ఇక, టిమ్ కుక్ షేర్ చేసిన అమ్మాయి పేరు కుశాగ్రా తివారీ. టాలెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఎగ్జిఫ్ మీడియా సీఈఓ ఆమె. వీరిద్దరూ పెట్టిన పోస్టులపై నెటిజన్లు స్పందిస్తున్నారు

# బిఆర్ఎస్‌కు అధికార మత్తు వీడలేదు

- అందుకే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- మండిపడ్డ పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్



**పెద్దపల్లి, మార్చి14 (జనంసాక్షి) :** ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినప్పటి కీ కూడా ఆపార్టీ లీడర్లకు ఇంకా అహంకారం తగ్గలేదని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వా మి అన్నారు. వారి తీరు చూస్తుంటే ఇంకా అధి కారంలోనే ఉన్నామనే భ్రమలోనే ఉండి ఇష్టా రాజ్యాంగ మాట్లాడుతున్నారని విమర్శించారు. స్పీకర్ పదవిలో ఉన్నవారిని గౌరవించడం మన అందరి బాధ్యతని గుర్తుచేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్ రావు పేట్ లోని శ్రీ మల్లికార్జున స్వామి, దొంగతుర్తిలో వెంకటేశ్వర స్వామి వార్లను ధర్మపురి ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ 'స్పీకర్ పదవిలో ఉన్న వారిని అగౌరవపరిస్తే సస్పెండ్ చేసుడు న్యాయమే. రాష్ట్రరాజకీయాలను నాశనం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే ప్రజలు ఓడించారు. నిన్నఅసెంబ్లీలో దళితుడైన స్పీకర్ పై మాట్లాడిన తీరు దళితలపై మీ వ్యతిరేకత కనిపించింది. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఉంది' అని తెలిపారు. 'గోపాల్ రావు పేట గ్రామంతోమా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. మీరు చూపే ప్రేమ మరువలేనిది. నేను ఎంపీగా ఉన్న రోజుల్లో ఇక్కడ బ్రిడ్జి మంజూరు చేయించా. గ్రామస్తుల కోరిక మేరకు విశాఖ ట్రస్ట్ నుంచి పాఠశాలల విద్యార్థులకు బెంచీలు అందించాం' అని వివేక్ తెలిపారు. అనంతరం ఇటీవల వివాహం జరిగిన పెద్దపల్లి పట్టణానికి చెందిన భూషణ్వేనా రమేష్ గౌడ్ కూతురు, అల్లుడిని ఆశీర్వదించారు. అలాగే పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలువక రాజయ్య ఏర్పాటు చేసిన లంచ్ కు హాజరయ్యారు.

# పాక్ మసీదులో పేలుడు

- పలువురికి గాయాలు



**ఇస్లామాబాద్, మార్చి14 (జనంసాక్షి) :** బలోచిస్థాన్‌లో బీఎల్ఏ ఉగ్రవాదులు రైలు హైజాక్ చేసి పదుల సంఖ్యలో ప్రయాణికులను ఊచకోత కోసిన ఘటన ఇంకా సద్దుమణగక ముందే పాకిస్థాన్‌లో రంజాన్ పండుగ వేళ మరో దుశ్చర్య చోటుచేసుకుంది. ఖైబర్ ఫఖ్తూంక్వా ప్రావిన్స్‌లోని సౌత్ వజరిస్థాన్ మసీదులో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా మధ్యాహ్నంపేలుడు చోటుచేసుకుంది. ఈ పేలుడులో చిన్నపిల్లలతో సహా నలుగురు గాయపడ్డారు. రాజకీయ పార్టీ జమాయిత్ ఉలేమా ఇస్లామ్ నేత అబ్దుల్లా నదీమ్‌ను టార్గెట్‌గా చేసుకుని ఈ పేలుడుకు అగంతకులు పాల్పడినట్టు అధికారులు చెబుతున్నారు. పేలుడు ఘటనలో అబ్దుల్లా నదీప్ తీవ్రంగా గాయపడటంతో అతన్ని, ఇతర క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఈ ఘటనకు తామే బాధ్యులమని ఇంతవరకూ ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదు. గత నెలలో నౌషెరా జిల్లాలోని దారుల్ ఉలూమ్ హఖ్కాని సెమినరీ జరుగుతుండగా ఆత్మహుతి దాడి జరిగింది. ఈ దాడిలో జేయూఐ-ఎస్ నేత మౌలానా హమిదుల్ హఖ్ హుఖ్కాని సహా ఆరుగురు మరణించగా, 15 మంది గాయపడ్డారు. దీనికి ముందు 2023 జనవరి 30న పెషావర్ పోలీస్ లైన్స్ ఏరియాలో జరిగిన బాంబు పేలుడులో 59 మంది మృతి చెందగా, 157 మంది గాయపడ్డారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370